PRAJAPAKSHAM ★

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఎడిటర్ : కె.శ్రీనివాస్‌రెడ్డి

2024, మార్చి
15
శుక్రవారం

హైదరాబాద్ | సంపుటి 26, సంచిక: 267, పేజీలు: 8
ఖమ్మం : 8+8, కరీంనగర్ : 8+8
మహబూబ్‌నగర్: 8, వెల రూ. 5.00

Published from: **Hyderabad**
Khammam, Karimnagar, Mahabubnagar

శిథిలం
రూ॥90/-
పేజీలు:96

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

రాజ్యాంగంలోని
లౌకిక సిద్ధాంతాలకు సిఎఎ వ్యతిరేకం

చట్టం అమలును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన సిపిఐ ఎంపి బినోయ్ విశ్వం

రాజకీయంగా, న్యాయపరంగా పోరాడుతాం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం(సిఎఎ) పై న్యాయపరంగా, రాజకీయంగా పోరాడతామని సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి, పార్లమెంటరీ పార్టీ నాయకుడు బినోయ్ విశ్వం ప్రకటించారు. సిఎఎ తరువాయి 2లో

సిఎఎను నిరసిస్తూ రాష్ట్ర వ్యాపితంగా
విస్తృత ప్రచారం

వామపక్ష పార్టీల రాష్ట్ర సమావేశం నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్

బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, మతోన్మాద, కార్పొరేట్ విధానాలతో పాటు, సిఎఎను నిరసిస్తూ రాష్ట్ర వ్యాపితంగా విస్తృతంగా క్యాంపెయిన్ నిర్వహించాలని వామపక్ష పార్టీల రాష్ట్ర సమావేశం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈనెల 22న సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రం, కళానిలయంలో' వామపక్ష పార్టీల' ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించి, కార్యాచరణను రూపొందించనుంది. వామపక్ష పార్టీల రాష్ట్ర సమావేశం హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య,డిజి. నరసింహారావు, సిపిఐ(ఎం.ఎల్) ప్రజాపంథా నాయకులు రమ,హనుమేష్, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు కె. గోవర్ధన్, ఎం శ్రీనివాస్, ఎంసిపిఐ నాయకులు జి. రవి, ఎస్‌యుసిఐ (యు) నాయకులు మురహరి, తరువాయి 2లో

'ఒకే దేశం-ఒకే ఎన్నిక'పై రాష్ట్రపతి చేతికి నివేదిక

అందజేసిన కమిటీ చైర్మన్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

న్యూఢిల్లీ: దేశంలో ఒకే సారి ఎన్నికలు నిర్వహించేందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటు అయిన కమిటీ తన నివేదికను సమర్పించింది. 18 వేలకు పైగా పేజీలు ఉన్న ఈ నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మాజీ రాష్ట్రపతి కోవింద్ అందచేశారు. వన్ నేషన్ వన్ పోల్ (ఒఎన్ ఒపి)పై కోవింద్ నేతృత్వంలోని కమిటీ తయారు చేసిన నివేదికలో మొత్తం 18,626 పేజీలు ఉన్నాయి. దేశంలో ఒకే సారి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా తరువాయి 2లో

ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం

ప్రజల ఆకాంక్షలన్నింటినీ నెరవేర్చడమే మా లక్ష్యం

త్వరలో ధరణి మోసాలు బయట పెడతాం

అర్హులైన వారందరికీ తెల్ల రేషన్‌కార్డులు

రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

ప్రజాపక్షం/హుజూర్‌నగర్

రాష్ట్రంలో ఇప్పుడు నడుస్తున్నది ఇందిరమ్మ ప్రజాప్రభుత్వమని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రెవిన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు అన్నారు.గురువారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ శివారులో రామస్వామి గుట్ట వద్ద రూ.74.80 కోట్లతో పునరుద్ధరించనున్న 2160 ఇందిరమ్మ ఇండ్ల ఫైలాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న తరువాత గత పది సంవత్సరాలు దొరలకు పాలన కట్టబెట్టడంతో విసుగు చెందిన ప్రజలు మార్పు కోసం ఇందిరమ్మ రాజ్యం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. సిఎం రేవంత్‌రెడ్డితో భద్రాద్రి రాముడు సాక్షిగా పేదలు ఇండ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలు ఆర్థిక సహాయం అందించే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పూనుకుందన్నారు. గతంలో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 17లక్షల ఇండ్లను నిర్మించి పేదలకు ఇండ్లు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గడిచిన 10 సంవత్సరాలు పరిపాలించిన బిఆర్‌ఎస్ పాలనలో 2లక్షల 30వేల ఇండ్లకు టెండర్లు పిలిచి 1లక్షా 29వేల ఇండ్లు నిర్మించి వాటిలో కేవలం 1లక్షా 12వేల ఇండ్లను మాత్రమే పేదలకు పంపిణీ చేసిందన్నారు. మరలా రాజశేఖర్‌రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో సొంత స్థలంలో ఇండ్లు నిర్మించుకునే పేదలకు 3500 ఇండ్ల నిర్మాణానికి రూ.5లక్షలు ప్రభుత్వం తరువాయి 2లో

నూతన ఎన్నికల కమిషనర్లుగా
సుఖ్‌బీర్ సింగ్, జ్ఞానేష్ కుమార్

న్యూఢిల్లీ: భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)కు నూతన కమిషనర్లు (ఇసి)గా మాజీ బ్యూరోక్రాట్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, జ్ఞానేష్ కుమార్ ఎన్నికయ్యారు. అధికారిక ప్రకటన వెలువడక ముందే, కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరీ తన 'ఎక్స్' పోస్టులో ఈ విషయాన్ని వెల్లడించడం గమనార్హం. పిటిఐ కథనం ప్రకారం, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ వీరి పేర్లను ఖరారు చేసింది. వీరిద్దరూ గతంలో కేంద్ర ప్రభుత్వంలోని పలు కీలక విభాగాల్లో సేవలను అందించారు. ఎలక్షన్ కమిషనర్ అనూప్ చంద్ర పాండే ఈ ఏడాది ఫిబ్రవరిలో పదవీ విరమణ చేయగా, మరో ఎలక్షన్ కమిషనర్ అరుణ్ గోయల్ ఇటీవలే తన పదవికి రాజీనామా చేశారు. దీనితో రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఇసిఐ ప్రధాన ఎన్నికల అధికారిగా రాజీవ్ కుమార్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. కాగా, ఆరుగురిలో ఇద్దరు ఇసిల కోసం ఎంపిక ప్యానెల్ పరిశీలనకు ఆరు పేర్లు వచ్చాయి. ఉత్పల్ కుమార్ సింగ్, ప్రదీప్ కుమార్ త్రిపాఠి, జ్ఞానేష్ కుమార్, ఇందీవల్ పాండే, సుఖ్‌బీర్ సింగ్ సంధు, సుధీర్ కుమార్ గంగాధర్ రహతె పేర్లు తమ పరిశీలనకు వచ్చినట్టు ప్యానెల్‌లో సభ్యుడైన అధీర్ రంజన్ చౌదరీ తెలిపారు. 200 మందికి పైగా అభ్యర్థుల జాబితా నుంచి ఆ ఆరుగురి పేర్లను ఎలా షార్ట్ లిస్ట్ చేశారనే దానిపై స్పష్టత లేదని అధీర్ తరువాయి 8లో

ప్రతి గ్రామాన్నీ ఆదర్శంగా తీర్చిదిద్దుతా
కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు **08**

ప్రకృతి వైపరీత్యాల కథనాలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలి
'వాతావరణ మార్పులు' వర్క్‌షాప్‌లో వక్తలు **03**

రామ్‌లీలా మైదాన్‌లో
కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్

కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు.. హామీలు నెరవేర్చాలని డిమాండ్

న్యూఢిల్లీ: వ్యవసాయ రంగానికి సంబంధించి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా రామ్‌లీలా మైదానంలో గురువారం 'కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్' జరిగింది. వేలాదిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అప్పట్లో రద్దయిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020, 2021 మధ్యకాలంలో రైతులు భారీ ఉద్యమాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. ఢిల్లీ సరిహద్దులో సుమారు ఏడాది పాటు కొనసాగిన ఆ మహా ఉద్యమం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఆందోళనకు నాయకత్వం వహించిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలోనే మహాపంచాయత్ జరిగింది. కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా తన పోరాటాన్ని మరింత ఉధృతం చేసింది. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టబద్ధత కల్పించడం, గతంలో ఆందోళన చేసిన వారిపై పెట్టిన కేసుల ఉపసంహరణ, పంట తరువాయి 2లో

కార్మిక కోడ్‌లను రద్దుచేయాలి

ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని, రుణమాఫీ చట్టాన్ని తీసుకురావాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉప సంహరించాలని, 29 ముఖ్యమైన కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని రైతు, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు ఉద్యమంలో మరణించిన 750 మంది కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని, లఖింపూర్ ఖేరి దుస్సంఘటనకు బాధ్యులైన కేంద్ర మంత్రిని కఠినంగా శిక్షించాలని, యువరైతు శుభకరణ్ మరణానికి కారకులైన హోంమంత్రి అమిత్ షా, హరియాణ సిఎం ఎం.ఎల్ కట్టారు రాజీనామా చేయాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం లో 200 పని రోజులను పెంచాలని, రోజుకు రూ.600ల వేతనాన్ని ఇవ్వాలని, 57 సంవత్సరాలు నిండిన రైతులందరికీ నెలకు రూ. 10 వేల పెన్షన్‌ను ఇవ్వాలని తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపులో భాగంగా కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్ర పాలకులకు వ్యతిరేకంగా,రైతు ఉద్యమాన్ని అణచేందుకు కేంద్ర పాలకుల పాశవిక చర్యలను నిరసిస్తూ హైదరాబాద్,ఇందిరా పార్కులోని ధర్నాచౌక్‌లో సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ టి సాగర్ అధ్యక్షతన మాహా పంచాయత్(మహాధర్నా) జరిగింది. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ కన్వీనర్ పశ్యపద్మ మాట్లాడుతూ మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకొస్తే, ఆహార వస్తువుల ధరలు పెరుగుతాయని వినియోగదారులు కొనుగోలు చేసుకోలేరని, దేశ అభివృద్ధి కుంటుపడుతుందని, దీనికి బడ్జెట్‌లో నిధులను తరువాయి 2లో

'రామరాజ్యం'లో ప్రజలంతా సమానులని
బిజెపి ఒప్పుకుంటుందా?

దేశ ప్రజలంతా అడిగే ప్రధానమైన ప్రశ్న ఇదే

ఓట్ల కోసం 'రాముణ్ణి' వాడుకుంటున్నారని అందరికీ తెలుసు

ప్రజలు ఐక్యంగానే ఉన్నారు, మతం పేరుతో శత్రుత్వం సృష్టిస్తున్నది మోడీ ప్రభుత్వమే

లౌకిక ప్రజాస్వామ్యంపై బిజెపి దాడి చేస్తోంది

దేశ భవితకు ఈ లోక్‌సభ ఎన్నికలు అత్యంత కీలకం

బిజెపిని అధికారం నుండి కూలదోయాలి

పిటిఐ ఇంటర్వ్యూలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా



న్యూఢిల్లీ : దేశ లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి జరుగుతున్న ఈ తరుణంలో 2024లో జరుగుతున్న 18వ లోక్‌సభ ఎన్నికలు భారతదేశ భవిష్యత్తును నిర్దేశించే అత్యంత కీలమైన, సంక్లిష్టమైన ఎన్నికలని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా హెచ్చరించారు. గురువారం ఆయన పిటిఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ దేశ లౌకిక ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతున్న పూర్వరంగంలో భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. అయోధ్యలో అట్టహాసంగా జరిగిన రామ మందిరం ప్రారంభోత్సవ కార్యక్రమం రాబోయే ఎన్నికలపై పెద్దగా ప్రభావం చూపించబోదని అన్నారు. శ్రీరాముడిని బిజెపి ఒకేవిధంగా అర్థం చేసుకుందనీ, కానీ దేశ ప్రజలు శ్రీరాముడిని చాలా విభిన్నంగా అర్థం చేసుకున్నారని అన్నారు. శ్రీరాముణ్ణి కాషాయ కూటమి, బిజెపి ఎన్నికల్లో ఓట్ల ప్రయోజనాలకోసం ఉపయోగించుకుంటున్నారని దేశంలో ప్రజలందరికీ తెలుసునని ఆయన అన్నారు. ''ప్రజల దృష్టిలో రాముడు వేరు, బిజెపి దృష్టిలో రాముడు వేరు, ప్రజలు బాగా అర్థం చేసుకున్నారు, రామరాజ్యం అంటే 'అందరూ సమానమే అని అర్థం, వాళ్ళు (బిజెపి,కాషాయకూటమి) రాముడిని, రామాలయాన్ని చూపించి ప్రజలను ఓట్లు అడగలేరు, అసలు 'రాజరాజ్యం' అంటే అర్థం ఏమిటి? 'కంబ రామాయణం' ప్రకారం రామరాజ్యం అంటే పాలనాపరంగా రాజ్యంలో ప్రజలు అందరూ సమానులే అని అర్థం. అలాంటి రాజ్యంలో వివక్ష ఉండదు, పాలనలో పక్షపాతం ఉండదు, అసమానత్వం ఉండదు, అన్యాయం ఉండదు, బిజెపి—ఆర్‌ఎస్‌ఎస్ కాషాయ కూటమి ఈ సత్యాన్ని అంగీకరిస్తుందా? దేశంలో ప్రజలు అడుగుతున్న ప్రధానమైన ప్రశ్న ఇదే'' అని డి.రాజా స్పష్టం చేశారు. ''మనదేశంలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు తదితరులందరూ ఐక్యంగా జీవిస్తున్నారు, వారి మధ్య విభేదాలు లేవు, ప్రభుత్వమే వారిని విభజించి పరిపాలిస్తోంది, ప్రభుత్వమే వారి మధ్య సామరస్యతను చెడగొడుతోంది , మతం పేరుతో ప్రజలమధ్య తరువాయి 2లో

ట్యాంకుబండ్‌పై సాయుధ పోరాటయోధుల విగ్రహాలు

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి

హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలించిన నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన అమరవీరులు బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి, అనభేరి ప్రభాకర్‌రావు లాంటి మహనీయుల విగ్రహాలను రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోని ట్యాంకు బండ్‌పై ఏర్పాటు చేయాలని, తరువాయి 2లో

కాంగ్రెస్ ప్రజాపాలనలో
సంక్షేమం, అభివృద్ధి పరుగులు

నేటికి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు

నాలుగు కోట్ల జనం ఆశలు ఆకాంక్షలతో కొలువు దీరిన ప్రభుత్వం

ఆరు గ్యారంటీలలో నాలుగు గ్యారంటీలు అమలు

విద్యా, వైద్య, ఉద్యోగ, ఉపాధి, రైతు, కార్మిక, పారిశ్రామిక రంగాలలో పలు కీలక నిర్ణయాలు

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి శుక్రవారం వంద రోజులు పూర్తయ్యాయి. నాలుగు కోట్ల జనం ఆశలు ఆకాంక్షలతో కొలువు దీరిన ప్రజా పాలనలో సంక్షేమంతో అభివృద్ధి పరుగులు తీశాయి. ముఖ్యమంత్రిగా ఎ.రేవంత్‌రెడ్డి 2023 డిసెంబర్ 7వ తేదీన అధికారం చేపట్టిన తరువాయి 2లో

ఉద్యమ నేలపై కమల వికాసమా!

సమైక్య జీవనానికి మతోన్మాద తూట్లు
కమలంతో పొంచి ఉన్న ముప్పు

ప్రజాపక్షం/ ఖమ్మం

తెలంగాణ ప్రాంతం చైతన్యానికి, సమైక్య జీవన విధానానికి ప్రతీక. బలమైన శత్రువును సైతం బలహీనులు ఎదుర్కొని నిలిచి గెలిచిన నేల ఇది. సువర్ణక్షత లిఖితమైన సాయుధ పోరాటంతో రక్కసి నిజాం పాలనను అంతమొందించిన ఈ గడ్డపై కమల వికాసమా. అవకాశం కోసమో, అవసరం కోసమో, అందలం ఎక్కాలన్న ఆశతోనో ఈ జెండా ఎత్తుకున్న వారిని ఎత్తుకోవాల ను కునే వారిని నిలువరించాల్సిన బాధ్యత తెలంగాణ ప్రజలపై ఉన్నది. కులం, మతానికి ప్రాధాన్యత లేని సమాజం ఉన్నది కలగలుపుకుని పంచుకుతినే అలవాటు ఇక్కడి ప్రజల సొంతం. ఇటువంటి నేలన ఒకరిపై తరువాయి 2లో

కార్మిక కోడ్‌లను రద్దుచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కేటాయించలేమని నీతి అయోగ్ సభ్యులు ఉద్దేశ పూర్వకంగా దుష్ప్రచారానికి పూనుకున్నారని దుయ్యబట్టారు. ఇది వాస్తవం కాదన్నారు. మద్దతు ధరను అమలు చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఇప్పటి వరకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, వాటి ఖర్చులపైన శ్వేత పత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రకటిస్తున్న 23 పంటలకు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు పంటలకు పెట్టిన ఖర్చుకు అదనంగా 50 శాతం జోడించి మద్దతు ధరలను అమలు చేసేందుకు కేవలం రూ. 26,460 కోట్లు సరిపోతాయని అందాజాలు చెబుతున్నాయని వివరించారు. జాతీయోత్పత్తిలో 18.5 శాతం పంటల దిగుబడి, రైతుల శ్రమ ద్వారా దేశ సంపద ఏర్పడుతున్నదని, రూ.26,460 కోట్లు బడ్జెట్‌లో కేటాయించి, రైతుల న్యాయబద్ధమైన డిమాండ్ నెరవేర్చలేరా అని ప్రశ్నించారు. దేశ సంపద ను సృష్టిస్తున్న రైతులు, కార్మికులు, కష్టజీవులు లేవనెత్తిన న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చకపోగా, దేశ సంపదను శ్రమజీవులను దోచుకుంటున్న కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీని ఓడించేందుకు సమాయత్తం కావాలని పశ్యపద్మ పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ రాయల చంద్రశేఖర్ మాట్లాడుతూ న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేరేంతవరకు పోరాడుతామన్నారు. విస్సా కిరణ్ మాట్లాడుతూ పంట మద్దతు ధరల గ్యారంటీ చట్టంపై బిజెపి చేస్తున్న అబద్ధ ప్రచారాన్ని అడ్డుకునేందుకు గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేయడానికి సిద్ధం కావాలని కోరారు. పంటల మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని అమలు చేసేందుకు రూ. 26 వేల కోట్లు ,ఇతరులు చెప్తున్నట్లుగా కేవలంరూ. 22,000 కోట్లు సరిపోతాయని అంచనాలు వెల్లడించాయన్నారు. అన్ని పంటలకు మద్దతు ధరలు అమలు చేసేందుకు ఆందోళన చేపట్టేందుకు సమాయత్తం కావాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు బి వెంకట్ మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు అమెరికా లాంటి దేశంలో పండుతున్న గోధుమలను మన దేశానికి దిగుమతి చేసుకోవడానికి వీలుగా బిజెపి పాలకులు మన దేశ రైతాంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఇటువంటి చర్యలను వ్యతిరేకించాలన్నారు. ఈ మహాధర్నాలో సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్లు బిక్షపతి, మండవ వెంకన్న, జక్కుల వెంకటయ్య వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.కాంతయ్య,, వెంకటరామ్ కార్మిక సంఘ నాయకులు భూపాల్, సూర్యం, ఎం.శ్రీనివాస్, జనార్దన్, మహిళా సంఘం నాయకులు ఝాన్సీ ,అరుణ, అనురాధ, లిజీ ,సంధ్య, సజయ, దేవి భక్తుల కృష్ణకుమారి ,విద్యార్థి యువజన మత్స్య గిరిజన నాయకులు పాల్గొన్నారు.

కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్

(మొదటి పేజీ తరువాయి)

బీమా సౌకర్యం వంటి వివిధ డిమాండ్లపై లిఖితపూర్వక హామీని ఇచ్చిన మోడీ ప్రభుత్వం సుమారు రెండు సంవత్సరాలుగా వాటిని అమలు చేయడం లేదు. దీనితో ఎస్‌కెఎం మరోసారి ఆందోళన బాట పట్టింది. వివిధ రూపాల్లో ఆందోళనలను కొనసాగిస్తున్నది. ఇటీవల 'ఢిల్లీ చలో' ఆందోళనను చేపట్టింది. అదే క్రమంలో రామ్‌లీలా మైదానంలో మహాపంచాయత్‌ను నిర్వహించి, రైతులకు వ్యతిరేకంగా కేంద్రం అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టింది. ఇప్పటికైనా కేంద్రం రైతులకు అనుకూలంగా వ్యవహరించాలని ఈ మహాపంచాయత్ హెచ్చరిక చేసిందని రైతులు కోరుతున్నారు. 2021 అక్టోబర్‌లో, ఉత్తరప్రదేశ్‌లోని లఖీంపూర్ ఖేరీలో చెలరేగిన హింసకు కారకులైన నిందితులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. లఖీంపూర్ ఖేరీలో రైతులపైకి కారు నడిపిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబ సభ్యులకు నష్టపరిహారంతోపాటు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కాగా, రైతుల సమ్మేళనాన్ని దృష్టిలో ఉంచుకుని సెంట్రల్ ఢిల్లీకి వెళ్లే రూటులను పోలీసులు కట్టుదిట్టం చేశారు. ట్రాక్టర్ ర్యాలీలతో రాజధానికి రావద్దని రైతులను సూచించారు. అదే సమయంలో సరిహద్దుల్లో పారామిలటరీ సిబ్బంది సంఖ్యను పెంచారు. 5,000 మంది కంటే ఎక్కువ మంది గుమికూడవద్దని షరతుతో ఢిల్లీ పోలీసులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి రైతులకు అనుమతి ఇచ్చారు. అయితే, ట్రాక్టర్లను అనుమతించలేదు.

విస్తృత ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు '' పౌరసత్వ సవరణ చట్టం 2019'' (సిఎఎ)ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిందని, ఈ చట్టం మత రాజకీయ దురుద్దేశ్యంతో కూడుకున్నదని వారు తెలిపారు. దేశ ప్రజల సమస్యలను పక్కదోవ పట్టించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద విధానాలను ముందుకు తెస్తున్నదని విమర్శించారు. వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ, దాడులకు పాల్పడుతున్నదని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లోని గవర్నర్ వ్యవస్థను తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటూ, ఆయా ప్రభుత్వాలను పడగొడుతున్నదని దుయ్యబట్టారు. ఈడి, ఐటి దాడులతో ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాల్లో చూపుతూ వాటిని కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ, దేశ సంపదను వారికి దోచి పెడుతోందని విమర్శించారు. కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి, నల్ల చట్టాలను తెచ్చి రైతుల నడ్డి విరుస్తున్నదని మండిపడ్డారు. బిజెపి మతోన్మాద, ప్రజా వ్యతిరేక విధానాలను ఓడించేందుకు వామపక్ష పార్టీల' ఆధ్వర్యంలో ఈనెల 28న చేపడుతున్న రాష్ట్ర సదస్సులో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

సిఎఎ వ్యతిరేకం

(మొదటి పేజీ తరువాయి)

అమలును సవాలు చేస్తూ బినోయ్ విశ్వం గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 'సిఎఎ నిబంధనలు మన రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి, విలువలకు వ్యతిరేకంగా ఉన్నాయి. భారతీయ సమాజంలోని భిన్నత్వంలోని ఏకత్వానికి వ్యతిరేకంగా ఉన్న భయంకరమైన ఈ సిఎఎ చట్టం అమలును నిలిపివేయాలని అభ్యర్థిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాం' అని ఆయన చెప్పారు. సిఎఎను మొదటి నుంచి సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన తెలిపారు. భారతదేశంలోని వివిధ వర్గాల మధ్య ఉద్రిక్తతలు, చీలికలను ప్రేరేపించడానికి బిజెపి విస్తృత ఎజెండాలో భాగంగా ఎన్నికల ముందు రోజుల సిఎఎ చట్టాన్ని అమలులోకి తెచ్చారని విమర్శించారు. విభజన, వివక్షతతో కూడిన చట్టం రాజ్యాంగంలోని విలువలకు విరుద్ధమని సమాజంలోని ప్రతి వర్గం వ్యతిరేకిస్తోందన్నారు. పౌరసత్వం ఇవ్వడానికి మతాన్ని నిర్ణయించడమనేది భారత రాజ్యాంగ స్ఫూర్తిని పూర్తిగా తిరస్కరించడమేనన్నారు. భారతదేశంలో లౌకికవాదం, సమానత్వానికి సిఎఎ మరణశిక్ష అని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సిపిఐ పార్లమెంటరీ పార్టీ కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) 2019కి సంబంధించిన నిబంధనలను నోటిఫై చేసి 2024 సాధారణ ఎన్నికలకు ముందు అమలు చేస్తామని ప్రకటించిందని, సిఎఎ 2019లో ప్రవేశపెట్టిన దశ నుండి దేశంలోని నలుమూలల నుండి భారీ నిరసనలు ఎదుర్కొంది. నాలుగు సంవత్సరాల కింద పార్లమెంటులో హడావిడి చేసినప్పటికీ, సిఎఎ అవసరంగా ఉందని సిపిఐ తెలియజేసింది. పౌరసత్వ సవరణ బిల్లు (సిఎబి) 2019పై పార్లమెంటులో చర్చ సందర్భంగా, దేశంలో పౌరసత్వ చట్టాలకు ప్రతిపాదిత సవరణను బినోయ్ విశ్వం విమర్శించారని సిపిఐ తెలిపింది. భారతదేశంలో ముస్లింలను రెండవ తరగతి పౌరులుగా పరిగణించాలనే గురు గోల్వాల్కర్ ఫాసిస్ట్ ఆకాంక్షను నెరవేర్చడానికి ఈ బిల్లు ఉద్దేశించబడిందని సిపిఐ విమర్శించింది. 2019లో, విభజన సృష్టించే సిఎఎ వ్యతిరేకంగా నిరసన తెలిపినందుకు సిపిఐ కార్యకర్తలతో పాటు మంగళూరులో అప్పటి కర్ణాటక బిజెపి ప్రభుత్వం బినోయ్ విశ్వంను అదుపులోకి తీసుకుందని తెలిపింది. పార్లమెంటులో సిఎఎ హడావిడిగా వచ్చినప్పుడు, లౌకికవాదం, సామరస్యానికి అనుకూలంగా ప్రజల అభిప్రాయాన్ని పెంచుతూ దేశవ్యాప్తంగా వందలాది నిరసన సమావేశాలలో ఆయన ప్రసంగించారని తెలియజేసింది. రాజ్యాంగ ప్రవేశిక నుండి 'సెక్యులర్', 'సోషలిస్ట్' పదాలను తొలగించాలని సుబ్రహ్మణ్యస్వామి చేసిన విజ్ఞప్తికి వ్యతిరేకంగా బినోయ్ విశ్వం కూడా సుప్రీంకోర్టులో పిటిషనర్‌గా ఉన్నారని సిపిఐ గుర్తు చేసింది.

బిజెపి ఒప్పుకుంటుందా?

(మొదటి పేజీ తరువాయి)

శత్రుత్వం సృష్టిస్తున్నది మోడీ ప్రభుత్వమే, బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ కాషాయ కూటమి ప్రజలను మతం పేరుతో విభజించాలని ప్రయత్నం చేస్తున్నది, భారతదేశంపై 'హిందూ మతరాజ్య ముద్ర' వేసేందుకు ప్రయత్నం చేస్తున్నది, దీనిని ఒప్పుకునే ప్రశ్నే లేదు, ఎట్టి పరిస్థితుల్లోనూ దేశ ప్రజలు ఇందుకు సమ్మతించరు, భారతదేశ రాజ్యాంగం చాలా స్పష్టంగా ఉంది, భారతదేశం లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా కొనసాగాలని రాజ్యాంగం చాలా స్పష్టంగా చెప్పింది'' అని డి.రాజా గుర్తుచేశారు.

మనుస్మృతిని తెస్తారా? : బిజెపి ఎంపి అనంతకుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తుచేశారు. ప్రజలు ఈ ఎన్నికల్లో 400 సీట్లు కట్టబెడితే రాజ్యాంగాన్ని మార్చేస్తామని హెగ్డే ఇటీవల అన్నారు అని గుర్తుచేస్తూ, రాజ్యాంగాన్ని మార్చేసి ఆ స్థానంలో ఏం తీసుకురావాలనుకుంటున్నారని, వారి ప్రణాళిక ఏమిటని నిలదీశారు. బిజెపిలో ఎన్నికల్లో ఎంపిలు, నాయకులు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్నారు, పార్లమెంటుకు వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్నారు, రాజ్యాంగాన్ని కుప్పకూల్చేస్తామని ప్రకటనలు చేస్తున్నారు, మరి ఆ స్థానంలో ఏ తెస్తారు? మనుస్మృతిని తీసుకువస్తారా? అందుకే ప్రజలు మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని రాజా అన్నారు.

20 కోట్ల ఉద్యోగాలు ఏమైపోయాయి?

బిజెపి దేశమంతటా ప్రచారం చేస్తున్న 'మోడీ కీ గ్యారంటీ' నినాదం ఒక జుమ్లా అని డి.రాజా విమర్శించారు. ఆ నినాదం ఒట్టి డొల్ల అన్నారు. ఈ విధమైన నినాదాలతో ప్రజలను మోసం చేయాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. దేశంలో యువతీ యువకులకు ఉద్యోగాలు ఇస్తామని మోడీ ఇచ్చిన వాగ్దానాన్ని ఇంతవరకూ నెరవేర్చలేదని, గెలిచిన వెంటనే, స్విస్ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని దేశానికి తిరిగి తీసుకువచ్చి అందరికీ పంచుతామని వాగ్దానం చేశారని, ఆ వాగ్దానం కూడా ఆయన నెరవేర్చలేదని గుర్తుచేశారు. దేశంలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ధరలను ప్రభుత్వం అదుపు చేయలేదని అన్నారు. అందుకే ఈ ఏడాది జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు దేశ ప్రజలకు ఎంతో ముఖ్యమైనవని చెప్పారు. ''మోడీ కీ గ్యారంటీ? ఏమిటి ఆ గ్యారంటీ? మోడీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టాక రెండు కోట్ల ఉద్యోగాలు ప్రతి సంవత్సరం ఇస్తామన్నారు, ఇప్పటికి పది సంవత్సరాలు గడచిపోయాయి, మరి దేశంలో యువకులకు 20 కోట్లు ఉద్యోగాలు సృష్టించవలసి ఉంది, ఆ ఉద్యోగాలన్నీ ఏమయ్యాయి? అందువల్ల అది మోడీ గ్యారంటీ కాదు, గ్యారంటీ లేదు, మోడీ చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలు, ప్రజలకు ఎలాంటి గ్యారంటీ లేదు, ఆయన ప్రజలను అసత్యాలతో మోసం చేస్తున్నారు'' అని డి.రాజా విమర్శించారు. ''నల్లధనాన్ని వెనక్కి తెస్తామన్నారు, దేశంలో ప్రతి పౌరుడికీ రూ.15 లక్షలు ఇస్తామన్నారు, మరి ఏవీ? ఎక్కడా?'' అని ప్రశ్నించారు.

సబ్ కా సాథ్ అన్నారు... రైతులనైనా పట్టించుకోవడంలేదేం?

సబ్ కాసాథ్, సబ్ కా వికాస్ అన్నారు, కనీసం మోడీ దేశంలో రైతుల వెంట అయినా ఉందా? వారి సమస్యలు పట్టించుకుంటోందా? రైతులు ఈనాడు తమ సమస్యలకోసం పోరాటం చేస్తున్నారు, వారిని ఎందుకు పట్టించుకోవడం లేదు'' అని ఆయన ప్రశ్నించారు. రైతులు కనీస మద్దతు ధరలు కావాలని అడుగుతున్నారు, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరుతున్నారు, ఈ కమిషన్ నివేదికలో ప్రతిపాదించిన విధంగా కనీస మద్దతు ధరలు ఇవ్వడం లేదు, మరి ఇక మోడీ గ్యారంటీకి అర్థం ఏముంది? అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో మోడీ గ్యారంటీ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన విమర్శించారు.

మోడీ ప్రభుత్వాన్ని కూలదోయాల్సిందే

''గడచిన పది సంవత్సరాలుగా దేశంలో అత్యంత వినాశకరమైన పరిపాలనను మనం చూస్తున్నాం, గరిష్ట పరిపాలన, కనిష్ట ప్రభుత్వం అని మోడీ భరోసా ఇచ్చారు, కానీ అందుకు విరుద్ధంగా జరుగుతోంది దేశంలో పాలన కనిష్టస్థాయికి కాదుకదా, మైనస్ స్థాయిలో కూడా కొనసాగడంలేదు, దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదపు అంచుల్లో ఉన్నాయి, రాజ్యాంగానికి రక్షణ లేదు, అందువల్ల ఈ ఎన్నికల్లో ఓటు వేసేముందు ఈ విషయాలన్నీ మనం ఆలోచించాలి,ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తుకు ఎంతో ముఖ్యమైనవి, అత్యంత సంక్లిష్టమైనవి, దేశాన్ని దేశ రాజ్యాంగాన్ని కాపాడే విధంగా ప్రజలు తమ ఓటు హక్కును ఉపయోగించుకుంటారని మేం ఆశాభావంతో ఉన్నాం, దేశ ప్రజలు బిజెపిని అధికారం నుండి కూలదోయాలి'' అని రాజా పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా బి.ఆర్.అంబేద్కర్ చెప్పిన మాటలను డి.రాజా ఉటంకించారు. ''దేశ ప్రజాస్వామ్యానికి పార్లమెంటే అత్యున్నతమైన వ్యవస్థ, దేశ ప్రజల సార్వభౌమాధికారానికి పార్లమెంటు ప్రాతినిధ్యం వహిస్తుంది, కానీ వాస్తవానికి పార్లమెంటు అంటే ప్రతిపక్షాలకు సంబంధించినది, ఎందుకంటే ప్రభుత్వం అనుసరించే విధానాలను ప్రతిపక్షాలు ప్రశ్నిస్తాయి, ప్రభుత్వాన్ని పార్లమెంటులో ప్రతిపక్షాలు ప్రశ్నిస్తాయి, అలాంటి పార్లమెంటే గనుక వ్యర్థంగా మారిపోతే దేశంలో ప్రజాస్వామ్యం ప్రాణాలు కోల్పోయినట్టే, అందువల్లనే ఈనాడు బిజెపి ప్రభుత్వం లౌకిక ప్రజాస్వామ్యంపై దాడి చేస్తోంది, అంతిమంగా చూస్తే రాజ్యాంగం తీవ్ర ప్రమాదంలో ఉంది, రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను, సూత్రాలను బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ పనిచేయనివ్వకుండా నిర్వీర్యం చేస్తున్నాయి, భారత రాజ్యాంగాన్ని తిరగ రాయాలని ప్రయత్నం చేస్తున్నాయి, భారత చరిత్రను తిరగ రాయాలని ప్రయత్నం చేస్తున్నాయి, ఈ విధమైన ప్రమాదకర పరిస్థితులమధ్య దేశ రాజ్యాంగాన్ని, దేశ ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వ్యవస్థను, భిన్నత్వాన్ని, సమాఖ్య వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది'' అని డి.రాజా అన్నారు.

రాష్ట్రపతి చేతికి నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యాంగంలోని చివరి ఐదు అధికరణలను సవరించాలని ఈ కమిటీ సిఫారసు చేసింది. ప్రతిపాదిత నివేదికలో లోక్ సభ, రాష్ట్ర అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఒకే ఓటరు జాబితాను రూపొందించడంపై దృష్టి సారించాలని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న రాజ్యాంగ చట్రాన్ని దృష్టిలో ఉంచుకుని లోక్ సభ, రాష్ట్ర అసెంబ్లీలు, మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడానికి గత సెప్టెంబర్‌లో ఏర్పాటైన ఈ కమిటీ పరిశీలించి సిఫార్సులు చేసింది. ఈ నివేదిక తొలి దశలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమాచారం అందించారు. రెండో దశలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరిగిన 100 రోజుల్లోగా ఆయా సంస్థలకు ఎన్నికలు నిర్వహించే విధంగా మున్సిపాలిటీలు, పంచాయతీలను లోక్‌సభ, శాసనసభలతో అనుసంధానం చేయాలని కోరారు. ఇలావుటే, ఒకే దేశం, ఒకే ఎన్నికలు అంటే దేశంలోని అన్ని ఎన్నికలను ఒకేసారి నిర్వహించాల్సి ఉంటుంది. నిజానికి స్వాతంత్ర్యం వచ్చిన కొన్నాళ్లకు లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరిగాయి. అయితే ఆ తర్వాత అసెంబ్లీల రద్దు, ప్రభుత్వ పతనం కారణంగా ఈ సంప్రదాయానికి గండి పడింది. పలు రాష్ట్రాల్లో వివిధ సమయాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే ఒకే సారి ఎన్నికలు జరగడం వల్ల దేశంలో ప్రతి ఏటా జరిగే ఎన్నికలకు వెచ్చించే భారీ మొత్తం ఆదా అవుతుందని కేంద్రం అంటున్నది. జమిలీ ఎన్నికల కోసం మాజీ రాష్ట్రపతి కోవింద్ నేతృత్వంలో ఏర్పాటు అయిన కమిటీలో హోం మంత్రి అమిత్ షా, రాజ్యసభలో ప్రతిపక్ష మాజీ నేత గులాం నబీ ఆజాద్, ఆర్థిక సంఘం మాజీ చైర్మన్ ఎన్‌కె సింగ్, లోక్‌సభ మాజీ ప్రధాన కార్యదర్శి సుభాష్ కశ్యప్, సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే సభ్యులుగా ఉన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరిని కూడా కమిటీలో సభ్యుడిగా నియమించినప్పటికీ ఆయన ఆ ప్రతిపానను తిరస్కరించారు. కాగా, న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉన్నారు. ఈ కమిటీ వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రాజ్యాంగ నిపుణులు, మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్లు, ఎన్నికల సంఘం సభ్యులు, ఇతర సంబంధిత భాగస్వాములతో సంప్రదింపులు జరిపి, విస్తారమైన నివేదికను సిద్ధం చేసింది. అంతేగాక, సమాచారాన్ని సేకరించే క్రమంలో ఏడు దేశాల్లో జరుగుతు న్న జమిలీ ఎన్నికలను పరిశీలించింది. జర్మనీ, జపాన్, ఇండోనేషి యా, ఫిలిప్పీ న్స్, బెల్జియం, దక్షిణాఫ్రికా, స్వీడన్ దేశాల్లో జమిలీ ఎన్నికలను నిర్వహిస్తున్నారు.

కమిటీ ప్రధాన సూచనలు.. : దేశవ్యాప్తంగా అన్ని అసెంబ్లీలు, లోక్‌సభకు దశలవారీగా ఒకేసారి ఎన్నికలు అమలు చేయడం. మొదటి దశలో లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు, రెండో దశలో 100 రోజుల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ. వేర్వేరు సమయాల్లో ఉన్న వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలే జమిలీ ఎన్నికల నిర్వహణకు ప్రధాన అడ్డంకి. కాబట్టి, ఒకేసారి దేశవ్యాప్తంగా అన్ని అసెంబ్లీలు, లోక్‌సభకు ఎన్నికలు నిర్వహించడం కోసం, ఒకసారి లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తరువాత తిరిగి మళ్లీ లోక్‌సభ ఎన్నికలు జరిగే వరకూ అన్ని రాష్ట్రాల అసెంబ్లీల కాల పరిమితిని పొడగించాలి. రాజకీయ అనిశ్చితి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, హంగ్ సభ లేదా అవిశ్వాస తీర్మానం ఏర్పడితే, మిగిలిన కాలానికి కొత్తగా ఎన్నికలు నిర్వహించవచ్చు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తు ప్రణాళిక వంటి ఆచరణాత్మక అంశాలపై దృష్టి పెట్టాలి. పరిపాలనా ప్రక్రియలను క్రమబద్ధీకరించే ప్రయత్నంలో, లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల అధికారులతో సంప్రదించి ఒకే ఓటరు జాబితాను తయారు చేయాలి. ఓటరు గుర్తింపు కార్డులను జారీ చేయాలి. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడంలో ఎదురయ్యే ఆర్థిక సవాళ్లను ఎదుర్కొనే విషయంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)కు చెందిన ప్రాచీ మిశ్రా రాసిన పేపర్‌ను ఈ నివేదికలో పొందుపరిచారు.

కమల వికాసమా!

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకతతోనే, మరొకరిపై నమ్మకం లేకనో మత శక్తులను సమర్థిస్తే ముప్పు తప్పకపోవచ్చు. గత ఎన్నికలలో బిఆర్‌ఎస్ ఓడి కాంగ్రెస్ గెలిచిన నేపథ్యంలో అధికారం ఉంటే తప్ప బతకలేక ఒడ్డున పడిన చేపల్లా గిలగిలలాడే కొందరు కాషాయి జెండ పంచన చేరేందుకు యత్నిస్తున్నారు. ప్రజాస్వామిక శక్తులకు మద్దతుగా నిలవాలి తప్ప మతోన్మాదులకు అండగా నిలిస్తే తెలంగాణ చరిత్రకు మకిల అంటించిన వారిగా మిగిలిపోతారు. ఇప్పటికే బిజెపి బలంగా ఉన్న లేదా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏమి జరుగుతుందో భవిష్యత్తులో తెలంగాణలోనూ అదే జరుగుతుంది. ఇప్పటికే మహత్తర తెలంగాణ పోరాటాన్ని మత పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతుంది. నైజాం ముస్లిం కాబట్టి నైజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని బిజెపి లేదా దాని అనుబంధ మత సంస్థలు, హిందూ, ముస్లిం పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయి. తెలంగాణ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిగింది. ఈ పోరాటంలో ముస్లింలు సైతం పాలు పంచుకున్నారు. సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన ముగ్గురిలో ఒకరైన మగ్దూం మోహినుద్దీన్ ముస్లిం. సాయుధ పోరాటంలో అమరుడైన జనగాం తాలూకా కామారెడ్డిగూడెంకు చెందిన షేక్ బందగి కూడా ముస్లిమే. బందగి పోరాటం భూమి కోసమే జరిగింది. బందగి మరణించిన నాడు కులం, మతం పక్కన పెట్టి సర్వ మతస్తులు ఆయన అంతిమ యాత్రలో పాల్గొన్నారు. అది నాటి తెలంగాణ పోరాట ఘట్టంలో మరువలేని, మరపురాని ఓ ఘటన. ఇటువంటి ఘటనలు తెలంగాణ సాయుధ పోరాటంలో ఎన్నో మరెన్నో చోటు చేసుకున్నాయి. విస్నూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా పిలుపునిచ్చిన వారు సైతం అదే సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. కానీ బిజెపి దీనిని ఒక మత పోరాటంగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేస్తుంది. వాస్తవాన్ని ప్రజలకు తెలియజేసి నేటి తరానికి అందించడంలో ఉద్యమ, లౌకిక శక్తులు వెనకబడటం, బలమైన సోషల్ మీడియా యంత్రాంగం కలిగిన బిజెపి అబద్దాన్ని, కల్పనను వాస్తవంగా చూపేందుకు యత్నిస్తుంది. తద్వారా ముస్లిం వ్యతిరేకత పేరుతో మెజార్టీ హిందువుల ఓట్లు పొంది రాజకీయంగా లబ్ది పొందాలన్నదే బిజెపి ఎత్తుగడ. తెలంగాణ సమైక్య జీవన సౌందర్యం దేశంలో మరెక్కడ కనిపించదు. కులం, మతం ఇక్కడ నామ మాత్రమే. ముస్లిం మతస్తుల పేర్లు పలువురు హిందువులు పెట్టుకోవడం ఇక్కడ తరతరాల నుంచి వస్తుంది. కాశీం, హుస్సేన్, సైదులు ఇలాంటి ఇక్కడ ప్రతి పల్లెలోనూ హిందువులు పెట్టుకోవడం గమనార్హం. అంతే కాదు రంజాన్ పండుగను ముస్లిం ఎలా జరుపుకుంటారో ఆ సందర్భాన్ని హిందువులు అదే రీతిలో పంచుకుంటారు. ఇక హిందువుల పండుగలను ముస్లింలు జరుపుకోవడం కూడా ఆనవాయితీ. ఊళ్లో హిందు దేవాయాల ప్రతిష్టాపన సమయంలో ముస్లింలు వారి కుటుంబ సభ్యులను పిలుచుకుని నూతన వస్త్రాలను బహూకరించడం కూడా ఆనవాయితీగానే వస్తుంది. ఇలా చెప్పుకుంటూ పోతే హిందు, ముస్లింల మధ్య మత ద్వేషం ఏనాడు పొడచూపిన దాఖలు లేవు. ఇప్పుడు రాజకీయ అవసరాల కోసం ఈ గడ్డన బిజెపిని సమర్థిస్తే అంతకంటే రాజకీయ నేరం మరొకటి ఉండక పోవచ్చు. సెక్యూలర్ భావజాలం కలిగిన వారు సైతం తమ రాజకీయ అవసరాలకు కాషాయం నీడన చేరుతున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి బిఆర్‌ఎస్‌ను వెనక్కి నెట్టి తాము రాజకీయ ప్రత్యామ్నాయంగా నిలవాలన్నది బిజెపి ఆశ. ఒకవేళ తెలంగాణలో అదే జరిగితే కాంగ్రెస్‌కు సైతం ముప్పే. ప్రజల భవిష్యత్తుతో పాటు తక్షణ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏదో ముప్పు రావచ్చు. మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో ఏమి జరిగిందో తెలంగాణలోను అదే కథ పునరావృతం కావచ్చు. లౌకిక శక్తుల బలోపేతానికి ఊతమివ్వడమే తెలంగాణ ప్రజల కర్తవ్యం కావాలి. ఆ నిర్ణయమే భవిష్యత్తులో మతోన్మాదం లేని తెలంగాణగా తీర్చిదిద్దుతుంది. ఉద్యమ నేల మీద కమల దళానికి చోటివ్వకపోవడమే చారిత్రిక నిర్ణయంగా మిగిలిపోతుంది.

యోధుల విగ్రహాలు

(మొదటి పేజీ తరువాయి)

అమరవీరుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అనభేరి ప్రభాకర్‌రావు 76వ వర్ధంతి సందర్భంగా గురువారం కరీంనగర్ నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ వద్ద గల ప్రభాకర్ రావు విగ్రహానికి చాడ వెంకటరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఐ కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో వెంకటరెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోలంపల్లి గ్రామంలో భూస్వామ్య కుటుంబంలో జన్మించిన అనభేరి ప్రభాకర్ రావు తన చిన్నతనంలోనే గ్రామాల్లో దేశ్‌ముఖ్‌లు, పటేల్ పట్వారీల పెత్తనం ఒక వైనపు, నిజాం నవాబుల, రజాకార్‌ల ఆగడాలు, ప్రజల చేత వెట్టిచాకిరీ చేయించుకోవడం, మనిషిని మనిషిగా చూడకుండా బానిసలుగా చూడడం సహించే వాడు కాదన్నారు. తన భార్య పిల్లలను వదిలిపెట్టి వెట్టిచాకిరీ రద్దు కోసం దున్నేవానికి భూమి కావాలని, సామాజిక న్యాయం అందరికీ చెందాలని, భూమి కోసం, భుక్తి కోసం, నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా 1947 సెప్టెంబర్ 11న ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి, మాక్దూమ్ మొహియుద్దీన్‌లు తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని తెలిపారు. ఆ పిలుపునందుకుని గ్రామాల్లో అనేక మంది యువకులు కర్రలు, బడిసెలు చేత బట్టి నిజాం సర్కారుకు వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. ఆ వీరోచిత పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను నేటి తరానికి తెలియజేసేందుకు పాలక ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వం అమరుల త్యాగాలను విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా అమరవీరులను స్మరించుకుంటూ వారి ఆశయాలకనుగుణంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, లక్ష్మి , తదితరులున్నారు.

ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

సహాయం చేస్తుందన్నారు. ఇది నిరంతరం ప్రక్రియ అని, ప్రతి సంవత్సరం ఇండ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం చేస్తూనే భవిష్యత్తులో ఇండ్లు లేని వారందరికి ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే 31వేల ఉద్యోగాల నియమాకాలు జరిపామన్నారు. సంవత్సరంలోపు రెండులక్షల ఉద్యోగాలను అందిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్లరేషన్ కార్డులు అందించేందుకు కార్యచరణ ప్రణాళిక మొదలుపెట్టామన్నారు. రైతులకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి గత పాలకులు తమ తప్పిదాలను కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దడానికి ప్రయత్నిస్తున్న విధానాలను రైతులు గ్రహించాలని వారి విమర్శలను తిప్పికొట్టాలన్నారు. బిఆర్‌ఎస్ నాయకులు తమ తప్పిదాలను కప్పి పుచ్చుకునేలా కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లడానికి సిగ్గుండాలన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజల దీవెనెలతో మార్పు కోసం నిజాయితీగా చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. గత పాలకుల పాపాలను, శాపాలను ఇప్పటి ప్రభుత్వంపై రుద్దితే కాంగ్రెస్ శ్రేణులు ఉపేక్షించవద్దని క్షమించవద్దని కోరారు. త్వరలో ధరణి పేరుతో గత పాలకులు చేసిన మోసాలను, వేల కోట్ల ఆస్తులను తమ తొత్తుల పేరు మీదకు ఏ విధంగా మార్చుకుందో త్వరలో బయడపెతామన్నారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ హుజూర్‌నగర్‌లో రూ.74.80 కోట్లతో 2160 ఇండ్లను త్వరలో పునరుద్ధరించి పేద ప్రజలకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. విద్యా, వైద్యం, విద్యుత్ లాంటి అంశాలలో పేదప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలిపారు. హుజూర్‌నగర్ పట్టణాన్ని, నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, రోడ్లు, లిఫ్టులు, పాఠశాలలు లాంటి అన్ని అంశాలను అత్యుత్తమ స్థాయికి మెరుగుపర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చనరవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి,ఎంపిపి గూడెపు శ్రీనివాస్, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే, కాంట్రాక్టర్ మాధవ్‌యాదవ్,కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు,నాయకులు,ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి పరుగులు

(మొదటి పేజీ తరువాయి)

నాటి నుంచే తెలంగాణలో అసలైన స్వేచ్ఛా స్వాతంత్ర్య వాతావరణం వెల్లివిరిసింది. ప్రజలు పోరాడి సాధించుకున్న తెలంగాణ స్వరాష్ట్రంలో ప్రజాస్వామిక శకం ఆరంభమైంది. తొలి రోజున ప్రగతిభవన్ ముందున్న కంచెను తొలగించి మహాత్మగాంధీ జ్యోతిభా పూలే వేదికగా ప్రజావాణి కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతి వారంలో రెండు రోజులు ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు చెప్పుకునే అవకాశం కల్పించింది. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గ్యారంటీల అమలుకు ప్రభుత్వం కంకణం కట్టుకుంది. విధ్వంసానికి గురైన వ్యవస్థలను ఒక్కటొక్కటిగా చక్కదిద్దుతూనే మొదటి వంద రోజుల్లోనే అయిదు గ్యారంటీలను అమలు చేసింది. 2023 డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు 'ప్రజాపాలన' కార్యక్రమం చేపట్టింది. గ్రామ సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అధికారం చేపట్టిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించింది. ఇప్పటికే దాదాపు 23 కోట్ల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. మరోవైపు ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. మహాలక్ష్మి పథకంలో కేవలం రూ.500 లకు గ్యాస్ సిలిండర్ పంపిణీ చేసే పథకాన్ని అమలు చేసింది. అర్హులైన పేద కుటుంబాలకు ఉచిత గృహ విద్యుత్తును అందించే గృహ జ్యోతి పథకం ప్రారంభించింది. 200 యూనిట్లలోపు విద్యుత్ ఉపయోగించే గృహ వినియోగదారులందరికీ జీరో బిల్లు జారీ చేసింది. తాజాగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించింది. రూ.22,500 కోట్లతో 4,50,000 ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. అర్హులైన నిరుపేదలకు సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించనుంది. గూడు లేని వారికి ప్రభుత్వ స్థలంతో పాటు ఆర్థిక సాయం అందిస్తుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.

ప్రకటనలో ప్రభుత్వంవెల్లడించిన ముఖ్యాంశాలు ఈ విధంగా ఉన్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగులకు భరోసాగా నిలబడింది. మూడు నెలల్లోనే 29,384 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందించింది. వీరిలో 53 శాతం పురుషులు, 47 శాతం మహిళలున్నారు. మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్‌మెంట్ బోర్డు, పోలీస్ రిక్రూట్‌మెంట్‌బోర్డు, టిఎస్‌పిఎస్‌సి, సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ నియామకాలు చేపట్టింది.వీటికి అదనంగా సింగరేణిలో 441 మందికి కారుణ్య నియామకాలు కల్పించింది. గత ప్రభుత్వ హయాంలోని రిజర్వేషన్ల వివాదాలు, ఫలితాల నిలిపివేతలు, కోర్టు కేసు లన్నింటినీ ఒక్కటొక్కటిగా అధిగమించింది. టిఎస్‌పిఎస్‌సి బోర్డును ప్రక్షాళన చేసింది. గత పాలకవర్గాన్ని తప్పించి కొత్త ఛైర్మన్ ను, బోర్డు సభ్యులను నియమించింది. యూపీఎస్సీ తరహాలో టిఎస్‌పిఎస్‌సి పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తోంది. ఉద్యోగ నియామకాలతో పాటు జాబ్ క్యాలెండర్ అమలుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 డైరెక్ట్ రిక్రూట్మెంట్ పై దృష్టి పెట్టింది. గత ప్రభుత్వ హయాంలో పరీక్షల నిర్వహణ వైఫల్యాలతో గ్రూప్ 1 పరీక్ష రెండుసార్లు రద్దయింది. కొత్త ప్రభుత్వం అప్పటి పరీక్షను రద్దు చేసింది. 563 పోస్టులతో గ్రూప్ 1 కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది.

గతంలో ఎన్నడూ లేని విధంగా మెగా డీఎస్సీని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 11062 టీచర్ పోస్టుల భర్తీకి ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. గత ప్రభుత్వం విధ్వంసం చేసిన వ్యవస్థలను ప్రజలకు చాటిచెప్పేందుకు రాష్ట్రంలో ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేసింది. విద్యుత్తు విభాగంలో జరిగిన అవినీతి అక్రమాలు అవకతవకలను అసెంబ్లీలోనే వెల్లడించింది. ఇరిగేషన్ విభాగంపై శ్వేతపత్రాలను విడుదల చేసింది.కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపో యిన ఘటనపై విజిలెన్స్ విచారణ చేప ట్టడంతో పాటు నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర జలసంఘానికి లేఖ రాసింది. ముఖ్యమంత్రి, మంత్రులతో పాటు అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి కుంగిన పియర్లను పరిశీలించింది. ఎనిమిదేండ్లుగా పెండింగ్ లో ఉన్న సమస్య పరిష్కారమైంది. ఫలించిన రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు. సీఎం రేవంత్రెడ్డి విజ్ఞప్తికి స్పందించిన కేంద్ర రక్షణ శాఖ. కంటోన్మెంట్ ఏరియాలో రక్షణ శాఖ భూములపై కారిడార్ల నిర్మాణానికి ఆమోదం. మొహిదీపట్నంలో స్కై వాక్ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న రక్షణ భూముల అప్పగింతకు గ్రీన్ సిగ్నల్ హైదరాబాద్–రామగుండం రాజీవ్ రహదారిపై రూ.2232 కోట్లతో భారీ ఎలివేటెడ్ కారిడార్కు మార్చి 7వ తేదీన ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అల్వాల్ సమీపంలో శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు జాతీయ రహదారి 44 పై రూ.1580 కోట్లతో డబుల్ డెక్కర్ కారిడార్ నిర్మాణానికి మార్చి 9న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కండ్లకోయ వద్ద పునాది రాయి వేశారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్ 2 విస్తరణకు ఫరూక్ నగర్ వద్ద ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఫేజ్ 2లో మొత్తం 70 కిలోమీటర్ల కొత్త మెట్రో రైలు మార్గాన్ని నిర్మిస్తారు. 2,700 కోట్లతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఐటీఐలలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్తో ఒప్పందం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో పెట్టుబడులను ఆకర్షించటంలో తెలంగాణ కొత్త రికార్డు. దాదాపు రూ.40,232 కోట్ల పెట్టుబడులు, 30 వేల ఉద్యోగాల కల్పనకు భరోసా. 300 ఎకరాల్లో జీనోమ్ వ్యాలీ ఫేజ్2 త్వరలోనే ప్రారంభిస్తామని బయో ఆసియా2024 సదస్సులో ముఖ్యమంత్రి ఏ.రేవంత్రెడ్డి ప్రకటించారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో 5 లక్షల మందికి ఉద్యోగాల కల్పన. వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు. నేరుగా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వినూత్నంగా రైతు నేస్తం కార్యక్రమం చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2601 రైతు వేదిక లకు వీడియో కాన్ఫరెన్స్ అను సంధానం చేసింది. తొలి విడుతగా 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను నెలకొల్పింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం సహకారంతో రాష్ట్ర వ్యవసాయశాఖ రూ.97 కోట్లతో ఈ కార్యక్రమం చేపట్టింది. ధరణి సమస్యల పరిష్కారానికి అయిదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీ. హైదరాబాద్‌లో ప్రపంచ పర్యాటక ప్రాంతంగా మూసీ పునరుజ్జీవం, పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టు. డిజైన్లు, ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం. హైదరాబాద్‌లో డ్రగ్స్ చలామణిపై ఉక్కుపాదం. నార్కోటిక్స్ నియంత్రణ. టీ.ఎస్.నాబ్ ను గ్రే హౌండ్స్, ఆక్టోపస్ తరహాలో పటిష్టం.సింగరేణి ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా. 43 వేల మంది కార్మికులకు వర్తించేలా కోటి రూపాయల ప్రమాద బీమా. బంజారాహిల్స్‌లో బాబు జగజీవన్ రామ్ భవన్ ప్రారంభోత్సవం. ఎల్బీనగర్ సమీపంలో బైరామల్ గూడా ఫ్లై ఓవర్ ప్రారంభం. ఉప్పల్ సమీపంలో నల్లచెరువు సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్. హైకోర్టు నూతన భవనానికి 100 ఎకరాల స్థలం కేటాయింపు. పారిశ్రామిక అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్ 2050.ఇండియన్ నేవీ రాడార్ స్టేషన్. వికారాబాద్ ఫారెస్ట్ ఏరియాలో దేశంలో రెండో విఎల్‌ఎఫ్ స్టేషన్.ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున నియోజకవర్గాల అభివృద్ధికి 1190 కోట్లు. ఆదిలాబాద్‌లో జాతీయ రహదారుల శంఖుస్థాపన. పింపుల్ కుట్టి ఎలక్ట్రిఫికేషన్ ప్రాజెక్ట్. నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన. మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ కళాశాలకు భూమిపూజ. గద్దర్ విగ్రహం ఏర్పాటు. కవులు కళాకారులు సినీ ప్రముఖులకు గద్దర్ అవార్డ్. స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు శంకుస్థాపన. వాహనాల రిజిస్ట్రేషన్ల నెంబర్ లో ఉండే టిఎస్ ను టిజిగా మార్చటం. 100 కొత్త బస్సుల ప్రారంభం. రాష్ట్ర గీతంగా జయ జయహే తెలంగాణ. అవుటర్ రింగ్ రోడ్డు టోల్ టెండర్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ. గొర్రెల పంపిణీ పథకం, చేప పిల్లల పెంపకం పథకాలపై విజిలెన్స్ అండ ఎన్ ఫోర్స్మెంట్ విచారణకు ఆదేశం. ధరణి పోర్టల్ ఏజెన్సీపై విచారణ. మిషన్ భగీరథ విలేజ్ లెవల్ ఇంట్రా పైపులైన్లు, గ్రామాల్లో పనులపై విచారణ. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ అధికారుల పాత్రపై విచారణ. వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో వందల కోట్ల రూపాయలకుపైగా వ్యాట్ ఎగవేత. విచారణకు ఆదేశించిన ప్రభుత్వం.

ప్రకృతి వైపరీత్యాల కథనాలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలి

'వాతావరణ మార్పులు' వర్క్‌షాప్ లో వక్తలు

ప్రజాపక్షం/హైదరాబాద్: మానవళి మనుగడకు ప్రధాన కారణమైన వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాల కథనాలకు మీడియా తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని పలువురు వక్తలు అన్నారు. ప్రస్తుతం మీడియా సమకాలీన రాజకీయాలు, వ్యాపార సంబంధమైన అంశాలకు తప్ప, ఎంతో కీలకమైన వాతావరణ మార్పులపై వచ్చే కథనాలకు తగినంత ప్రాధాన్యత ఇవ్వడం లేదని వారు అభిప్రాయపడ్డారు. యునైటెడ్ స్టేట్స్ కాన్సులేట్ జనరల్ సహకారంతో, తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె), 'ఫ్యూస్' స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జర్నలిస్టులకు "వాతావరణ మార్పులు" అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్ హైదరాబాద్,బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మానవ తప్పిదాలే ప్రకృతి వైపరీత్యాల రూపంలో సమాజ మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయన్నారు. ఎంతో కీలకమైన వాతావరణ మార్పులను జర్నలిస్టులు కూడా పట్టించుకోవడం లేదన్నారు. వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మీడియాపై ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. యునైటెడ్ స్టేట్స్ కౌన్సెల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న వాతావరణ మార్పులపై జర్నలిస్టులకే ఎక్కువ అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ అభివృద్ధి గమనానికి ప్రధాన కారణమైన వాతావరణ మార్పులపై మీడియా రంగం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని గుర్తు చేశారు. వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కల్పించేందుకు జర్నలిస్టులు ఈ అంశంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉంటే మంచిదన్నారు. ఇలాంటి సదస్సుకు తాము సహకారం అందిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.

ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టులు, సమాజం భవిష్యత్తులో రాబోయే విపత్తు ప్రమాదాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. వాతావరణానికి మీడియాలో తగినంత ప్రాధాన్యత ఇచ్చే పరిస్థితి లేనప్పటికీ, జర్నలిస్టులు దీనిపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకుంటే ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు డిజిటల్ మీడియాలో కూడా విస్తృతంగా సమాచారంతో ప్రజలను చైతన్యపర్చే అవకాశం ఉంటుందని సూచించారు. మీడియా రంగం తాత్కాలికమైన,రాజకీయ అంశాలకు ఇచ్చినంతగా ప్రాధాన్యత వాతావరణ మార్పులకు ఇవ్వడం లేదన్నారు. ఎలాగైతే భారతదేశంలో ప్రజాస్వామ్యం తగ్గిపోతోందని, ఫాసిజం, నియంతృత్వం పెరిగిపోతుందన్న విషయాన్ని ప్రస్తుతం ఎవరు గుర్తించడం లేదని, మరికొన్ని ఏళ్ళ తర్వాత అది ప్రజలకు అనుభవంలోకి వస్తుందని తెలిపారు. వాతావరణ మార్పులపై ఎవరైనా మాట్లాడినా,దీనిని ప్రతికూల పరిణామాలపై ఉద్యమించినా, దీనిని కొన్ని వర్గాలు అభివృద్ధి వ్యతిరేక చర్యగా భావించడం విచారకరమన్నారు. నేడు మానవాళికి పట్టణీకరణ ప్రమాదకరంగా మారిందని, ఒకప్పుడు హైదరాబాద్ కు గ్రామాల నుంచి వచ్చేవారని, ఇది పేదోళ్ల ఊటీగా భావించి,ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేదని ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం కాలుష్య విషంతో హైదరాబాద్ కొట్టుమిట్టాడుతోందన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లో వేసవికాలం జనవరితోనే మొదలయ్యే పరిస్థితి నెలకొందన్నారు. టియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె..విరాహత్ అలీ మాట్లాడుతూ ప్రకృతిలో మార్పులు, పర్యావరణ విపత్తులు అనేవి ఒక ప్రాంతానికో, దేశానికో పరిమితం కావని, ప్రపంచవ్యాప్తంగా గోచరిస్తున్న ఈ పరిణామాలపై జర్నలిస్టులు మరింత అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మానవ మనుగడకు కారణమైన వాతావరణ మార్పులపై ప్రజలను చైతన్య పర్చాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు తమ సంఘానికి అవకాశం కల్పించిన యునైటెడ్ స్టేట్స్ కాన్సులేట్ జనరల్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ వర్క్‌షాపులో ఎన్‌డిటివి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఉమా సుధీర్, ఫ్యూస్ స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భీమ్‌రావు, యూఎస్ కౌన్సిలేట్ సిపిఆర్‌ఓ బాసిత్, సీనియర్ పాత్రికేయురాలు పద్మావతితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి జర్నలిస్టులు పాల్గొన్నారు.

కుటుంబం ప్రాణంతీసిన వారిని క్షమించేది లేదు : టియుడబ్ల్యుజె, ఐజెయు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని టంగుటూరు గ్రామంలో గొలుసుకట్టు మనీ స్కీమ్‌కు ఒక కుటుంబం బలైన సంఘటనలో కొంతమంది విలేకరుల పాత్ర ఉండటం అత్యంత విచారకరమని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె), ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజెయు) గురువారం విడుదల చేసిన ప్రకటనలో వ్యాఖ్యానించాయి. వాస్తవాలను రాయకుండా ఉండటానికి ఒక వ్యక్తి వద్ద డబ్బులు డిమాండ్ చేసిన విలేకరులు వృత్తికి ద్రోహం చేయడమే గాకుండా ఆ క్రమంలో నలుగురి ప్రాణాలు పోవడానికి కారకులు అయ్యారని, ఈ ఘటన మీడియాలోని ప్రతి ఒక్కరూ తలదించుకునేలా చేసిందని టియుడబ్ల్యుజె అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ, ఐజెయు కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి అన్నారు. మీడియాలో నానాటికీ దిగజారుతున్న నైతిక విలువలకు ఉదాహరణగా నిలుస్తున్న ఈ ఘటన అందరికీ కనువిప్పు కలిగించాలన్నారు. ఈ ఘటన నేపథ్యంలో మీడియాలోని ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా మీడియా సంస్థల యాజమాన్యాలు వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. మీడియా ప్రమాణాలను, గౌరవాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టియుడబ్ల్యుజె, ఐజెయు సంఘాలు విజ్ఞప్తి చేశాయి.

గ్రూప్ -1 ఉద్యోగ నియామక పరీక్షల దరఖాస్తు గడువు రెండు రోజులు పొడిగింపు

ప్రజాపక్షం/హైదరాబాద్: గ్రూప్ 1 ఉద్యోగ నియామక పరీక్షలకు దరఖాస్తు గడువును తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిఎస్‌పిఎస్‌సి) మరో రెండు రోజుల పాటు పొడిగించింది. గురువారం సాయంత్రం 5 గంటలతో గడువు ముగియనుండగా, దరఖాస్తు చేసుకునేందుక మరో రెండు రోజుల గడువును కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 563 గ్రూప్ 1 పోస్టులకు గత నెల 19న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. బుధవారం వరకు 2.7 లక్షలకు పైగా దరఖాస్తులు అందాయి. కాగా గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలను జూన్ 9న మెయిన్స్ పరీక్షలను అక్టోబర్ 21 నుండి నిర్వహించనున్నారు.

ఐక్యంగా పరిపాలన : నిరంజన్

ప్రజాపక్షం/ హైదరాబాద్ : వందరోజుల కాంగ్రెస్ పరిపాలనలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నారనే భావన ప్రజల్లో నెలకొన్నదని, కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా ఐక్యంగా పరిపాలన సాగుతోందని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ అన్నారు. అలాగే ఆరు గ్యారెంటీలను అమలు చేసే దిశగా సరైన అడుగులు పడ్డాయన్నారు. ***కాంగ్రెస్ వంద రోజుల పాలనను పురస్కరించుకొని జి.నిరంజన్‌తో ప్రజాపక్షం ఇంటర్వ్యూ***

ప్రశ్న: వంద రోజుల పాలన ఎలా ఉంది?

నిరంజన్: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలను పూర్తి చేసే దిశలో వంద రోజుల పాలన సాగుతోంది. అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు సంతోషంగా ఉన్నారు. క్రమేనా మిగతా గ్యారెంటీలను కూడా అమలు చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. మొదట్లోనో ఆరోగ్య శ్రీని రూ.10 లక్షలకు పెంచారు. ఇప్పుడు సిలిండర్ రూ.500, 200 యూనిట్ల ఉచిత కరెంటు పథకాలు అమలు చేస్తున్నారు. వడ్డీ లేని రుణాల పథకాన్ని కూడా ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ళ కింద జాగా ఉన్న వారికి ఇళ్ళు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తున్నారు. గత ప్రభుత్వం అవినీతితో ఖజానా ఖాళీ చేసినా, భారాన్ని భరిస్తూ ఆరు గ్యారెంటీల దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం సాగుతోంది. సామాజిక న్యాయంలో భాగం గా కొత్తగా కులాల వారీగాకార్పొరేషన్‌లు నియమించడం ముదావహం. కాళేశ్వరం, విద్యుత్‌పై న్యాయ విచారణకు ఆదేశించారు.

ప్రశ్న: పరిపాలన ఎలా సాగుతోంది?

నిరంజన్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలు సుస్పష్టమైన మార్పు చూస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో పని చేస్తున్నారు.ఆయన పనితనం స్పష్టంగా కనపడుతుంది. గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం లేకున్నా నేరుగా సిఎం అయ్యారని, అయినప్పటికీ సమిష్టిగా అందరని కలుపుకొని పరిపాలన సాగించడం సంతోషం. గతంలో మంత్రులగా పనిచేసిన అనుభవం ఉన్న వారు కూడా ఐక్యంగా పని చేస్తున్నారు. ఇది ప్రజలలో మంచి ప్రభావాన్ని చూపిస్తుంది. ఎందుకంటే కాంగ్రెస్ నాయకులు వాళ్ళలో వాళ్ళే ఒకరి కాలు ఒకరు గుంజుకుంటారనే అభిప్రాయాన్ని పటాపంచలు చేశారు. ఎన్నికలకు ముందే మా నాయకులు ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ స్పష్టంగాచెప్పినట్లే నాయకులంతా ఏకతాటిపై పని చేస్తున్నారు.

ప్రశ్న: లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి ఫలితాలు వస్తాయి?

నిరంజన్: కాంగ్రెస్ పరిపాలన ప్రభావాన్ని ప్రజలు చవి చూస్తున్నారు. ముఖ్యమంత్రి 14 సీట్లు వస్తాయంటున్నారు. కచ్చితంగా డబుల్ డిజిట్ స్థానాలు వస్తాయి. అవరమైన చోట్ల కొత్తవారికి సీట్లు ఇచ్చినప్పటికీ, దశబ్దాలుగా పార్టీ కోసం పని చేసే వారికి కూడా ఎంపిస్థానాలలో సముచిత స్థానం ఇవ్వాలనే అభిప్రాయం ఉన్నది.

ఆటో డ్రైవర్లకు అండగా ఉంటాం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లకు స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రమాదభీమా, ఇతర బీమాలను వర్తింపచేసే విధంగా తొలుత 400 మంది డ్రైవర్లకు లబ్ధి చేకూరేలా పథకాన్ని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, రెవిన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ, జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే, ఐఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ చొరవ తీసుకుని ఆటో ఓనర్‌కు, డ్రైవర్‌కు, ప్రమాదానికి గురైన వారికి లబ్ధి చేకూరేలా ఈ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు లబ్ధి చేకూరేలా ఈ పథకాన్ని వర్తింపచేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చనరవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, ఎంపిపి గూడెపు శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, నాయకులు దొంగరి వెంకటేశ్వర్లు, తన్నీరు మల్లిఖార్జున్ రావు, దొంతగాని శ్రీనివాస్‌గౌడ్,అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, చక్కర వీరారెడ్డి, ముడెం గోపిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

డిఎస్‌సికి ముందే టెట్ నిర్వహించాలని ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్: డిఎస్సికి ముందే ఉపాధాయయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.11,062 ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే డిఎస్సి రాయాలంటే టెట్ తప్పనిసరి కావడంత మరోసారి టెట్ పరీక్షకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, సాధ్యమైనంత త్వరగా టెట్ నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల మంది అభ్యర్థులకు ఊరట లభించనుంది.

ప్రజలు, నిరుద్యోగల ఆలోచనలు ప్రభుత్వం వింటుంది : బల్మూరి

ప్రజలు, నిరుద్యోగుల ఆలోచనలను కాంగ్రెస్ ప్రభుత్వం విటుందని మరోసారి రుజువైందని కాంగ్రెస్ ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్ అన్నారు. డిఎస్సి కంటే ముందే టెట్ నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో మూడు లక్షల మంది నిరుద్యోగులకు మేలు జరుగుతుందని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం నిరుద్యోగల వైపు ఉంటుందనేందుకు ఇదే నిదర్శనమన్నారు. టెట్ నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు నిరుద్యోగుల తరపున ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత నిరంతర ప్రక్రియ

జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరంలో గత మూడు నెలల్లో 439 అక్రమ నిర్మాణాలు కూల్చివేసినట్లు జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపా రు. అనధికార నిర్మాణాల గుర్తింపు, కూల్చివేతలు నిరంతరం కొనసాగుతాయన్నారు. టిఎస్ బిపాస్ ద్వారా చెల్లుబాటు అయ్యే అనుమతులు పొందిన తర్వాతనే భవనాలు నిర్మించాలని సూచించారు. అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లను గుర్తించేందుకు జోనల్ కమిషనర్ల నేతృత్వంలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది పనిచేస్తుందన్నారు. టాస్క్ ఫోర్స్ కార్యకలాపాలను జోనల్ కమిషనర్లు నిశితంగా పరిశీలిస్తున్నారని, ప్రారంభ దశలో ఉన్న కొన్ని అనధికార నిర్మాణాలను తక్షణమే కూల్చివేస్తున్నట్లు రోనాల్డ్ రోస్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. నోటీసులలో వారికి వారే తొలగించుకోవాలని స్పష్టం చేస్తామని, లేని పక్షంలో జోనల్ కమిషనర్ నేతృత్వంలోని స్పెషల్ టాస్కఫోర్స్ బృందాలు చర్యలు తీసుకుంటాయని స్పష్టం చేశారు.

కెప్టెన్ డా.బుర్ర మధుసూదన్ రెడ్డికి తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కారం

హైదరాబాద్ : కరీంనగర్‌కు చెందిన ప్రముఖ కవి, విశ్రాంత ప్రిన్సిపల్ కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డికి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం ప్రకటించింది. పత్రికా రచనల ప్రక్రియకు గాను ఈ పురస్కారం ఇస్తున్నట్లు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛ్చాన్స్‌లర్ ఆచార్య తంగెడ కిషన్ రావు బుధవారంనాడు తెలియజేసినట్లు బుర్ర మధుసూదన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆయన కాలమిస్టు, పాఠ్యపుస్తక రచయిత, వ్యక్తిత్వ వికాస వ్యాసకర్తగా బహుముఖ ప్రక్రియల్లో రాణిస్తునన మధుసూదనరెడ్డికి ఈ నెల 20 వ తేదీన తెలుగు విశ్వ విద్యాలయంలో జరిగే కార్యక్రమంలో ఈ కీర్తి పురస్కారాన్ని అందజేస్తారు. ఈ సందర్భంగా పలువురు సాహితీ వేత్తలు, వివిధ కళాశాలల ప్రధానాచార్యులు, హితులు, సన్నిహితులు బుర్ర మధుసూదన్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

ప్రజల ఆత్మగౌరవం కోసమే టిజి

పాత నెంబర్లు యథావిధిగానే కొనసాగుతాయి

బిసి,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : ఆత్మ గౌరవం కోసమే తెలంగాణ ప్రజలు ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నారని ఆ ఆకాంక్ష నెరవేర్చడం కోసం వాహనాల రిజిస్ట్రేషన్లలో నేటి నుండి టీజీగా మార్పు చేస్తున్నట్లు బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. హనుమకొండ కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో నేటి నుండి వాహనాల రిజిస్ట్రేషన్లలో మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. సమైక్య రాష్ట్రంలో ఎపి పేరుతో ఉండగా తెలంగాణ రాష్ట్రం వచ్చాక కూడా తెలంగాణ టిజిగా మార్పు చేయకుండా టిఎస్ పేరుతో గత ప్రభుత్వం వాహనాల రిజిస్ట్రేషన్లు చేయడం జరిగిందన్నారు. సమైక్య రాష్ట్రానికి కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి తేడా అనేది చూపించలేదన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష ఆత్మగౌరవాన్ని కోరుకున్నారని అందుకే తెలంగాణ పేరుతో టిజిగా వాహనాల రిజిస్ట్రేషన్లను ప్రారంభిస్తున్నామన్నారు.

గతంలో ఉన్న ఎపి, టిఎస్ రిజిస్ట్రేషన్లు యథావిధిగా కొనసాగుతాయని అన్నారు. టిజి 11 సీరీస్‌తో వాహనాల రిజిస్ట్రేషన్లు చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను వారి విశ్వాసాలను, ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకే ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని అన్నారు. సకల జనుల ఆత్మగౌరవం కోసమే టిజిగా మార్పు చేసినామని అన్నారు. రాష్ట్రంలో రవాణా శాఖ మహాలక్ష్మి పేరుతో ప్రధానంగా మహిళలకు విశేషమైన సేవలను అందిస్తున్నామన్నారు. ఆర్‌టిసికి గతంలో ఉన్న అప్పు మినహా ప్రస్తుతం లాభాల బాటలోనే కొనసాగుతుందన్నారు. గత సర్కార్ అపటను కూడా తీర్చే ప్రయత్నం చేస్తామన్నా రు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణించే మహిళల జీరో టిక్కెట్‌ల ప్రతీ పైసాను ప్రభుత్వం ఆర్‌టిసికి జమ చేయడం వల్ల ఆర్‌టిసి ఆరోగ్యకరంగా ఉందన్నారు. కావాల్సిన స్థాయిలో మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రాష్ట్రంలో వెయ్యి బస్సులను త్వరలోనే తీసుకురావడం జరుగుతుందన్నారు.

వివిధ స్థాయిలలో కొరత ఉన్న మూడు వేలమంది ఉద్యోగులను నియమించబోతున్నామన్నారు. ప్రజలకు ఇచ్చి న ప్రతీ వాగ్దానాన్ని ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని అన్నారు. జర్నలిస్టులకు టోల్‌గేట్‌లలో మినహాయింపు ఇవ్వాలన్న ప్రతిపాదనను పరిశీలించి అది అమలయ్యేందుకు తమవంతు ప్రయత్నం చేస్తామన్నారు. ఈ సమావేశంలో శాసనసభ్యు లు నాయిని రాజేందర్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని విస్మరిస్తే పతనం తప్పదు

వ్యవసాయోత్పత్తులకు మద్ధతు ధర ప్రకటించాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం

ఎస్‌కెఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాపక్షం/ ఖమ్మం : రైతాంగాన్ని విస్మరిస్తే పతనం తప్పదని గతంలో ఈ విషయం పలుమార్లు రుజువైందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు తెలిపారు. కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం జేబు సంస్థగా మారిందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం పాత బస్టాండ్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి ఆందోళనలు నిర్వహించారు. ఆందోళనను ఉద్దేశించి హేమంతరావు మాట్లాడుతూ గత మూడేళ్లుగా మద్ధతు ధర కోసం రైతాంగం పోరాడుతుంటే మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోక పోగా రైతులపై తూటాలను గుడిపెడుతుందన్నారు. అనేక మంది రైతులు పోరాటంలో ప్రాణాలను కోల్పోయారన్నారు. ప్రభుత్వం రైతుల పట్ల కక్ష్యపూరిత వైఖరి ప్రదర్శిస్తుంది తప్ప సానుకూల ఆలోచన చేయడం లేదన్నారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేవిధంగా మూడు నూతన సాగు చట్టాలను తీసుకొచ్చిందని రైతాంగ పోరాటం వల్ల తాత్కాలికంగా నిలుపుదల చేసినా మరోసారి అమలుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా, అరెస్టులు చేసినా, తూటాలను పేల్చినా సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని హేమంతరావు స్పష్టం చేశారు. వ్యవసాయ రంగం ప్రభుత్వం ప్రోత్సాహం లేక మరింత సంక్షోభంలోకి కూరుకుపోతుందన్నారు. కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రూపాయల రాయితీలిచ్చే బిజెపి ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు మద్ధతు ధర ప్రకటించ మంటే మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. ఇప్పటికే లక్షలాది కుటుంబాలు వ్యవసాయం నుంచి వెనుదిరిగాయని చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ రంగాన్ని వదిలి పట్టణాలలో దినసరి కార్మికులుగా జీవిస్తున్నారని హేమంతరావు తెలిపారు. వ్యవసాయ రంగంపై ఇప్పటికే 65 శాతం మంది ఆధార పడి జీవిస్తున్న ప్రస్తుత పరిస్థితులలో రైతాంగ పోరాటాలు మరింత ఉధృతమవుతాయని హేమంతరావు తెలిపారు.

సిపిఎం రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులను కేంద్ర ప్రభుత్వం దోషులుగా పరిగణిస్తుందని ఆరోపించారు. దేశానికి వెన్నెముకైన రైతులను ఇబ్బందులు పెడుతున్న బిజెపి సర్కార్‌కు రానున్న ఎన్నికల్లో పతనం తప్పదని ఆయన హెచ్చరించారు. కార్పొరేట్ సంస్థలకు, బడా వ్యాపారవేత్తలకు కోట్ల రూపాయల అప్పులను రద్దు చేసిన బిజెపి రైతుల విషయంలో మాత్రం శత్రు ధోరణిని అవలంభిస్తుందన్నారు. ఉద్యమాన్ని విస్తరించి బహుముఖ పోరాటాల ద్వారా ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని ఆయన పిలుపునిచ్చారు.

సిపిఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోడీ కార్పొరేట్ల చట్టంగా, రైతు వ్యతిరేకిగా పనిచేస్తున్నారన్నారు. వేలాది మంది రైతులు మూడేళ్లుగా ఆందోళన చేస్తుంటే సమస్య పరిష్కారానికి కనీస ఆలోచన చేయకపోవడం శోచనీయమన్నారు. గిట్టుబాటు ధర లేక రైతులు అప్పులపాలవుతున్నారని మద్ధతు ధర ప్రకటిస్తే రైతులకు కొంత స్వాంతన చేకూరుతుందని ఆయన తెలిపారు.

ప్రభుత్వం ఇదే రీతిన వ్యవహరిస్తే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు దొండపాటి రమేష్, అడపా రామకోటయ్య, మిడికంటి వెంకటరెడ్డి, తెలంగాణ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొంతు రాంబాబు, మాదినేని రమేష్, రైతు కూలీ సంఘం నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, మాస్‌లైన్ నాయకులు ఆవుల అశోక్, సిపిఐ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, రాజేందర్, ప్రకాష్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం

మొదటి శుక్రవారం రోజునే ఏర్పాటు చేశాం

రంజాన్ ఏర్పాట్లకు నిధుల కొరత లేదు

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్‌కు అత్యంత ప్రాధన్యత ఇస్తున్నదని, అందుకనే మొదటి శుక్రవారం రోజున ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రంజాన్ ఏర్పాట్లకు నిధుల కొరత లేదన్నారు. నెల 15న ఎల్.బి. స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం కోసం చేపడుతున్న ఏర్పాట్లను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు. బందోబస్తు, పార్కింగ్, విద్యుత్, మెడికల్, తాగునీటి సరఫరా, ప్రోటోకాల్, రవాణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఏలాంటి లోపాలు తలెత్తకుండ అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. మైనార్టీ సంక్షేమ శాఖ, పోలీస్, సమాచార శాఖ, జిహెచ్‌ఎంసి, ఆర్ అండ్ బి, విద్యుత్, వాటర్ బోర్డ్, అగ్నిమాపక శాఖ తదితర శాఖలు ప్రణాళిక బద్దంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో తొలి శుక్రవారం రోజున ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వానికి మైనార్టీల పట్ల ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తున్నదని అన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖకు ప్రభుత్వం రూ. 2263 కోట్లను బడ్జెట్‌లో కేటాయించిందని గుర్తు చేశారు. గడిచిన మూడు నెలలో మైనారిటీల సంక్షేమానికి రూ.478.56 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు.

కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాన్సెప్ట్ తరలోనే రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభించడా నికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. అద్దె భవనాల్లో నడుస్తున్న మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలను సొంత భవనాలు ఏర్పాటు చేసేందుకు స్థలాలను సేకరించాల్సిందిగా ఆదేశించామన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖలో మొత్తం ఐదు ఛైర్మన్ పదవులను భర్తీ చేయడంతో పాటు హైదరాబాద్ పాతబస్తీలో మెట్రో లైన్, మీర్‌ఆలమ్‌లో కేబుల్ వంతెనను నిర్మించేందుకు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నట్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులో ముస్లీం సోదరులు నమాజ్ చేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఇఫ్తార్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరికి భోజన సదుపాయాలు అందుబాటులో ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తాగు నీరు, మొబైల్ టాయిలెట్స్ తదితర మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ సయ్యద్ అజ్మతుల్లాహ్ హుస్సేనీ, తెలంగాణ ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్, హజ్ కమిటీ ఛైర్మన్ అఫ్జల్, క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ దీపాక్ జాన్, సిఎం కార్యదర్శి షానవాజ్ ఖాసీం, జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంత రావు, నగర అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, మైనారిటీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్, కాంతి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
పంచాయత్ రాజ్ ఇంజనీరింగ్ విభాగం
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, పిఆర్ డివిజన్ : ఆర్మూర్
NIT No. 191 to 193 /2023-24 (ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు) తేది: 14.03.2024
నిజామాబాద్ జిల్లా, బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలలో మహిళా భవన్, ప్రహరీ గోడ నిర్మాణం, ఇతర పనులు మరియు ఎరువుల గోడౌన్ నిర్మాణం (PACS). మొత్తం అంచనా వ్యయం: రూ. 26.00 లక్షలు, ఈ టెండర్లను దిగువ సంతకందారు ఆహ్వానించడమైనది. ప్రచురించబడిన తేదీ నుండి టెండర్ల షెడ్యూళ్ల ఆఖరి తేది 18.03.2024న ఉ.10.30గం.ల నుండి (7) పనిదినములలోగా NIT ఆన్‌లైన్ ద్వారా టెండరుదారులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇతర వివరముల కొరకు ఆన్‌లైన్‌లో ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
DIPR R.O. No. : 3010-DP/CL/ADVT/1/2023-24 Date: 14-03-2024 సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పిఆర్ డివిజన్ ఆర్మూర్.

ప్రజాపక్షం
శుక్రవారం, మార్చి 15

ప్రజాస్వామ్యానికి చేటుకాలం

లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కాకముందునుండే, 18వ సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరుగుతాయా? అనే సందేహాలు కలుగుతున్నాయి. దేశంలో అధికారపార్టీ చర్యలు, ప్రతిపక్షాల వ్యక్తం చేస్తున్న ఆందోళన ప్రజలను ఆలోచనల్లో పడేస్తున్నాయి. మూడవసారి కూడా తామే అధికారంలోకి వస్తామని, 400 సీట్లు వస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ధీమాగా చెప్తున్న ప్రచారం పెద్దబాలశిక్షలో 'మేకపోతు గాంభీర్యం' కథను తలపిస్తున్నది. ఎన్నికలవేళ హ్యాట్రిక్ సాధిస్తామా? లేదా? అనేది మోడీ అంతరాత్మకు అతిపెద్ద సవాలు. 'ఎదురుదాడే ఉత్తమ రక్షణ అతి పెద్ద ఆయుధం' అనే నానుడి తరహాలో వ్యవహరిస్తూనే, మోడీ 400 సీట్ల నినాదంతో ప్రజలకు మాయ తెరలు కప్పి గట్టెక్కే ప్రయత్నం చేస్తున్నారు. అయోధ్యలో రామాలయాన్ని ఆదరాబాదరాగా ప్రారంభించినప్పుడు 'గోదీ మీడియా' హైప్ సృష్టించింది. ఇక ఆయన తప్ప దేశానికి దిక్కు లేదన్నట్లుగా నిత్య నీరాజనాలకు తెరలేపింది. కానీ తర్వాత రోజురోజుకూ వాస్తవపరిస్థితులను బట్టి బిజెపి కూటమికి గడ్డుకాలం ఎదురవుతున్నది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలను అవినీతిపరులుగా సృష్టించేందుకు అధికారాన్ని అడ్డంపెట్టి దాడులు చేయించి బిజెపి తనకు అనుకూల వాతావరణం సృష్టించే ప్రయత్నం చేస్తున్నది. కేరళ వంటి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను ఆర్థికంగా ఎండగట్టి పరిపాలన స్తంభింపజేయడం, కేంద్ర రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో అధికారాలను కూడా కబళించడం, భావోద్వేగాలు సృష్టించడం, ప్రజలు ఎన్నుకున్న చట్టసభలను అంగడిలో పెట్టి విచ్ఛిన్నం చేయడం, అటు జమ్మూ కశ్మీర్‌లో, ఇటు మణిపూర్‌లో హింస రావణకాష్టంలా సాగుతుంటే మబ్బుతెరలు కప్పడం, దేశ భద్రతకు ముప్పువాటిల్లినా ప్రజలకు వాస్తవాలు వెల్లడించకపోవడం, సైనికులను స్వప్రయోజనాలకోసం బలిపెట్టడం వంటివన్నీ మోడీ హయాంలో సాగుతున్న ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలే.

ప్రతిపక్షం—అసమ్మతి లేకపోతే అసలు ప్రజాస్వామ్యమే లేదు. లౌకిక పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అత్యున్నత చట్టసభను దుర్వినియోగం చేసిన ఘనత, ప్రతిపక్ష అసమ్మతి గళాన్ని, ప్రజా సమస్యలను ఎజెండాలోకి రాకుండా చేసిన ఘన చరిత్ర మోడీకే దక్కింది. కార్పొరేట్‌శక్తుల కనుసన్నల్లో ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాలతో లౌకికప్రజాస్వామ్యంలో పరోక్షంగా మతరాజ్యస్థాపన యత్నాలు జరుగుతున్నాయి. కులం, మతం, వస్త్రధారణ, ఆహార అలవాట్లు, మాట్లాడేభాష తదితర అనేక పేర్లతో దేశ సామాజిక జీవన వ్యవస్థను విభజించేందుకు నిత్యం బిజెపి పాలిత రాష్ట్రాలలో దాష్టీకాలు కొనసాగుతున్నాయి. దళితులు, గిరిజనులు, మైనారిటీల హక్కులు, వారి సాంస్కృతిక, వారసత్వ గుర్తింపును హరించి మనుగడకోసం అనివార్యంగా మెజారిటీ మతవాదాన్ని అంగీకరింపజేసేందుకే మూడోసారి అధికారం సంపాదించాలని కాషాయకూటమి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ప్రజలను విభజించి పాలించే ప్రమాదకరమైన వ్యూహం కిందకు సిఎఎ వంటి చట్టాలను ఎరవేస్తున్నది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో శ్రామికవర్గం ప్రధానంగా అణగారిన కులాలు, దళితులు, మైనారిటీలే. ఆర్థికంగా వారిని అణచివేసే చర్యలను బిజెపి యథేచ్ఛగా కొనసాగిస్తూ భావోద్వేగాలను రెచ్చగొడుతున్నది. దీంతో మైనారిటీలు అభద్రతాభావంలో ఉన్నారు. ఇలాంటి అత్యంత ప్రమాదకరమైన పరిణామాల మధ్య 'రామరాజ్యం' అనే ఊహాజనిత భావనకు ప్రజలందరూ కట్టుబడాలన్న ప్రచారం హిందూ మతానికి వక్రభాష్యం చెప్పడమే. ఊహాజనిత పురాణేతిహాస కథల్లో రామరాజ్యానికి నిజమైన నిర్వచనం ''ఒక రాజ్యంలో ప్రజలు అందరూ సమాన హక్కులు అనుభవిస్తూ సుఖ సంతోషాలతో సోదరుల్లా జీవనం సాగించడమే'' ఇలాంటి సమానత్వ భావనను వెదజల్లే కథలు అన్ని మతాల్లోనూ ఉన్నాయి. కానీ మోడీ ఆచరణలో చేస్తున్నది వేరు, ఎన్నికల ప్రయోజనాల కోసం వల్లెవేస్తున్న ప్రచారం వేరు. మతాన్ని, రాజకీయాలను వేరు వేరుగా చూడాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. రాజకీయాల్లో మతజోక్యం ఉండకూడదని త్యాగమూర్తులైన స్వాతంత్ర్యయోధులు రాజ్యాంగమూలంలో మనకు శిలాక్షరాలతో రాసిచ్చి వెళ్ళారు. దేశాభివృద్ధికి వెన్నుపోటు పొడుస్తున్న నరేంద్రమోడీ ''మహోన్నతమైన భారత్, ప్రజాస్వామ్య వ్యవస్థకు తల్లి వంటిది'' అని ప్రచారం చేస్తూ, దేశంలో మానవ హక్కులు, భావప్రకటనాస్వేచ్ఛ, ప్రజాస్వామ్యాలను కాలరాయడం అపహాస్యంగా మారింది. అందుకే వామపక్షాలు ముఖ్యంగా భారత కమ్యూనిస్టుపార్టీ రానున్న లోక్‌సభ ఎన్నికలు అత్యంత కీలకమైనవని, నిర్ణయాత్మకమైనవని ప్రకటించింది. కార్మిక, కర్షక హక్కులను, దేశ లౌకిక, సామ్యవాద, ప్రజాస్వామ్య వ్యవస్థ మౌలిక స్వరూపాన్ని సంరక్షించుకోవాలంటే మోడీ బూటకపు పాలనకు తెరదించాలన్నదే ప్రధాన నినాదంగా తెరమీదకు వచ్చింది.

ఆర్‌టిసి ఉద్యోగులను...
ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చేదెప్పుడు?

ఉజ్జిని రత్నాకరరావు
9490952646

రాష్ట్ర ప్రభుత్వ ప్రజా రవాణా సంస్థ అయిన ఆర్‌టిసిని కాపాడాలని, ఆర్‌టిసి కార్మికులకు 2017లో, 2021లో ఇవ్వవలసిన రెండు వేతనాల సవరణలు వెంటనే చేపట్టాలని, ఆర్‌టిసి వాడుకున్న సిసిఎస్ నిధులను వెంటనే జమ చేయాలని, తదితర 16 డిమాండ్లతో ఆర్‌టిసి కార్మికులు ఆందోళన చేసిన సందర్భంలో.. త్వరలోనే ఎన్నికలు వస్తున్న వేళ, టిఆర్‌ఎస్ అనుకూల సంఘం వారితో చర్చలు జరిపి, వారు చేస్తున్న డిమాండ్లలో ముఖ్యమైన వాటిని పరిశీలించకుండా వాటిలో ఒకటైన ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని గత ప్రభుత్వం 2023, జులై 31న హామీ ఇచ్చింది. దీనికి సంబంధించిన బిల్లు 2023, ఆగస్టు 6న ఆమోదం పొందింది. సెప్టెంబర్ 14న గవర్నర్ ఆమోదంతో, సెప్టెంబర్ 15న అసెంబ్లీలో బిల్లు పెట్టి..రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడంతో చట్ట రూపంలోకి వచ్చింది.

ఆర్‌టిసి కార్మికుల విలీనంపై స్పష్టత ఏది?

ఆర్‌టిసి కార్మికుల విలీనం చేయడంతో ఈ చట్టం అమలులోనికి రావాలంటే అందుకు అవసరమైన రూల్స్‌ను తయారు చేసి ఏ రోజు నుంచి వాటిని అమలులోనికి తెస్తారో ఇంకా తెలియదు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకొని విలీన ప్రక్రియను ఆలస్యం చేయటంతో 2023 అక్టోబర్‌లోనే రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో విలీన ప్రక్రియకు ముందే పరిష్కారం కావాల్సిన సమస్యలపై స్పష్టత రాకుండా వాటిని పరిష్కరించకుండా కార్మికుల ప్రయోజనాలు ఎలా సురక్షితమౌతాయని దానికి సరైన జవాబు లేకుండా ప్రధానమైన డిమాండ్ అయిన వేతన ఒప్పందాలపై గత ప్రభుత్వం ఎటువంటి స్పష్టత ఇవ్వకుండానే కాలయాపన చేసింది.

నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలి.

ఆర్‌టిసి చారిత్రక నేపథ్యం : తొమ్మిది దశాబ్దాల చరిత్ర కలిగిన ఆర్‌టిసి నిజాం కాలంలో 1932 లో ప్రస్థానం ప్రారంభమైంది. అప్పట్లో 'నిజాం రాష్ట్ర రైల్వే రోడ్డు రవాణా శాఖ' అని పిలిచేవారు. 27 బస్సులు 166 మంది సిబ్బంది ఉండేవారు. స్వాతంత్ర్యానంతరం 1951, నవంబర్ 1న హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది. ఉమ్మడి రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత 1958, జనవరి 11న ఎపిఎస్‌ఆర్‌టిసిగా అవతరించింది. ఉమ్మడి రాష్ట్రంలో 22,600 బస్సులతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వరంగ రవాణా సంస్థగా రికార్డుకెక్కింది. 1999లో గిన్నిస్ రికార్డ్ సాధించింది. 2014 లో రాష్ట్ర విభజన అనంతరం 2015 జూన్ 3న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థగా(టిఎస్‌ఆర్‌టిసి)రూపాంతరం చెందింది. అప్పటికి సంస్థకు 9670 బస్సులతో 98 బస్సు డిపోలు, రాష్ట్రవ్యాప్తంగా 364 బస్సు స్టేషన్లు ఉన్నాయి. ఇందులో 68శాతం.. అంటే సుమారు 6,300 బస్సులు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవలు అందిస్తుండేవి.

స్వరాష్ట్రంలో ఆర్‌టిసికి మొదలైన కష్టాలు: తెలంగాణ ఉద్యమంలో ఆర్‌టిసి కార్మికులు సకల జనుల సమ్మెలో ముందు వరుసలో నిలిచారు. వారు చేసిన సేవలకు గుర్తింపుగా మొదట 43 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించారు. నిర్వహణకు డబ్బులకోసం ప్రభుత్వం గ్యారెంటీగా ఉంటూ అనేక రుణాలు ఇప్పించింది. ఉద్యోగులకు 2013లో ఇవ్వవలసిన ఫిట్‌మెంట్‌ను ఇవ్వకపోవడం, తిరిగి 2017లో చేయవలసిన వేతన ఫిట్‌మెంట్‌ను, 2017 ఏప్రిల్ నాటికి ఉన్న కరువు భత్యం, డిఎ 31.1శాతం బేసిక్ పేను మెర్జి చేసి కొత్త వేతన ఒప్పందం చేయాలి. అలాగే 2021నుంచి రావాల్సిన వేతన ఒప్పందంతోపాటు, 2019 జూలై నుంచి కరువు భత్యం బకాయిలు ఉన్నాయి. వీటిపై కార్మిక సంఘాలు ఆందోళన చేసిన నేపథ్యంలో 2021లో 2013 నుండి రావలసిన ఫిట్‌మెంట్ విడుదల చేసి ఎరియర్ కు బాండ్స్ ఇవ్వడం జరిగింది. గత ప్రభుత్వం పిఆర్‌సి 2017లో 16 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించి అమలు చేయలేదు. ఈ ప్రభుత్వం 16 శాతానికి 5 శాతం కలిపి 21శాతం ఫిట్‌మెంట్ ప్రకటించింది. ఆర్‌టిసికి ప్రభుత్వం ఇవ్వవలసిన రాయితీలు, సబ్సిడీలు గ్రాంట్స్ ఇవ్వక పోవడంతో ఆర్‌టిసి సిసిఎస్ నిధులను 1175 కోట్లు వాడుకుంది. కనీసం నెలవారి ఆర్‌టిసి చేస్తున్న రికవరీలను సైతం సిసిఎస్ లో జమ చేయడం లేదు. అదేవిధంగా పిఎఫ్ కు చెందిన రూ.1330కోట్లు, ఎస్‌ఆర్‌పిఎస్ కు సంబంధించిన రూ.550 కోట్లు, ఎస్‌పిసికి చెందిన

రూ.150 కోట్లకు పైగా ఆర్‌టిసి వాడుకుంది. ఫలితంగా రిటైర్డ్ ఉద్యోగులకు నెలనెలా పిఎఫ్ చెల్లించలేని దుస్థితిలో సంస్థ నెలకొంది.

ఆర్‌టిసి సంస్థ అనేక ఆర్థిక చిక్కుల్లో పడి కొత్త బస్సులు కొనలేక, దాదాపు 3,600 పైగా హయ్యర్(బాడుగ)బస్సులు నడుస్తున్నవి. 53,071 మంది ఉద్యోగులలో ఈ 10సంవత్సరాల కాలంలో 10 వేల మందికి పైగా ఉద్యోగులు రిటైర్ అయ్యారు. కొత్త బస్సులు కొనకపోవటం, పాత బస్సులతో నెట్టుకుంటూ వస్తూ వచ్చారు. కొత్త రిక్రూట్‌మెంట్ లేకపోవడం, డీజల్, ఆయిల్ రేట్లు పెరిగిపోవడంతో ఆర్‌టిసి అప్పులు పెరుగుతూ వస్తున్నాయి. ప్రభుత్వ నుండి ఇచ్చే రాయితీల ఎప్పటికప్పుడు ఇవ్వకపోవడం, జీతాలకు కూడా అప్పులు తేవాల్సిన పరిస్థితి తలెత్తింది. సంస్థకు ఉన్న వేలకోట్ల విలువగల స్థలాలను, డిపోలను కుదువపెట్టి అప్పులు చేయాల్సిన దుస్థితికి చేరుకుంది. కరువు భత్యం ఫిట్‌మెంట్ బకాయిలు 2019 జులై నుంచి చెల్లించాల్సిన ఏడు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయి.

సమ్మె బాట పట్టిన కార్మిక సంఘాలు : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్స్‌ను పరిష్కరించాలని కోరుతూ ఆర్‌టిసిలో ఉన్న సంఘాలు ఏకమై 2019 అక్టోబర్ 3 నుండి సమ్మెబాట పట్టారు. సమ్మెను విచ్ఛిన్నం చేయటానికి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేసింది. చివరికి ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు ఒత్తిడి మేరకు 55రోజుల సమ్మె తర్వాత కార్మిక సంఘాల ప్రతినిధులను ప్రగతి భవన్‌కు పిలిచి చర్చలు జరిపి, భోజనాలు పెట్టి సమస్యలను పరిష్కరిస్తామని చెబుతూ.. ఇకముందు కార్మిక సంఘాలు ఉండవని.. కార్మిక ప్రతినిధులతో డిపో స్థాయి, డివిజన్ స్థాయిలో వెల్ఫేర్ కమిటీలు పెడుతున్నామని, కార్మిక సంఘాల కార్యక్రమాలపై నిషేధం విధించారు. కార్మికులపై పనిభారం మోపారు..

ఆర్‌టిసిలో యూనియన్లను నిషేధించిన ప్రభుత్వం: పెండింగ్‌లో పెట్టిన డిఎలు, 2017, 2021 లోను ఇచ్చే వేతన ఫిట్‌మెంట్స్‌ను వెంటనే చేపట్టాలని సమ్మె చేసిన నేపథ్యంలో ఉద్యోగ సంఘాలపై బిఆర్‌ఎస్ కక్ష గట్టి సంఘాలు నిషేధించింది. యూనియన్ నాయకులపై ఆంక్షలను విధించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానాలు అమలు చేయాలి : నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌టిసి సంస్థను పరిరక్షించుకుంటామని, వారికి ఇవ్వవలసిన వేతన ఫిట్మెంట్ తో పాటు బకాయి పడిన డిఎలు అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టులో హామీ ఇచ్చిన నేపథ్యంలో ఆర్‌టిసిపై దృష్టి పెట్టినట్టు కనిపిస్తుంది. 100 రోజుల పాలనలో ఆర్‌టిసికి 2500 కొత్త బస్సులను సంస్థకు కొనుగోలు చేస్తున్నామని, ఇప్పటికే 250 బస్సులను సమకూర్చినామని, మహాలక్ష్మి స్కీం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రోజుకు 25లక్షల మంది బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. వారి చార్జీల కింద ప్రతినెలా రు.350కోట్లు ఆర్‌టిసికి ఇస్తున్నాం. దీంతో ఆర్‌టిసి ఆర్థిక ఇబ్బందులు నుండి బయటపడుతుంది. ఆర్‌టిసి ఎన్నో ఇబ్బందుల్లో ఉన్న ఉద్యోగుల సంక్షేమం కోసం 21 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. డిఎ, ఎరియర్స్ ను గూడ చెల్లిస్తామని, ఈ వేతనాలు పెంపు నిర్ణయంతో ఒక్కొక్క ఉద్యోగి జీతం రూ.8 వేల నుంచి 11 వేలవరకు పెరుగుతుందన్నారు. పెంచిన ఫిట్‌మెంట్ వలన ప్రభుత్వపై ఏడాదికి రూ.418.11 కోట్ల భారం పడుతుందని, దీనివలన 53,071మందికి లబ్ధి చేకూర్తుందని రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ తెలుపుతున్నారు. గత బిఆర్‌ఎస్ పాలనలో సంస్థలో 53 వేల ఉద్యోగుల నుండి 43 వేలకు తగ్గినా రు. నూతన రిక్రూట్మెంట్ కూడా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

బస్సుల సంఖ్యను పెంచుతాం.. ఆర్‌టిసిని బలోపేతం చేస్తాం అని, ఆగిపోయిన రూట్లలో బస్సులు నడిపించేందుకు చర్యలు చేపడతామని అందుకు ప్రభుత్వం సహకరిస్తుందని.. సంస్థ ఎండి సజ్జనార్ ప్రకటించారు.

ఆర్‌టిసి ఉద్యోగుల కోర్కెలు : ఆర్‌టిసి ఉద్యోగుల కోరికలలో ప్రధానమైనది సర్వీస్ కండిషన్స్. ప్రభుత్వ ఉద్యోగులకు అమలవుతున్న మెరుగైన సర్వీస్ కండిషన్స్ అమలు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న సదుపాయాలను కొనసాగించాలి. రిటైర్డ్ ఎంప్లాయిస్ మెడికల్ స్కీం కొనసాగించాలి. రిటైర్ అయిన వారికి కార్పొరేట్ వైద్యంకోసం ఇస్తున్న రూ.4లక్షలను రూ.10లక్షలకు పెంచాలి. పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలి, ఆర్‌టిసి కార్మికులపై అధికారుల వేధింపులు భరించలేని స్థాయిలో ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన తర్వాతనైనా ఈ పరిస్థితుల్లో మార్పు రావాలి. ఆర్‌టిసి సంస్థ మెరుగుకొరకు, ఆర్‌టిసి సంస్థకు ఉన్న ఆస్తులను కాపాడుకుంటూ ఆదాయం పెంచుకునే విధంగా, ఆర్‌టిసి అభివృద్ధికి వాడుకునేలా చూడాలి. సంస్థలోని ఉద్యోగులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కావాలి.. పల్లెపల్లెకు ప్రభుత్వ రవాణ బస్సు నడిపించాలని ఉద్యోగులు కోరుకుంటున్నారు..

(నోట్: టిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభ మార్చి 16, 17 తేదీలలో ఖమ్మంలో జరుగుతుంది.)

లేఖలు

కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

తెలంగాణ రాష్ట్రంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. అయితే ఈ పనులకు వెళ్లే కూలీలకు త్రాగునీరు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స(ఫస్ట్ ఎయిడ్ కిట్లు) అందుబాటులో ఉంచాలి. అదేవిధంగా వారికి ఎండ తగలకుండా సేద తీర్చుకోవడానికి టెంట్ వేయించాల్సి ఉంది. పనులు ప్రారంభమై రోజులు గడుస్తున్నా చాలా ప్రాంతాలు, గ్రామాల్లో అవి అందుబాటులో ఉంచడం లేదు. వారికి సర్కారు నిర్ణయించిన సౌకర్యాలు కల్పించడం లేదు. తాగడానికి మంచినీళ్లు కూలీలు తమ ఇళ్ల నుంచే తెచ్చుకుంటున్న పరిస్థితి కన్పిస్తుంది. మధ్యాహ్నం 12 గం.ల వరకు పనిచేయిస్తున్నారు. కూలీల ఆరోగ్యం, వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించాలి. వసతులు కల్పించాలి. పైన పేర్కొన్న ప్రతి ఒక్కటి అందుబాటులో ఉంచాలి.

తలారి గణేష్

పివి కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయాలి

కేంద్రప్రభుత్వం ఒక మహా మేధావి, దేశ ఆర్థిక సంస్కరణల ఆద్యుడు మాజీ ప్రధాని పివి నరసింహారావుకు భారతరత్న పురస్కారం ఇచ్చి అపూర్వంగా గౌరవించడం అత్యంత సంతోషదాయకం. ఇదే విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం ఆ తత్వవేత్త కాంస్య విగ్రహాలను డాక్టర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం ఆవరణలో, శాసనసభ భవన ప్రాంగణంలో ఏర్పాటుచేసి గౌరవించాలి. బహు భాషవేత్త పివిని గౌరవించడం అంటే మన తెలంగాణ ముద్దుబిడ్డను మనమే గౌరవించుకోవడమే. ఈ విగ్రహాలు ఏర్పాటు చేయటం ద్వారా భవిష్యత్ తరానికి ఎల్లవేళలా గుర్తుగా ఉంటుంది. వందిమాగధులు, భజనపరులు, అంగబలం లేని రాజనీతిజ్ఞుడు. ఉచిత పథకాలతో ప్రజలను ఆకర్షించడానికి ప్రయత్నించకుండా వారు తామంతట తాము తమ కాళ్ళపై నిలబడుటకు ఆర్థిక సంస్కరణలు గావించి తద్వారా దేశ స్వయం సమృద్ధికి బాటలు వేసిన మహోన్నతవ్యక్తి. పివి ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పదవి కోసం ప్రాకులాడకుండా భూసంస్కరణలు గావించి ఆదర్శప్రాయంగా నిలిచినారు.

మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ కి అత్యంత విశ్వాసనీయమైన వ్యక్తిగా రాజీవ్‌గాంధీకి ముఖ్యమైన సలహాదారుగా కాంగ్రెస్ పాలనలో కేంద్ర ప్రభుత్వంలో విశిష్ట స్థానాన్ని పొందినారు. పివి కాంశ్య విగ్రహాలను ఇంకా ట్యాంక్‌బండ్‌తో పాటు అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో కూడా ఏర్పాటు చేయాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు పివి కాంస్య విగ్రహాలను అతి త్వరలో ఏర్పాటు చేస్తారని ఆశిస్తున్నాను.

దండంరాజు రాంచందర్ రావు

సుదీర్ఘ న్యాయ పోరాటానికి కేరళ ప్రభుత్వం సిద్ధం



పి. శ్రీకుమారన్

బిజెపియేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బ తీస్తూ, 'బ్లాక్ మెయిల్' రాజకీయాలకు పాల్పడుతున్న కేంద్రంలోని మోడీ సర్కారుపై కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో సుదీర్ఘమైన న్యాయపోరానికి సిద్ధమైంది. కేరళ నికర రుణ పరిమితిని తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం రాజకీయ కక్షగానే కనిపిస్తున్నది. ఈ ఏకపక్షమైన, అన్యాయమైన నిర్ణయం సమస్యను పరిష్కరించుకోవడానికి, ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ నేతృత్వంలోని కేరళ ప్రతినిధి బృందం సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్రంతో చర్చలు జరిపింది. అయితే, రాష్ట్ర వాటా కోసం సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుంటేనే, రూ.13,000 కోట్లు విడుదల చేస్తామని కేంద్రం స్పష్టం చేసింది. దీనితో చర్చలు పురోగతి సాధించలేకపోయాయి. కేసు ఉపసంహరించుకోవాలంటూ ఒత్తిడి తేవడం, అప్పుడే నిధులు విడుదల చేస్తామని భీష్మించడం ముమ్మాటికీ బ్లాక్‌మెయిలింగ్ చర్యలుగానే భావించాలి. కేరళలో సంక్షేమ పథకాలు సక్రమంగా అమలుకాకుండా చూడాలని మోడీ సర్కారు కోరుకుంటున్నది. పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రతిష్టను కోల్పోతే, అది పరోక్షంగా బిజెపికి ఉపయోగపడుతుందన్న మోడీ సర్కారు అభిప్రాయం స్పష్టంగా తెలుస్తున్నది. నిజానికి కేంద్రం నుంచి కేరళకు కనీసం రూ. 25,000 అందాలి. ఆ మొత్తంలో దాదాపు సగం మాత్రమే ఇస్తామనడం, అది కూడా సుప్రీం కోర్టులో కేసు ఉపసంహరణ తర్వాతే విడుదల చేస్తామని చెప్పడం రాజ్యాంగ విలువలను దిగజార్చడమే. ముందస్తు షరతులతో రాష్ట్రాన్ని ఇరుకున పెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటో స్పష్టమవుతునే ఉంది. కేంద్రం ఎత్తుగడను పసిగట్టిన కేరళ, కేసు ఉపసంహరణ ప్రతిపాదనకు అంగీకరించలేదు. హక్కుగా అందాల్సిన మొత్తం కోసం రాజీ పడడానికి సుముఖత వ్యక్తం చేయలేదు. తాత్కాలిక లాభం కంటే, దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, కేంద్ర ప్రభుత్వంపై సుప్రీం కోర్టులో న్యాయ పోరాటం చేయాలని తీర్మానించింది. కేరళ పిటిషన్ సుప్రీం కోర్టులో మార్చి 6, 7 తేదీల్లో విచారణకు వస్తుంది. అంతకు ముందు, ఇదే అంశంపై కోర్టులో జరిగిన వాదన సందర్భంగా, కేరళకు చెల్లించాల్సిన డబ్బును వెనక్కి తీసుకోలేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. 2004—2014 మధ్యకాలంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ పాలనలో కేరళకు పన్నుల పంపిణీ రూ.46,303 కోట్లుగా నిర్మల పేర్కొన్నారు.

2014—2024లో ఇది రూ.1,50,140 కోట్లకు పెరిగిందని చెప్పారు. అయితే, ఈ పెరుగుదల కేంద్ర ప్రభుత్వ గొప్పతనమేమీ కాదు. కాలానుగుణంగా పెరగడం అనేది సహజం. నిర్మల సమర్పించిన గణాంకాలు ఒక కాల వ్యవధిలో చోటు చేసుకునే సహజ పెరుగుదలను మాత్రమే సూచిస్తుంది. కేరళకు కేటాయించిన పన్ను శాతాన్ని పరిశీలిస్తే అసలు చిత్రం బయట పడుతుంది. ఉదాహరణకు, జిఎస్‌టి అమలుకు ముందు కాలంలో, కేరళ పన్ను వాటా 2004—2014 మధ్య కాలంలో మూడు రెట్లు పెరిగింది. కానీ 2013—2024లో వృద్ధి కేవలం 2.8 శాతం మాత్రమే. 2004—05 నుండి 2023—24 మధ్య భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) పది రెట్లు పెరిగినప్పటికీ, కేరళ అదనుగుణంగా ఆదాయాన్ని పొందలేదు. కేరళ వాటా రూ.2,405 కోట్ల నుంచి రూ.21,256 కోట్లకు మాత్రమే పెరిగింది. వాస్తవానికి, ఇది 20 శాతం ఎక్కువగా ఉండాలి. అంతేకాకుండా, కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే సెస్, సర్‌చార్జిల నుండి కేరళ తన వాటాను పొందినట్లయితే అదనంగా రూ.20,000 కోట్లకు అర్హత పొందుతుంది.

2010లో, సెస్, సర్‌చార్జీలు రాష్ట్రాలకు పంపిణీ చేయనవసరం లేదు. అది కేంద్ర ప్రభుత్వం పన్ను రాబడిలో కేవలం 10 శాతం మాత్రమే. 2019—20 నాటికి ఇది 18 శాతానికి, 2021—22 నాటికి 28.1 శాతానికి పెరిగింది. ఇది చాలదన్నట్లు రాష్ట్రాలు గ్రాంట్లలో కూడా భారీగా కోత పడింది. పలు రకాలుగా కోతపడిన మొత్తాలను తిరిగి రాబట్టుకోవడానికి కేరళ కృషి చేస్తున్నది. రాజ్యాంగ బద్ధంగా తనకు ఉన్న హక్కును వినియోగించుకోవడానికి పోరాడుతున్నది. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీ బిజెపి సర్కారు అనుసరిస్తున్న విధానాలను కూడా ఎండగడుతున్నది. రేషన్ షాపుల్లో ప్రధాని నరేంద్ర మోడీ ఫొటోను ప్రదర్శించడానికి కేరళ నిరాకరించింది. ఈ విషయంలో కేంద్ర ఉత్తర్వును అమలు చేయడానికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అంగీకరించలేదు. ఈ ఉత్తర్వును బిజెపి ఎన్నికల ప్రచారంలో ఒక భాగంగా అభివర్ణించారు. ఈ అంశాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి జిఆర్ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం, కేరళలోని 14,000కు పైగా రేషన్ షాపుల్లో మోడీ ఫొటోలను ప్రదర్శించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ఆహార శాఖ, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వ చిహ్నం ఉన్న క్యారీ బ్యాగుల్లోనే రేషన్ సరుకులను పంపిణీ చేయాలని కూడా స్పష్టం చేసింది. ఎన్నికల ప్రచారానికి రేషన్ పంపిణీ వ్యవస్థను దుర్వినియోగం చేయడం సరికాదంటూ, ఆ పని చేయడానికి తమ రాష్ట్రం సిద్ధంగా లేదని అనిల్ అన్నారు.

ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) కింద నిర్మించిన ఇళ్లను బ్రాండింగ్ చేయాలని గతంలో కేంద్ర ప్రభుత్వం చేసిన ఆదేశాలను కూడా కేరళ తోసిపుచ్చింది. కేరళలో, ఎల్‌ఐఎఫ్ఇ మిషన్ కార్యక్రమం కింద గృహాలను నిర్మించారు, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 80 శాతానికి పైగా ఖర్చును భరిస్తుంది. అలాంటి పథకంలో కేంద్ర ప్రభుత్వ పెత్తనం విచిత్రం. దానిని తన సొంత రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవాలనుకోవడం, పతనమవుతున్న కేంద్ర ప్రభుత్వ నైతికతకు తార్కాణం. ఏదిఏమైనా, సమాఖ్య భావన గొంతు నొక్కి, దేశం మొత్తం తన ఆధీనంలోనే ఉండాలనుకుంటున్న మోడీ ప్రభుత్వానికి కేరళ ఎదురు నిలుస్తున్నది. ఈ విషయంలో సుదీర్ఘ న్యాయ పోరాటానికి సిద్ధమైంది. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకున్న నిధులను విడుదల చేయాలన్న తమ డిమాండ్‌కు సుప్రీంకోర్టు న్యాయం చేస్తుందని కేరళ భావిస్తోంది.

ఒక రకంగా చెప్పాలంటే నిధుల విడుదలకు ముందస్తు షరతులు పెట్టి కేంద్ర ప్రభుత్వం కేరళకు మేలు చేసింది. కేంద్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా ప్రత్యేకించి ఆర్థిక విషయాల్లో తమ పట్ల వివక్ష చూపుతోందన్న కేరళ వైఖరిని మాజీ మొండితనం రుజువు చేస్తుంది. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంపై ఈ ఆర్థిక వివక్ష సమస్యను అధికార ఎల్‌డిఎఫ్ తన ఎన్నికల ట్రంప్‌కార్డులో ఉపయోగించునే అవకాశం లేకపోలేదు.

(ఐపిఎ సౌజన్యంతో)

ఆకాశమే హద్దుగా..కలల సౌధంలోకి..

మహిళ

ఆమె... కలలను నిజం చేసుకోవడానికి గ్రామాన్ని విడిచింది. సమస్యలకు ఎదురీదింది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మడమ తిప్పకుండా అనుకున్నది సాధించింది. ఆ గిరిజన బాలికే శివలక్ష్మి. మురళీధరన్, జయలక్ష్మి చిన్న కుమార్తె శివలక్ష్మికి చిన్నతనం నుంచి పైలట్ అవ్వాలని ఆశ. కానీ, పరిస్థితులు తన ఆశలను నెరవేర్చుకోవడానికి ఏమాత్రం అనుకూలంగా లేవు. దక్షిణ కేరళలో మారుమూలన ఉన్న వితుర ఆమె గ్రామం. రెక్కాడితేగానీ డొక్కాడని కని తెగకు చెందిన గిరిజన కుటుంబం. పైగా తండ్రి మురళీధరన్ పక్షవాతం తో మంచానికే పరిమితమయ్యాడు. తల్లి జయలక్ష్మి రోజం తా కష్టపడి పనిచేస్తేనే, వారికి రోజు గడుస్తుంది. ఇలాంటి దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న వారు ఎవరైనా రాజీ పడతారు. కానీ, కష్టాలకు కుంగిపోయి, పరిస్థితులకు లొంగిపోయి నిశ్శబ్దంగా కూర్చునేతత్వం లేని శివలక్ష్మి తన లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలతో శ్రమించింది. ప్రతిష్టాత్మకమైన రాజీవ్ గాంధీ ఏవియేషన్ అకాడెమీ నుంచి స్టూడెంట్ పైలట్ లైసెన్స్ పొందిన తొలి కని తెగ మహిళగా రికార్డు పుటల్లో చోటు సంపాదించింది. ఆమె తీసుకున్న సర్టిఫికెట్ వెనుక ఎన్ని సం.ల కఠిన తపస్సు దాగుందో? కేరళ ప్రభుత్వ స్కాలర్‌షిప్ ఆమె విజయాన్ని చూసి ఎంతగా మురిసిపోయిందో? ఆకాశంలోకి ఎగరాలనే కలలను సాకారం చేసుకోవడానికి శివలక్ష్మి ప్రారంభించిన ప్రయాణం సామాన్యమైనదేమీ కాదు. స్టూడెంట్ పైలట్ లైసెన్స్ ఆమె గమ్యం అంతకంటే కాదు. త్వరలోనే కమర్షియల్ పైలట్ లైసెన్స్ (సిపిఎల్) సంపాదించడానికి తిరిగి శిక్షణను మొదలుపెట్టడానికి శివలక్ష్మి సిద్ధమవుతున్నది. శివలక్ష్మితో పాటు కొట్టాయంకు చెందిన 'ఉల్లాల' తెగకు చెందిన ధన్య అనే మరో గిరిజన బాలిక కూడా ప్రభుత్వ స్కాలర్షిప్ పొంది విద్యార్థి పైలట్ లైసెన్స్ సంపాదించింది. శివలక్ష్మి కి కమర్షియల్ పైలట్ లైసెన్స్ శిక్షణ పూర్తి కావాలంటే, దాదాపు రూ.32లక్షలు ఖర్చవుతాయి. ఆ ఆర్థిక స్తోమత లేనందున, విమానాలు నడపడం పట్ల తనకు ఉన్న అభిరుచిని గమనించి కేరళ ప్రభుత్వం తదుపరి సాయం అందిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నది. ఆమెకు అండగా నిలిచిన తల్లి జయలక్ష్మి కష్టాన్ని, తపనను కూడా ఈ సందర్భంగా గుర్తుచేసుకొని తీరాలి. ఆమె భర్త, మురళీధరన్, కేరళ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (కెఎస్‌ఆర్‌టిసి) లో కండక్టర్‌గా తన జీవితాన్ని ప్రారంభించి, స్టేషన్ మాస్టర్‌గా ఎదిగాడు. ప్రస్తుతం వారు నివసిస్తున్న ఇంటిని బ్యాంకు రుణం సహాయంతో నిర్మించాడు. అయితే, 12 ఏళ్ల క్రితం పక్షవాతానికి గురైనప్పుడు, ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోయింది. కోలుకోవడం మాట అలాఉంచి కనీసం మంచంమీద నుంచి లేచే పరిస్థితులో కూడా లేడు. అప్పటి వరకూ గృహిణిగా ఉన్న ఆమె ఈ హఠాత్ పరిణామంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంది. భర్త పెన్షన్‌తో సరిపోక చిన్నాచితకా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నది. ఆ సమయంలో శివలక్ష్మి ఏవియేషన్ అకాడెమీలో అడ్మిషన్ పొందేందుకు అన్ని పరీక్షల్లోనూ ఉత్తీర్ణత సాధించింది. అకాడెమీలో చేర్పించే శక్తి లేకపోవడంతో, ఆ ఆలోచనను విరమించుకోవాలన్న సందర్భం కూడా లేకపోలేదు. కానీ, ఆమె తన ప్రయత్నం విరమించుకోలేదు. తన పరిస్థితిని వివరించేందుకు శివలక్ష్మిని తీసుకొని, ఎస్‌సి, ఎస్‌టి దేశస్వామ్ శాఖ మంత్రి కె. రాధాకృష్ణన్‌ను కలిసింది. శివలక్ష్మి ఆలోచనను, ఆమె పడిన కష్టాన్ని, ఏవియేషన్ అకాడెమీలో అడ్మిషన్ సంపాదించడాన్ని వివరించింది. కుటుంబ పరిస్థితిని కూడా మంత్రికి చెప్పడంతో, ఆయన సానుకూలంగా స్పందించారు. శివలక్ష్మి శిక్షణ పొందాలని అనుకుంటే, ప్రభుత్వం ఆర్థికం గా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

అన్నట్టుగానే మూడు వారాల్లోనే అవసరమైన నిధులను మంజూరు చేశారు. శివలక్ష్మి తన ప్రయాణంలో మొదటి ఘట్టాన్ని సమర్థంగా పూర్తి చేసింది. శివలక్ష్మితో పోలిస్తే ధన్య కుటుంబ పరిస్థితి కొంత మెరుగ్గా నే ఉంది. ఆమె తండ్రి కొట్టాయం మునిసిపాలిటీలో పనిచేస్తున్నాడు. తల్లి వెటర్నరీ ఆసుపత్రిలో తాత్కాలిక ఉద్యోగి. ''చిన్నప్పటి నుంచి పైలట్ కావాలనుకున్నా.. కోర్సుకు దరఖాస్తు చేసి సెలెక్ట్ అయ్యా..కానీ ఫీజు కట్టేంత ఆర్థిక స్థోమత మాకు లేకపోవడం తో ప్రభుత్వాన్ని ఆశ్రయించాం. నా డబ్బు కేవలం ఒక వారం రోజుల్లోనే శాంక్షన్ అయింది' అంటున్న ధన్య తదుపరి శిక్షణకు కూడా ప్రభుత్వ సాయం లభిస్తుందన్న ధీమా వ్యక్తం చేస్తున్నది. కేరళ ప్రభుత్వ ఎస్‌సి, ఎస్‌టి, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అణగారిన వర్గాలకు చెందిన 310మంది విద్యార్థులకు విదేశీ విద్య మద్దతు, ఒక్కొక్కరికి రూ.25లక్షలు వెచ్చిస్తున్నది. పరోక్ష లబ్ధిదారుల పథకాల కంటే ప్రత్యక్ష ప్రయోజనాల బదిలీ ద్వారా విద్య, ఆరోగ్యం, జీవనోపాధిపై దృష్టి సారించడం ఉత్తమమన్న కేరళ ప్రభుత్వ లక్ష్యాన్ని కొనసాగిస్తున్నది. ప్రభుత్వ సహకారంతో శివలక్ష్మి, ధన్య పైలట్లుగా ఎదగడంతోపాటు, ఎంతోమంది గిరిజన బాలికలకు మార్గదర్శకంగా నిలుస్తారని ఆశిద్దాం.

వినియోగదారుల హక్కులు పరిరక్షించాలి

వినియోగదారుల ఉద్యమం ఓ సామాజిక అవసరంగా ఉద్భవించింది. అనైతిక, అన్యాయమైన వస్తు సేవలు, అక్రమ వ్యాపార పద్ధతులతో ప్రతి వినియోగదారుడు అనాదిగా నష్టపోవడం జరుగుతోంది. ఈ నేపథ్యం లో 1960ల్లో ప్రారంభమైన వినియోగదారుల ఉద్యమాలను గుర్తించిన భారత ప్రభుత్వం 'వినియోగదారుల రక్షణ చట్టం—1986' తీసుకురావడం జరిగింది. ప్రతి ఏటా మార్చి 15న 'ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం' పాటించడం జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా వినియోగదారుల హక్కుల పరిరక్షణ, హక్కులను గౌరవించడం, హక్కులకు విఘాతం కలిగించే అనైతిక అవినీతిపరులను కట్టడిచేయడం లాంటి అంశాల్లో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తారు. వినియోగదారుల హక్కుల్లో భద్రత హక్కు, సమాచారాన్ని పొందే హక్కు, ఎంచుకునే హక్కు, తమ అభిప్రాయాలను వినిపించగల హక్కు, ప్రాథమిక అవసరాలను సంతృప్తి పరిచే హక్కు, పరిష్కార హక్కు, వినియోగదారుల విద్య హక్కు, ఆరోగ్యకర పర్యావరణ హక్కులు లాంటివి వస్తాయి. వ్యాపారవస్తు సేవలకు పునాది వినియోగదారుడే. వినియోగదారుడు సదా న్యాయమైన సేవలను పొందినపుడే వస్తు వ్యాపారాలు వర్ధిల్లుతూ, దేశం సమగ్రాభివృద్ధి పథంలో నడుస్తుందని గుర్తించుకోవాలి.

(నేడు 'ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం')

కార్మికులకు అండగా కాంగ్రెస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : కార్మికులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్(జిహెచ్‌ఎంఇయు) అధ్యక్షుడు ఊదరి గోపాల్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మంత్రిని కలిసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారు. జిహెచ్ఎంసి ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కుంటున్న సమస్యలను, ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే ప్రతిపాదనను మంత్రికి చెప్పినట్లు గోపాల్ తెలిపారు. తమ సమస్యల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే సిఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పినట్లు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను: మల్లారెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్ఎస్ ఎంఎల్ఎ మల్లారెడ్డి బెంగుళూరులో కర్నాటక డిప్యూటీ సిఎం డి.కె. శివకుమార్‌తో భేటీ అయ్యారు. మల్లారెడ్డి అల్లుడు, మల్కాజిగిరి ఎంఎల్ఎ మర్రి రాజశేఖర్ రెడ్డికి చెందిన కళాశాలలకు చెందిన భవనాలను ఇటీవల కూల్చివేసిన విషయం తెలిసిందే.ప్రస్తుత తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి ఇద్దరూ బిఆర్ఎస్‌ను వీడి, కాంగ్రెస్‌లో చేరుతారని విస్తృత ప్రచారం జరుగుతోంది. తాజాగా వారు బెంగుళూరులో డి.కె.శివకుమార్‌ను కలువడం రాజకీయ ప్రధాన్యత సంతరించుకున్నది. దీంతో త్వరలోనే వారు బిఆర్ఎస్‌కు రాజీనామా చేస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే తాను వచ్చే ఎన్నికల్లో మళ్లీ పోటీ చేయబోనని మల్లారెడ్డి వెల్లడించారు. ప్రస్తుత ఐదేళ్ల పాటు ప్రజా సేవ చేసి, రాజకీయాల నుండి తప్పుకుంటానని స్పష్టం చేశారు. అప్పటి వరకు బిఆర్ఎస్‌లోనే కొనసాగుతానన్నారు. శివకుమార్‌ను కలవడంలో ఎటువంటి రాజకీయం లేదని మల్లారెడ్డి వివరించారు.

జిఓ 317,46లపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన జి ఓ 317 , జి ఓ 46లపై ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘం హైదరాబాద్‌లోని సచివాలయంలో వివిధ ప్రభుత్వ, ఉపాధ్యాయ సంఘాలతో గురువారం సమావేశమైంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ అధ్యక్షతన జరిగినఈ సమావేశంలో మంత్రి వర్గ సభ్యులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కమిటీ అధికారులు పిఆర్‌సి చైర్మన్ శివ శంకర్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, సెక్రరియట్ సర్వీసెస్ కార్యదర్శి నిర్మల, విద్యా శాఖ డైరెక్టర్ శ్రీదేవసేన, న్యాయ శాఖ కార్యదర్శి తిరుపతి, ప్రొఫెసర్ ఎం. కోదండరాంతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవోలకు సంబంధించి అన్ని ఉద్యోగ సంఘాల నుండి విజ్ఞప్తులను, వారి సలహాలు, సూచనలు మంత్రివర్గ ఉప సంఘం స్వీకరించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు శాపంగా మారిన ఆ జీవోలను రద్దు చేయాలని మంత్రి వర్గ ఉపసంఘానికి ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల స్థానికత ఆధారంగా, జోన్ల వారీగా బదిలీలు చేపట్టాలని వారు కోరారు. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తుల మేరకు కమిటీ పరిశీలించి, అధ్యయనం చేసి, తగు నివేదికను సాధ్యమైనంత త్వరగా ముఖ్యమంత్రికి సమర్పిస్తామని మంత్రివర్గ ఉప సంఘం ఉద్యోగ సంఘాలకు హామీనిచ్చింది. ఈ సమావేశంలో టిజివో, టిఎన్‌జివో, టిఆర్‌ఇఎస్ఎ, పిఆర్‌టియు,ఎస్‌టిఎఫ్,ప్రభుత్వ లెక్చరర్ల అసోసియేషన్‌తో పాటు పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

బిఆర్ఎస్ ఇద్దరు అభ్యర్థులు ఖరారు

ప్రజాపక్షం/హైదరాబాద్: మరో రెండు లోక్‌సభ నియోజకవర్గాలకు బిఆర్ఎస్ ఇద్దరు అభ్యర్థులు ఖరారయ్యారు. మల్కాజిగిరి నుండి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ నుండి ఆత్రం సక్కు పేరును ఆ పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు గురువారం ప్రకటించారు. కాగా అంతకుముందు హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదిలాబాద్ లోక్‌సభ ముఖ్యనేతలతో కెసిఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అక్కడి రాజకీయ పరిస్థితులు, తాజా పరిణామాలపై వారితో చర్చించారు.

జాతీయ రహదారి విస్తరణకు లభించిన మోక్షం

చౌరస్తా నుండి ప్రారంభమైన రోడ్డు నిర్మాణం పనులు

ప్రజాపక్షం/షాద్‌నగర్: స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ చొరవతో పాత జాతీయ రహదారి విస్తరణ పనులకు మోక్షం లభించింది. గురువారం షాద్‌నగర్ ముఖ్యకూడలి నుండి అన్నారం బైపాస్ రహదారి వరకు రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పని చేసిన కాంట్రాక్టర్‌కు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతోనే ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా ఎంఎల్ఎ వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులను దూరం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కారణంగా కాంట్రాక్టర్ తీవ్రంగా నష్టపోయారని, దాంతో ఎంఎల్ఎ కాంట్రాక్టర్‌కు సర్దిచెప్పి పనులు చేసే విధంగా కృషి చేయడం ఎంతో సంతోషించ దగ్గ విషయమని పేర్కొన్నారు. రోడ్డు పనులు పూర్తి చేయాలని, అందుకు తానే పూచీకత్తుగా ఉంటానని, ప్రభుత్వంతో మాట్లాడి పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. వీలైనంత త్వరగా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు బాబర్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, ఎంపిటిసి సభ్యులు భార్గవ్‌కుమార్‌రెడ్డి, నలమోని శ్రీధర్, సయ్యద్ ఖదీర్, ముబారక్ అలీఖాన్‌ఖ, ప్రతాప్‌రెడ్డి మంగలి సురేష్‌లు ఉన్నారు.

ఉద్యోగులకు పోటాపోటీ వరాలు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో, అటు కేంద్రం, ఇటు వివిధ రాష్ట్రాలు ఉద్యోగులకు తాయిలాలు ప్రకటిస్తున్నాయి. వరాల జల్లులు కురిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 4 శాతం కరవు భత్యం (డియర్‌నెస్ అలవెన్స్/ డిఎ)ను పెంచుతూ మోడీ సర్కారు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో 49.18 లక్షల మంది ఉద్యోగులు, 67.95 లక్షల మంది పెన్షనర్లు లబ్ది పొందుతారు. ఈ నిర్ణయం వల్ల ఖజానాపై ఏడాదికి రూ. 12,868.72 కోట్ల భారం పడుతుంది. కాగా, ఇప్పుడు కర్నాటక ప్రభుత్వం కూడా అదే పంథాను అనుసరించింది. ఉద్యోగులు, పెన్షనర్లకు డిఎను 3.75 శాతం పెంచాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం 2024 జనవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించింది. కర్నాటలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో, అక్కడి ప్రభుత్వ ఉద్యోగుల డిఎ 38.75 శాతం 42.5 శాతానికి పెరగనుంది. ఈ పెంపు వల్ల రాష్ట్ర ఖజానాపై ఏటా రూ .1792.71 కోట్ల అదనపు భారం పడుతుంది. 'ఈ నిర్ణయం మా ఉద్యోగుల పట్ల మాకు ఉన్న అంకితభావాన్ని పునరుద్ఘాటిస్తుంది' అని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. మరోవైపు యుజిసి, ఎఐసిటిఇ, ఐసిఎఆర్ పే స్కేల్స్ కింద పని చేస్తున్న సిబ్బందికి ప్రస్తుతం 46 శాతం డిఎను చెల్లిస్తుండగా, తాజాగా మరో నాలుగు శాతాన్ని జోడించి, 50 శాతానికి పెంచింది. మార్చి నెల వేతనంతో పాటు ఈ బకాయిలు చెల్లించనున్నారు. ఇలావుంటే, జార్ఖండ్, అరుణాచల్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు కూడా కర్నాటకను అనుకరిస్తున్నాయి. జార్ఖండ్ ప్రభుత్వం కూడా ఈ ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చేలా డిఎను ప్రస్తుతం ఉన్న 46 శాతం నుంచి 50 శాతానికి పెంచింది. ఈ డిఎపెంపుతో రాష్ట్రంలోని 1.90 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం కలుగుతుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంపాయ్ సోరెన్ ప్రకటించారు. అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం తన ఉద్యోగులకు అదనంగా 4 శాతం డిఎను ప్రకటించింది. జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ పెంపుతో 68,818 మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, 33,200 మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం కూడా గత వారం తన ఉద్యోగులకు 4 శాతం డిఎ పెంచుతున్నట్లు ప్రకటించింది. త్రిపుర, గుజరాత్, అస్సాం రాష్ట్రాలు కూడా తమ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెలలో డిఎపెంచాయి. నెలవారీ వేతనాలు, పింఛన్లలో భాగమైన డిఎను పెంచడం వల్ల ఉద్యోగుల జీవన వ్యయ పెరుగుదలకు ఉపశమనం లభిస్తుంది. మొత్తం మీద లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేంద్రంతోపాటు పలు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఉద్యోగులను మంచి చేసుకునే పనిలో పడ్డాయి. ఈ ప్రయత్నాలు ఎంత వరకూ ఫలిస్తాయో చూడాలి.

శక్తి టీమ్ పురస్కారం సాధించిన

దక్షిణమధ్య రైల్వే రక్షణదళం

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా దక్షిణ మధ్య రైల్వే మహిళా రైల్వే రక్షణ దళానికి మహిళల రక్షణ కేటగిరీ కింద అవార్డును ప్రధానం చేసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు 2024లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, సీనియర్ సిటిజన్ల విభా గం ద్వారా గురువారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో 'మహిళల రక్షణ కేటగిరీ'లో దక్షిణ మధ్య రైల్వే మహిళా రైల్వే రక్షణ దళానికి శక్తి టీం పురస్కారం ప్రధానం చేశారు. తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీ ణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి డి. అనసూయ సీతక్క , దక్షిణ మధ్య రైల్వే ఐజి కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్‌ను రూ .1 లక్ష, ఒక మెమెంటోతో కూడిన అవార్డుతో సత్కరించారు. ఈ అవార్డు ప్రధానోత్సవంలో సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దేబాష్మితా చటోపాధ్యాయ, రైల్వే రక్షణ దళానికి చెం దిన మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం అవార్డు నాకు గర్వకారణం : అరుణ్ కుమార్ జైన్

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరూమా సింగ్ ఠాకూర్, 24 గంటలు మహిళా ప్రయాణీకులకు భద్రత కల్పిస్తున్న దక్షిణ మధ్య రైల్వే మహిళా రైల్వే రక్షణ బృందాన్ని అభినందించారు. బృందం ప్రదర్శించిన ధైర్యసాహసాలు, చురుకుదనాన్ని ఆయన ప్రశంసిస్తూ ఇటువంటి చర్యలతో రైల్వే రక్షణ దళం ధైర్యాన్ని పెంపొందించడమే కాకుండా ఇతర రైల్వే సిబ్బంది కూడా అలాంటి ప్రయత్నాలను చేపట్టేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేకు టీమ్ సభ్యులకు ప్రభుత్వం ద్వారా ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు, అవార్డును అందుకోవడం జోన్‌కు గర్వంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

స్వయం సహాయక సంఘాల మహిళలకు..

స్కూల్ యూనిఫామ్‌ల కుట్టు పనులు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పన, పాఠశాల విద్యార్థుల యూనిఫామ్‌ల కుట్టు పనులను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు అప్పగిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల పని తీరు, పాఠశాల విద్యార్థినీ, విద్యార్థుల యూనిఫామ్‌ల స్టిచ్చింగ్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, గనులు భూగర్భ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి మహేష్ దత్ ఎక్కా, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, కమిషనర్ అనితా రాజేంద్రన్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, హ్యాండ్లూమ్స్ శాఖ కమిషనర్ అలుగు వర్షిణి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతి కుమారి మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోపు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పాఠశాలల్లో గుణాత్మక మార్పు వచ్చేలా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఇందుకుగాను, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు పనులు అప్పగించాలని తెలిపారు. పనుల నిర్వహణకు ప్రతీ మండలానికి ఒక ఇంజనీరింగ్ విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, వారి పర్యవేక్షణలో పనులు నాణ్యతతోనూ, సకాలంలో పూర్తి అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు విధి, విధానాలను ఇప్పటికే ప్రకటించడం జరిగిందని, ఈ కమిటీలకు విలేజ్ ఆర్గనైజేషన్ లేదా ఏరియా లెవెల్ ఫెడరేషన్ అధ్యక్షులు ఛైర్ పర్సన్‌గా, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని వివరించారు. విద్యా శాఖ పరిధిలోని స్కూల్ యూనిఫామ్స్, ఎస్.సి, ఎస్.టి, బిసి, మైనారిటీ శాఖలకు చెందిన రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల పిల్లల స్కూల్ యూనిఫాంలను కూడా స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగిస్తున్నామన్నారు. రాష్ట్రంలో మొత్తం, 63,44,985 జతల స్కూల్ యూనిఫామ్‌లు స్టిచ్చింగ్ చేయాల్సి ఉంటుందని అంచనా వేశామని, వీటిని పాఠశాలలు వచ్చే విద్యా సంవత్సరం తెరిచేలోగా పంపిణి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

నైట్ బజార్‌లోని 119 స్టాల్స్

పూర్తిగా మహిళలకు మాత్రమే స్టాల్స్ కేటాయించాలని సిఎం ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు వారికి స్టాళ్లు కేటాయించేందుకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. శిల్పారామం పక్క న నిరుపయోగంగా ఉన్న స్టాల్స్‌ను గురువారం రాత్రి పరిశీలించారు. మహి ళా శక్తి పథకంలో భాగం గా స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. 2017 నుంచి నిరుపయోగంగా ఉన్న నైట్ బజార్‌లోని 119 స్టాల్స్‌ను ఇందుకు ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. రైతు బజార్ స్వయం సహాయక మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేలా స్టాల్స్‌ను తీర్చిదిద్దాలని అధికారులకు సిఎం దిశానిర్దేశం చేశారు. పూర్తిగా మహిళలకు మాత్రమే స్టాల్స్‌ను కేటాయించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో ఉత్తర్వులను సిద్ధం చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా ఉత్తర్వులను జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ఆదేశించారు. అవసరమైతే మణిపూర్‌లోని మహిళలకు కేటాయించిన మార్కెట్‌ను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. మహిళా శక్తి పథకంలో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

రాష్ట్రంలో రాజకీయాలు మారుతున్నాయ్

ప్రజాపక్షం/హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయాలు మరింత వేగంగా మారుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ కొన్ని లోక్‌సభ నియోజకర్గాలకు అభ్యర్థులను ప్రకటించగా, టికెట్ ఆశించి భంగపడిన నాయకులు పక్క పార్టీల వైపు చూస్తున్నారు. ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తమ రాజకీయ భవిష్యత్‌పై వేగవంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితుల్లో అధికంగా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకే నేతలు మొగ్గు చూపుతున్నారు. బిజెపి నేత జితేందర్ రెడ్డిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం కలిశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంఎల్‌సి పట్నం మహేందర్ రెడ్డితో కలిసి సిఎం జితేందర్ రెడ్డి నివాసానికి వెళ్లారు. కాగా జితేందర్ రెడ్డి మహబూబ్‌నగర్ టికెట్ ఆశించగా ఆ స్థానాన్ని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు బి.కె.అరుణకు కేటాయించారు. దీంతో జితేందర్ రెడ్డి తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్టు తెలిసింది. బిజెపిని వీడేందుకు సిద్ధమవుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జితేందర్ రెడ్డిని సిఎం రేవంత్ రెడ్డి కలువడం చర్చనీయంశంగా మారింది. కాగా బిఆర్ఎస్‌కు చెందిన కొందరు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలు ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ప్రైవేట్ విద్యుత్ కాంట్రాక్టర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య

ప్రజాపక్షం/షాద్‌నగర్: నిబంధనలకు విరుద్ధంగా అన్నదాతల అనుమతి లేకుండా ప్రైవేట్ విద్యుత్ కాంట్రాక్టర్ లైన్లు వేయడం ఎంతవరకు సమంజసమని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య ప్రశ్నించారు. గతంలో కందుకూరు, కేశంపేట, ఫరూఖ్‌నగర్, షాబాద్ మండలాల్లో హైటెన్షన్ ఓల్టేజ్ లైన్లు వేసి అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. హైటెన్షన్ లైన్ కింద పంటలు సాగుచేసుకునేందుకు వీలు లేకుండా పోతుందని, వర్షాకాలంలో విద్యుత్ షాక్ వచ్చే పరిస్థితులు నెలకొంటాయని వివరించారు. అన్నదాతల అనుమతి లేకుండా పంటపోలాల్లో హైటెన్షన్ లైన్లు ప్రైవేట్ కాంట్రాక్టర్లు వేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. లైన్లు వేసే సమయంలో చాలిచాలని నష్టపరిహారం ఇస్తూ అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ కొద్దిపాటి నష్టపరిహారం ఇస్తూ రైతులు సర్దుకుపోవాలని ప్రైవేట్ కాంట్రాక్టర్లు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అన్నదాతలకు నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ ప్రాంతానికి పరిశ్రమలు వస్తున్నాయని, పరిశ్రమలకు విద్యుత్ అవసరాల నిమిత్తం ఇష్టారాజ్యంగా లైన్లు వేసి రైతులకు నష్టం కలిగిస్తే ఊరుకునేది లేదని, రైతులకు నష్ట పరిహారం ఇచ్చి వారి అనుమతితోనే లైన్లు వేయాలని లేని పక్షంలో అన్నదాతల పక్షాన నిలబగి ఆందోళనలు నిర్వహించనున్నట్లు హెచ్చరించారు.

ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారుల పాత్ర కీలకం

రంగారెడ్డి జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి శశాంక

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: రానున్న పార్లమెంటు ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులది కీలక పాత్ర అని రంగారెడ్డి జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి కె.శశాంక అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకై నియమించిన నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నోడల్ అధికారులందరూ వారికి కేటాయించిన అంశాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండి, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పార్లమెంటు ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. అన్ని విషయాలపై నోడల్ టీములకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. మొదటి ర్యాండమైజేషన్ తర్వాత పిఒ ,ఎపిఒ లకు సైతం శిక్షణ ఏర్పాటు చేయాలని తెలిపారు. పట్టణ స్థాయి నుండి గ్రామస్థాయి వరకు ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సంబంధిత స్వీప్ నోడల్ అధికారికి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా పరిషత్ సిఈఓ కృష్ణ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత,సిపిఓ సౌమ్య,డిసిసిఒ ధాత్రి దేవి,డిపిఓ సురేష్ మోహన్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్, ఎన్నికల విభాగం అధికారి సైదులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో పొరపాట్లకు తావివ్వద్దు

పదవ తరగతి పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రకద్బందీగా జరగకుండా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక సంబంధిత పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత 239 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌ల తోపాటు జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు,ఇతర సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ మార్చి 18 వ తేది నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలను సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రతి పరీక్ష కేంద్రంలో సిసి కెమెరాలను కచ్చితంగా ఏర్పాటు చేయాలని తెలిపారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితుడు, పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

ప్రజాపక్షం/షాద్‌నగర్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితుడు, పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి కోరారు. గురువారం షాద్‌నగర్ డివిజన్‌లోని కొత్తూరు, నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల్లో కాంగ్రెస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎండను సైతం లెక్కచేయకుండా కాంగ్రెస్ నేతలు భారీగా తరలి వచ్చారు. ఏ మండలానికి వెళ్ళినా కాంగ్రెస్ నేతలు ఘనంగా స్వాగతం పలకడంతోపాటు సన్మానించారు. ఈ సందర్భంగా అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే దేశంలో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. దేశ ప్రజలందరు కాంగ్రెస్ వైపు ఎదురు చూస్తున్నారని, కాంగ్రెస్‌కు దేశంలో అనుకూల పవనాలు వీస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, పి.వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఎంఎల్ఎ చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి శ్యాంసుందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహ్మా, వీరేష్, కృష్ణారెడ్డి, రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాల్‌రాజ్ గౌడ్, జగదీశ్వరప్ప, మాజీ ఎంపిటిసి నర్సింహ్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జాంగారి జంగయ్య, యువ నేత జాంగారి రవితోపాటు శ్రేణులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన లేమామిడి ఎంపీటీసీ లక్ష్మమ్మ

ప్రజాపక్షం/కేశంపేట : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎంపి అభ్యర్థి వంశీచంద్ రెడ్డి సమక్షంలో చేరిక కేశంపేట మండలం లేమామిడి ఎంపీటీసీ దిద్దెల లక్ష్మమ్మ గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మహబూబ్‌నగర్ ఎంపి అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బిఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీటీసీగా ఎన్నికైన లక్ష్మమ్మ తన అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. తమ ఎంపీటీసీ పరిధిలో అభివృద్ధి పనుల కోసం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు లక్ష్మమ్మ తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎంపి అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి ఆమెకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పేదల భూముల్లో అనుమతి లేకుండా విద్యుత్ లైన్లు వేయడం ఏమిటి?

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పర్వతాలు

ప్రజాపక్షం/షాద్‌నగర్: పేదల వ్యవసాయ భూముల్లో అనుమతులు లేకుండా విద్యుత్ లైన్లు వేయడం సరైన పద్ధతి కాదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు హెచ్చరించారు. గురువారం షాద్‌నగర్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ రెవెన్యూ శివారు నుండి కేశంపేట మండలంలోని వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరాను పెద్ద ఎత్తున లైన్ల ద్వారా తీసుకువెళ్ళడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం నుండి పూర్తి అనుమతులు రాకముందే, అన్నదాతల నుండి అనుమతి తీసుకోకముందే ప్రైవేట్ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా లైన్లు వేయడం ఏమిటని అన్నారు. అక్రమ నిర్మాణాలు చేస్తూ అన్నదాతలను మోసం చేస్తున్న ప్రైవేట్ కాంట్రాక్టర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నష్టపరిహారం అన్నదాతలకు వచ్చిన తరువాతే భూసేకరణ పనులు పూర్తి చేసి అప్పుడే నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా అన్నదాతలకు పట్టప్రకారం నష్టపరిహారం ఇవ్వకుండా విద్యుత్ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా రైతుల పోలాల్లో లైన్లు వేస్తే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కో కన్వీనర్ ఎం.శ్రీనులు ఉన్నారు.

ప్రభుత్వస్థలంలో అక్రమనిర్మాణాలు ఆపండి

ప్రజాపక్షం/బోడుప్పల్ : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ఆపాలని గురువారం కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డికి సిపిఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబర్ 3 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. గతంలో కూడా ఈ అక్రమ నిర్మాణాలు చేస్తే మేడిపల్లి తహసీల్దార్ సర్వే చేసి మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా కూల్చి వేశారన్నారు. తక్షణమే ఈ నిర్మాణాన్ని ఆపివేసి విచారణ జరిపి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఆయన కోరారు.

జిహెచ్ఎంసి కమిషనర్‌ను కలిసిన ఎంఎల్ఎ మర్రి

ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి : జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖ ర్‌రెడ్డి, కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్‌లతో కలిసి గురువారం ఆయన కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గంలో పలు సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను కమిషనర్‌కు అందజేశారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల నర్సింగరావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రావుల అంజయ్య, ఢిల్లీ పరమేష్, డోలి రమేష్, అనిల్ కిషోర్, రాము యాదవ్, ఇబ్రహీం, రాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి : ఏసురత్నం

ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట : పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిం చాలని మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి కె యేసు రత్నం కోరారు. మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో గురువారం కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యూటీ ఉప కమిషనర్ ను కలిసి పారిశుద్ధ్య కార్మికుల పిఎఫ్, ఈఎస్ఐ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షులు డి.రాములు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఏఐటియుసి అధ్యక్షులు వి.హరినాథ్ రావు , నాయకులు బాబు పాల్గొన్నారు.

ఒయు పూర్వవిద్యార్థుల నిధులతో ప్రస్తుత విద్యార్థులకు ఫెలోషిప్

ఎఐఎస్ఎఫ్ ఒయు కార్యదర్శి నెల్లి సత్య

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీ ఫౌండేషన్ భవనం శంకుస్థాపనను అడ్డుకోకుండా గురువారం ఉదయం పోలీసులు ఎన్ఆర్ఎస్ హాస్టల్ రూమ్‌కు వచ్చి ముందస్తు అరెస్టు చేయడాన్ని ఎఐఎస్ఎఫ్ ఒయు కార్యదర్శి నెల్లి సత్య ఖండించారు. తమ సమస్యలను పూర్వ విద్యార్థులకు చెప్పుకునే అవకాశం ఇవ్వాలని పోలీసులతో మాట్లాడిన సందర్భంలో పోలీసు వాహనంలోనే శంకుస్థాపన జరిగిన ప్రదేశానికి తీసుకువెళ్లారని తెలిపారు. నెల్లి సత్య ఒయు ఫౌండేషన్ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన పూర్వ విద్యార్థుల సంఘం నాయకులతో ఒయు అభివృద్ధికి విరాళాల ద్వారా సహకారం అందించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. అదే సమయంలో కొంతమంది పూర్వ విద్యార్థుల అసోసియేషన్ పేరు చెప్పుకొని ఒయు అధికారులతో కలిసి సన్మానాలు, సత్కారాలు చేసుకుంటూ, ఒయులో వందల రెట్లు ఫీజులు పెంచి, పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్న సమయంలో కనీసం స్పందించలేదని అక్కడికి వచ్చిన పూర్వ విద్యార్థుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఒయులో ఇప్పటికే చాలా భవనాలు ఉన్నాయని, పూర్వ విద్యార్థులు భవనాల నిర్మాణానికి కాకుండా పూర్వ విద్యార్థులు ఇచ్చిన నిధులను పేద విద్యార్థులకు ఫెలోషిప్‌లు ఇచ్చి ఆర్థిక సాయంగా అందజేయాలని, హాస్టళ్లలో, గ్రంథాలయాలు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని, విద్యార్థుల తరపున సమస్యలను పూర్వ విద్యార్థులకు తెలియచేయడానికి వచ్చిన తమను ఇష్యూ చేయడానికి ఇక్కడికి వచ్చారని వి.సి. ప్రొఫెసర్ రవీందర్ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. అభివృద్ధితో పాటు, విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేసి, పేద విద్యార్థులకు సహాయపడాలని కోరారు.

ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు

ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపు 6 గ్యారంటీల అమలు చేశారని, అభివృద్ధి రథాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజయవంతంగా ముందుకు తీసుకవెళ్తున్నారని ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ 100 రోజుల పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలనను అంతం చేసి ప్రజలు ప్రజాస్వామ్య పాలనను తీసుకొచ్చారన్నారు. ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు భరోసా కల్పించడంలో అత్యంత శ్రద్ధ వహిస్తూ, ప్రజల అవసరాలకు ప్రతిస్పందిస్తు, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా పని చేస్తూ, జవాబుదారీ పాలనా కొనసాగిస్తుందని చెప్పారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీనిచ్చిన ఆరు గ్యారెంటీలు మహాలక్ష్మి ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500 గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి ద్వారా అర్హులైన కుటుంబాలకు 200యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రైతు భరోసా, చేయూత వృద్ధులకు నెలకు రూ.4వేల పెన్షన్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంచడం, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు, యువ వికాసం వంటివి పథకాలు విజయవంతంగా అమలు జరుపుతున్నారన్నారు. వీటితో పాటు మహిళలకు వడ్డీ లేని రుణాల మంజూరుతో పాటు కళ్యాణ లక్ష్మి పథకంలో ఉచితంగా తులం బంగారం, ప్రజాపాలన అభయహస్తం, అర్హులైన ప్రతీఒక్కరికీ తెల్ల రేషన్ కార్డు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్‌ల ఏర్పాటుతో పాటు అన్ని కులాల వారీగా కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సొంత ప్రభుత్వమని, ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తుందన్నారు.

యువతరంలో మూత్రపిండాల వ్యాధులు

ప్రజాపక్షం/హైదరాబాద్: యువత మూత్రపిండాల వ్యాధి బారిన పడుతున్నారని విరించి హాస్పిటల్ నెఫ్రాలజీ, రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగాధిపతి డాక్టర్ కె.ఎస్.నాయక్ తెలిపారు. దీనికి 'క్రానిక్ కిడ్నీ డిసీజ్ ఆఫ్ అన్‌నోన్ ఆరిజిన్' కారణమన్నారు. కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విరించి హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూత్రపిండాల వ్యాధికి మధుమేహం ప్రధాన కారణమన్నారు. దేశంలో 2020లో నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైందన్నారు. అనేక ఇతర వ్యాధులకు కూడా మధుమేహమే కారణమని చెప్పారు. మూత్రపిండాల వ్యాధి బారినపడుతున్న వ్యక్తుల సగటు వయస్సు 50 సంవత్సరాలు కాగా అందులో 67 శాతం పురుషులు ఉన్నారని, పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో రెండు రెట్లు అధికంగా ఉన్నారని ఆయన వివరించారు. హాస్పిటల్స్ వైస్ చైర్మన్ సత్యనారాయణ వేదుల, సీనియర్ డాక్టర్లు నవీన్ కుమార్ మట్టెవాడ, డాక్టర్ సాయి రవిశంకర్ తదితరులు ప్రసంగించారు.



పార్లమెంటు ఎన్నికలకు సన్నద్ధం

జిల్లా కలెక్టర్ గౌతమ్

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: పార్లమెంటు ఎన్నికల సన్నాహంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో జిల్లా కలెక్టర్ గౌతమ్ గురువారం కలెక్టరేట్‌లో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలకు అధికారులు సన్నద్ధం కావాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు, ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వే లెన్స్ బృందాల బాధ్యతలు తెలియ చేస్తూ ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రతి ఒక్కరికీ సమానంగా వర్తిస్తుందన్నారు. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ రేయింబవళ్లు పర్యవేక్షణలో ఉంటారన్నారు. అక్రమంగా మద్యం సరఫరా, ప్రలోభాలు, బహుమతులు ఇవ్వడంలాంటి విషయాల్లో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ పకడ్బందీగా నియంత్రించాలన్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుల విషయంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఏవైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించాలన్నారు. 50 వేల కంటె ఎక్కువ నగదు తీసుకొని వెళ్లకుండా నియంత్రించాలని, ప్రతి రోజు సంబంధిత అధికారులు నివేదికలు పంపేలా ఎంసిసి, నోడల్ అధికారి, అభ్యర్థి ఖరారు అయ్యాకా ఖర్చుల వివరాలు, రాజకీయ ప్రకటనలకు సంబంధించి మీడియా మానిటరింగ్ కమిటీ సోషల్ మీడియా ద్వారా నిర్వర్తించే విధులు సంబంధిత అధికారులు గమనించాలన్నారు. సి విజిల్ యాప్, ద్వారా వచ్చే ఫిర్యాదులకు జాప్యం లేకుండా పరిష్కరించాలన్నారు. సీజ్ చేసిన నగదు, వస్తువులను యాప్‌లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లో పరిష్కరించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుండి ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్నారు. డిసిఓ రాజేందర్‌రెడ్డి, బిసి వెల్ఫేర్ అధికారి, కేశురాం, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ తిరుమలేష్, ఈ డిస్ట్రిక్ మేనేజర్ భానుప్రకాష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే జవహర్‌నగర్ అభివృద్ధి

తోటకూర వజ్రేష్‌యాదవ్

ప్రజాపక్షం/జవహర్‌నగర్: జవహర్‌నగర్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని, గత ప్రభుత్వం హంగు ఆర్భాటలే తప్పా చేసిందేమి లేదని మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ అభివృద్ధికి మంజూరైన రూ. 39లక్షల ఉత్తర్వుల పత్రాలను గురువారం కార్పొరేషన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో కలిసి అందుకున్నారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజలు సంబురంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పేదల పక్షనా నిలబడుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ళను జవహర్‌నగర్‌కు అత్యధికంగా కేటాయించేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరిలో నేడు ప్రధాని రోడ్‌షో

ఈటల రాజేందర్

ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి: అన్ని సర్వేలు మోడీకి ఓటు వేస్తారని చెబుతున్నారని బిజెపి మల్కాజ్‌గిరి పార్లమెంటు అభ్యర్థి ఈటల రాజేందర్ తెలిపారు. మల్కాజ్‌గిరి ఈస్ట్‌ఆనంద్‌బాగ్‌లోని రత్నదీప్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈటల మాట్లాడుతూ మార్చి 15 శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు మిర్జాలగూడ చౌరస్తా నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా వరకు 1.3 కిలోమీటర్ల దూరం రోడ్ షోలో ప్రధాని నరేంద్రమోడీ పాల్గొంటారని తెలిపారు. మోడీ రోడ్ షోలో పాల్గొని విజయవంతం చేసేందుకు బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మద్యం, డబ్బు, ప్రలోభాలకు ఈసారి తావు లేదని, బిజెపి గెలుపును ఎవరు ఆపలేరన్నారు. డబ్బున్న వారి కోసం బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వెతుకుతున్నాయని, రెండు పార్టీలకు ఇప్పటి వరకు అభ్యర్థులు లేరన్నారు. ఎన్నో ఏళ్ల కల రామ మందిరం నిర్మాణం చేసి భారత జాతికి అంకితం చేసిన ఘనత మోడీదేనని అన్నారు. కాంగ్రెస్ నాయకుల ఇళ్లలో ఉన్న కుటుంబసభ్యులు కూడా ఈసారి మోడికి ఓటు వేయాలని అంటున్నారన్నారు. తెలంగాణలో 12 పార్లమెంటు స్థానాలు గెలువబోతున్నామని ఈటల ధీమా వ్యక్తం చేశారు.

ఆస్ట్రేలియాలో మృతిచెందిన మహిళ కుటుంబానికి ఈటల పరామర్శ

చర్లపల్లి: ఇటీవల ఆస్ట్రేలియాలో మృతిచెందిన మహిళ కుటుంబసభ్యులను ఈటల రాజేందర్ పరామర్శించారు. ఏఎస్ రావు బృందావన్ కాలనీలో ఉంటున్న మహిళ కుటుంబసభ్యుల ఇంటికి గురువారం వెళ్లి ఆమె తండ్రి బాలిశెట్టి గౌడ్‌ను ఈటల రాజేందర్ పరామర్శించారు. కార్యక్రమంలో ఆయన వెంట బిజెపి సీనియర్ నాయకులు మర్రి మోహన్‌రెడ్డి, రమేష్ యాదవ్, ఏనుగు సీతారాంరెడ్డి, విద్యాసాగర్, శరత్‌చంద్ర, నాగరాజు, సందీప్, సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లాలో మంజూరై వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి పనుల వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులను అదేశించారు. గురువారం జిల్లాలోని అన్ని మండల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎపిఓలు టిఎలతో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరగే సిసి రోడ్ల నిర్మాణ పనులు పర్యవేక్షణ చేస్తూ, వాటి పూర్తికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పనులు అయిన వాటికి ఎఫ్‌టిఓ జనరేట్ చేయాలేన్నారు. నిర్మాణ పనులలో అజాగ్రత్త వహించకుండా నాణ్యతగా చేపట్టాలన్నారు. ఎఇలు, డిఇలు పనులు పరిశీలించి పూర్తి చేయాలన్నారు. ఉపాధి హమీ పనుల్లో కూలీల సంఖ్య పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ఆర్‌జిఎస్ వ్యవస్థ బలోపేతం చేస్తు కూలీల సంఖ్యను పెంచుతూ పనులు చేయించాలని, విదుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. అంచనా ప్రకారం కూలీల సంఖ్యను పెంచుకోవాలన్నారు. సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, గ్రామలకు ఉపయోగపడే పనులను చేపట్టాలని తెలిపారు. గ్రామాలలో ఉన్న చిన్నచిన్న సమస్యలను మండల అధికారుల దృష్టికి తీసుకురావాలని అదేశించారు. వేసవిలో తాగునీరు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టలని అధికారులను అదేశించారు. రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటీ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టలని సూచించారు. తాగునీరు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఇంటికి మిషన్ భగిరథనీరు అందాలని తెలిపారు. గ్రామాలలో ఎక్కడ పైపు లీకేజీలు ఉన్న వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. పంచాయితీ కార్యదర్శులు, ఎంపీడిఓలు, ఎఇలు తాగునీరు సమస్యలపై సమావేశాలు ఏర్పాటు చేసుకోని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 18నుండి పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించాలన్నారు. జిల్లాలో మొత్తం 80 సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షలు నిర్వహించే ప్రదేశలలో జిరక్స్ సెంటర్లను ముసివేయించాలన్నారు. సెల్ ఫోన్స్ తదితరు వస్తువులను తీసుకురరావడం నిషేదమని, అన్ని పరీక్ష కేంద్రల వద్ద 144 సంక్షేన్ అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ శ్రీనివాస్, సుధీర్‌రెడ్డి, డిఇఓ రేణుకాదేవి, జిల్లా పంచాయతీ అధికారి సుధారాణి, మిషన్ భగీరథ ఇఇలు బాబు శ్రీనివాస్, చల్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిపై వీడియో కాన్ఫరెన్స్

కొడంగల్ : కొడంగల్ నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి, రానున్న పదవ తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ సి.నారాయణరెడ్డి గురువారం కొడంగల్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో ఎక్కడ కూడా వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అదేశించారు. ప్రతి గ్రామానికి, ప్రతి తాండాకు ప్రతి రోజు నీరు అందించేందుకు అధికారులు కృషి చేయాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. ఈ నెల 18వ తేది నుంచి ఏప్రిల్ 2వ తేది వరకు పదవ తరగతి పరీక్షలు ఉండటంతో పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. విద్యార్థులకు పరీక్ష సమయానికే కాకుండా అదనంగా మరో 5 నిమిషాల సమయం ఇవ్వడం జరిగిందని ఇది విద్యార్థులకు ఎంతో శుభవార్త అంటు చెప్పుకోచ్చారు. సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషినర్ బలరాంనాయక్, ఇన్‌చార్జి ఎంఈవో రాంరెడ్డి, మిషన్ భగిరథ ఈఈ నాగేశ్వరరావు, ఎంపీడీవో ఉషశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కుమార్‌లతో పాటు అధికారులు పాల్గొన్నారు.

'పది'లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఫిర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/బోడుప్పల్: పదవ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు నిర్దేశిత ప్రణాళిక అనుసరించాలని ఫిర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ కార్యక్రమం గురువారం నాడు జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డితో కలిసి మేయర్ జక్క వెంకట్ రెడ్డి పాల్గొని హాల్‌టికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాలు విద్యార్థి భవితను దిశానిర్దేశం చేస్తాయని, విద్యార్థి సమగ్ర అభివృద్ధికి సూచికగా నిలుస్తాయని అన్నారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించడంతో పాటు ఉన్నత చదువుతో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తమ వంతు సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తూ విద్యను అందిస్తున్నారని అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉన్నత స్థాయి ఫలితాలు సాధించేలా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం విద్యార్థులకు హాల్‌టికెట్లు, విద్యావాలంటీర్లకు గౌరవ వేతనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యప్రసాద్, కార్పొరేటర్లు సుభాష్ నాయక్, మధుసూధన్ రెడ్డి, ఏంపల్ల అనంత్‌రెడ్డి, నాయకులు బండారి రవీందర్, ఏనుగు మనోరంజన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

ప్రజాపక్షం/శామీర్‌పేట : గ్రామాభివృద్ధికి కృషిచేస్తానని ఎంపిటిసి పారుపల్లి నాగరాజు అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని 1వ వార్డులో ఎంపిటిసి నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంబించారు. కార్యక్రమంలో జాం రవి, వేణుగోపాల్‌రావు, రాజేంద్రప్రసాద్, యాదగిరి, డిటి నాగజ్యోతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/నాగారం: శ్మశాన వాటికల అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో హిందూ స్మశాన వాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎలిజాల నాగేష్, సరిత, గోక కళావతి, కోఆప్షన్ సభ్యులు అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర గుర్తింపు సంస్థతో ధరణి నిర్వాహణకు ప్రభుత్వ నిర్ణయం

ధరణి కమిటీ చైర్మన్ కోందడరాంరెడ్డి



ప్రజాపక్షం/శామీర్‌పేట : కేంద్రం గుర్తింపు పొందిన సంస్థతో ధరణిని నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ధరణి కమిటీ చైర్మన్ కోదండరాం రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ధరణి ప్రక్షాళనలో బాగంగా ఈనెల 1 నుంచి 17 వర కు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో బాగంగా గురువారం మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట మండలం పరిధిలోని బొమ్మరాశిపేట గ్రామంలో ధరణి కమిటీ సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా కోదండరాంరెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ధరణితో సామాన్య రైతులు మోసపోయారని బిఆర్ఎస్ బడా నాయకులు మాత్రం లబ్ది పొందారని ధరణి కమిటి చైర్మన్ కోదండరాంరెడ్డి అన్నారు. గురువారం శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేటకు చెందిన రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం శామీర్‌పేట తహాశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డితో బొమ్మరాశిపేట రైతుల భూములపై వివరాల ను అడిగి తెలుసుకున్నారు. గత యాభై ఏళ్ల క్రితం సుమారు 1050 ఎకరాల భూమిని తమ పూర్వికుల నుంచి రైతులు సాగుచేసుకుంటున్నారన్నారు. రైతులకు మాత్రం స్లాట్‌లు బుక్ కావడం లేదని ధరణిలో బ్లాక్ లిస్ట్‌లో ఉన్న భూములు బిఆర్ఎస్ నాయకులు ఎలా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ధరణి పోర్టల్ వలన చాలామంది సన్న చిన్న కారు రైతులు మోసపోయారని ధరణి వలన గత పాలకు లు బాగుపడ్డారని ఆరోపించారు. ధరణిలో లోపాలను సరిచేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ నూతన కమిటీని నియమించిందని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయా లతో దరణిలోని లోపాలను వెలికి తీసి సాఫ్ట్‌వేర్ సమస్యలు నూతన చట్టాలను ఏర్పాటు చేసి రైతులకు న్యాయం జరిగే విదంగా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సునిల్, బొమ్మరాశిపేట రైతులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి శంభీపూర్‌రాజుకు షాక్

మల్కాజిగిరి బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడి

రెండు రోజుల్లోనే నిర్ణయం మార్పు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: రెండు రోజుల ముందే మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థిగా ప్రకటించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు బిఆర్ఎస్ పార్టీ అధినేత షాక్ ఇచ్చారు. ఈ స్థానానికి తమ అభ్యర్థిగా ఉప్పల్ అసెంబ్లీ స్థానానికి తనకు టికెట్ ఇవ్వలేదన్న కోపంతో ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిన రాగిడి లక్ష్మారెడ్డిని ఖరారు చేస్తూ గురువారం అధిష్టాన వర్గం ఖరారు చేసింది. సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని , పార్టీ ముఖ్యనేతలు, క్షేత్ర స్థాయిలో అభిప్రాయాలు సేకరించటం ద్వారా అందరి అభిప్రాయాల మేరకు ఏకాభిప్రాయంతో ముందస్తుగా అనుకొన్న ఎమ్మెల్సీ స్థానంలో రాగిడి లక్ష్మారెడ్డి పోటీ చేయనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు తన నియోజకవర్గంలోని ఎమ్మెల్యే వివేకానందతో విభేదాలు ఉండటం, పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో గెలుపొందిన తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలతోనూ సరైన సంబంధాలు లేక పోవటం, మరో పక్క మామా అల్లుళ్లైన మేడ్చల్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖరరెడ్డిలు ఎప్పుడు పార్టీ నుండి జంప్ అవుతారో తెలయక అయోమయంలో ఉండటం, తదితర కారణాలతో అభ్యర్థిని మార్చినట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడిగా కలిసొచ్చేనా..

30 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పలు పార్టీ పదవులు చేపట్టిన రాగిడి లక్ష్మారెడ్డికి పార్టీ నుండి ఇటీవల జరిగిన శాసనసభా ఎన్నికల సమయంలో తాను ఆశించిన విధంగా తనకు కాకుండా పరమేశ్వరరెడ్డికి పార్టీ టికెట్ కేటాయించటం ఆయనకు తీవ్ర ఆగ్రహం కలిగింది. దీంతో వెంటనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి నాటి పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డే దీనికి కారణం అంటూ తీవ్రంగా దూషించి బిఆర్ఎస్‌లో చేరాడు. ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి విజయం సాధించటంలో ఆయన తీవ్ర కృషి చేసారు. సీనియర్ నాయకుడిగా పలువురితో ఆయనకు ఉన్న సన్నిహిత సంబంధాలు ఆయనకు కలిసి వచ్చే అంశాలవుతాయి. కాగా ఉప్పల్ అసెంబ్లీ సెగ్మెంట్‌కే పరిమితమై ఉన్న ఆయన 30 లక్షలకు పైగా ఓటర్లు, ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్న మల్కాజిగిరి పార్లమెంటులో ఉత్తర భారత రాష్ట్రంలోని అనేక రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ రాష్ట్ర వాసులు ఉన్న ఇక్కడ ఆయన ఏ మేరకు ఆకట్టుకొంటారో అన్నది సంశయమే.

అసంపూర్తి డ్రైనేజీ నిర్మాణంతో ఇబ్బందులు

ప్రజాపక్షం / శ్రీరంగాపూర్ : మండల పరిధిలోని తాటిపాముల గ్రామం లో 4వ వార్డు లోని దర్గా వీధిలో సర్పంచుల పాలన ఉన్నప్పుడు డ్రైనేజీ ని ర్మాణం చేపట్టారు. కేవలం పైపులు మాత్రమే వేసి అసంపూర్తిగా మధ్యలో వదిలేయడంతో ఆ వార్డులోని ప్రజలకు రాకపోకలకు తీవ్ర సౌకర్యం కలుగుతుంది. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి , స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికి చూస్తాం అనడమే తప్ప పని పూర్తి చేయకుండా నాన్చుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తక్షణమే ఆ డ్రైనేజీ పనిని పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడవాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని తాటిపాముల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మండల ఉపాధ్యక్షులుగా శేఖర్

ప్రజాపక్షం/వెల్దండ : యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా చొక్కన్నపల్లి గ్రామానికి చెందిన దూళ్ల శేఖర్‌ను నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను గురువారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లిశేఖర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్‌లు శేఖర్ అందజేశారు.ఈసందర్భంగా దూళ్ల శేఖర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా యువజన కాంగ్రెస్ సామాన్య కార్యకర్తగా పనిచేస్తున్న నానిబద్ధతను గుర్తించిన కాంగ్రెస్‌పార్టీ యువజన కాంగ్రెస్ నాయకులు యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులుగా తనను నియమించడం సంతోషంగా ఉందన్నారు. నాపై ఉన్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని అదేవిధంగా తన నియామకానికి సహకరించి న సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచందర్‌రెడ్డి, ఎంఎల్‌ఎ కసిరెడ్డి నారాయణరెడ్డి , మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయ క్, కిసాన్‌సెల్ తాలుకా అధ్యక్షులు పర్వత్‌రెడ్డితోపాటు నియమించిన యు వజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శేఖర్, జిల్లా అధ్యక్షులుకొడిదెలరాము, నియోజకవర్గ అధ్యక్షులు అనిల్‌గౌడ్, మండల అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈనెల 16న లోక్‌అదాలత్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : రాష్ట్రహైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయసేవా అధికారసంస్థ ఆధ్వర్యంలో మొదటి జాతీయ లోక్‌అదాలత్‌ను ఈనెల 16న జిల్లాకోర్టు సముదాయంలో , కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ కోర్టుభవనాల సముదాయాలలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీమార్గమే రాజమార్గమన్నారు. క్రిమినల్‌కేసులు, భూతగాదాకేసులు, మోటార్‌వెహికిల్ యాక్సిడెంట్‌కేసులు, బ్యాంక్‌కేసులు, బిఎస్‌ఎన్‌ఎల్ కేసులు, పిట్టికేసులు రాజీచేసుకోవచ్చని , భూతగాదాలకు సంబంధించిన కేసులు రాజీ అయినప్పుడు కోర్టుఫీజు వాపస్ ఇవ్వబడుతుందన్నారు. ఇరువర్గాలు రాజీకావడం వలన సమయభావం, ఖర్చులు తగ్గించుకోవచ్చని, క్రిమినల్ కేసులలో రాజీ అయితే చదువుకునే విద్యార్థులు గవర్నమెంట్ ఉద్యోగాలకు ఎటువంటి ఇబ్బంది ఏర్పడదని, కేసులురాజీకావడంవలన కక్షిదారులకు ఇరువర్గాలవారు సుఖసంతోషాలతో జీవించవచ్చన్నారు.

పదిలో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం

ప్రజాపక్షం/కల్వకుర్తి : పదోతరగతిలో విద్యార్థులు మీలక్ష్యం ఉత్తీర్ణత సాధించడమేనని ఎస్ఐ మహేందర్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో కెజిబివి పాఠశాల, జిల్లాపరిషత్ బాలికల పాఠశాల, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు అమ్మఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆనంద్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా ఎస్ఐ మహేందర్ పాల్గొని పరీక్షప్యాడ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాలు కష్టపడి చదువుకుంటూ పదోతరగతికి వచ్చారని మీలక్ష్యం ఉత్తీర్ణత సాధించేలా ఉండాలని, ఎలాంటి ఆలోచనలను రానివ్వకుండా చదుకోవాలన్నారు. ఏకులంవారికైనా , ఏమతంవారికైనా ఉన్నతస్థాయిలో నిలిపేది చదువు ఒక్కటేనన్నారు. మీకు ఏదైన సబ్జెక్టులో సమస్య ఉంటే అందరూ ఒక దగ్గర కూర్చొని పరిష్కరించుకోవాలన్నారు. పదోతరగతి అనేది మొదటిమెట్టు అని పదిలో ఉత్తీర్ణత సాధిస్తే మీకు మీపై నమ్మకం పెరుగుతుందని, ఏపరీక్షనైన రాసి సాధిస్తామని అనుకుంటారని అన్నారు. ఫోన్లు ఎక్కువగా వాడొద్దని, వాటివలన ఎంత అవసరం ఉందో, అంతకుమించి నష్టం ఉందన్నారు. వివిధరకాల యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవడం వలన సైబర్‌క్రైమ్ వాళ్లు మోసం చేసే ప్రమాదాలు చాలా ఉన్నాయని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెన్నకేశవులు, ఉపాధ్యాయులు సరిత, జయప్రద, శ్రీనుప్రసాద్, బక్కయ్య, శైలజ, కుమారి, రమ, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ పనిచేయాలి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నా గర్కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌జెండా ఎగురవేయడమే లక్ష్యం గా యూత్‌కాంగ్రెస్ పనిచేయాలని కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జీలు మెరుగు రమేష్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్‌లు అన్నారు. గురువారం కల్వకుర్తి యూత్ కాంగ్రెస్ తాలుకా అధ్యక్షులు రాపోతుఅనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో వెల్దండ దగ్గర తాలుకా మండలాల పట్టణాల అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యువజన కాం గ్రెస్ దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డోర్‌టుడోర్ యాక్టివిటి గు రించి వివరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ జెం డా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ర్పాటుచేసిన వందరోజుల్లోనే ప్రజలకు నెరవేర్చిన హామీలను ప్రజల్లోకి బ లంగా తీసుకెళ్లిందన్నారు. కేంద్రంలో మోడి సర్కార్ 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్‌రాష్ట్ర కార్యదర్శులు చంద్రకాంత్‌రెడ్డి, తక్కళ్లపల్లిశేఖర్, యువజన కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు బీసబాలరాజు, దళపతిగౌడ్, కడారి శ్రీనివాస్‌యాదవ్, యూత్‌కాంగ్రెస్ నాయకులు జావిద్, సురేష్, సైదులు, రుత్విక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం వినియోగించుకుందాం

ప్రజాపక్షం/జడ్చర్ల : మార్చి 15వ తేది శుక్రవారం రోజు జడ్చర్లలోని శ్రీ సత్యనారాయణ స్వామి మందిరంలో అధ్యక్షులు చిత్తనూరి ఈశ్వర్ కుమార్తె వేముల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పదిమంది డీలర్లతో ఆకుపంచర్ న్యాచురోపతి ఉచిత శిబిరం ఏర్పాటు చేయనైనది. ఇక్కడ వీరు కేవలం నాడి పట్టుకుని మనకుండే సమస్యలు తెలుసుకుని, మనకు చికిత్స లను అందజేస్తారు. శ్రేయోభిలాషులు అందరూ తమ యొక్క ఆరోగ్య సమస్యలు ఏవైనా దీర్ఘకాలికము లేదా తాత్కాలికం వీరి వద్ద తక్షణ ఉపశమనము పొందండి. ఎటువంటి మందులు లేకుండా మీ ఆరోగ్య సమస్యలు తెలుసుకోండి. వివరాలకు సంప్రదించండి 9440687478 , 9703558855.

రుణ వితరణ సామాజిక బాధ్యత

బ్యాంకర్లకు భట్టి విక్రమార్క హితవు

ప్రజాపక్షం/హైదరాబాద్: రుణాలను ఇవ్వడం బ్యాంకర్లు తమ సామాజిక బాధ్యతగా గుర్తించాలని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ బేగంపేటలోని ప్రైవేటు హోటల్‌లో గురువారం జరిగిన 'స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ' 40వ త్రైమాసిక సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇందిరమ్మ రాజ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రాధన్యతగా నిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రాధన్యతగా తీసుకున్న వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలను ముందుకు తీసుకుపోవడానికి బ్యాంక్లరు కూడా సహకరించాలని కోరారు. గత పాలనలో చాలా మంది రైతులవి ఇర్రెగ్యులర్ ఆకౌంట్స్‌గా మారాయని, వారికి కొత్తగా రుణాలు ఇవ్వాలన్నారు. రుణాలు ఇచ్చే విషయంలో రైతుల పట్ల నిర్లక్ష్యం, అసహనం ప్రదర్శిస్తే, వారు సాగు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారని, తద్వారా రుణ భారం తీరక అప్పులు చెల్లించలేక, రైతులు ఆత్మహత్యలకు దారితీసే ప్రమాదం ఉందని వివరించారు. రైతుల పట్ల మానవీయ కోణంలో బ్యాంకర్లు వ్యవహరించాలని సూచించారు. వ్యవసాయం, హౌసింగ్, విద్యకు ఇచ్చే రుణాలను బ్యాంకర్లు ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. వ్యాపారంలో విఫలమైన రైతులకు రుణాల చెల్లింపుల విషయంలో బ్యాంకర్లు వన్ టైం సెటిల్మెంట్ చేయాలని కోరారు. రైతులు, నిరుద్యోగులకు రుణాల ఇచ్చే విషయంలో బ్యాంకర్లు ఆస్తులను తప్పనిసరిగా తాకట్టు పెట్టుకోవడం సరైంది కాదన్నారు. స్వయం ఉపాధి కొరకు యువతకు రుణాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో స్వయం సహయక సంఘంలో ఉన్న మహిళ సభ్యులను కోటీశ్వరులుగా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు స్వయం సహాయక సంఘాలకు అధిక రుణాలు ఇవ్వలని సూచించారు. రానున్న ఐదు సంవత్సరాల్లో డ్వాక్రా సంఘాల మహిళలకు లక్ష కోట్ల రూపాయలను వడ్డీ లేకుండ రాష్ట్ర ప్రభుత్వం రుణాలు ఇప్పించబోతున్న కార్యాక్రమానికి సహకరించాలన్నారు. మహిళలకు ఇచ్చే వడ్డీ లేని రుణాల డబ్బులను బ్యాంకర్లకు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఆంధ్ర బ్యాంకు డైరెక్టర్‌గా తాను ఉన్న సమయంలో విద్య రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు ప్రారంభం అయ్యాయని, 20 ఏండ్లు అవుతున్న ఆ రుణాల జారీలో ప్రగతి కనిపించ లేదన్నారు.
సంపద సృష్టికర్తలకు బ్యాంక ర్లు తోడ్పాటు అవ్వడం వల్ల తెలంగాణ ధనిక రాష్ట్రంలో సృ ష్టించే సంపద ప్రజలకు పంచవచ్చని వివరించారు. పెట్టుబడులకు హైదరాబాద్ అనువైన ప్రాంతమన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, ఆవుటర్ రింగ్ రోడ్డు మధ్యన ప్రభుత్వం క్లస్టర్లను ఏర్పాటు చేయబోతున్నదని, వీటి మధ్యన పరిశ్రమల స్థాపన పెద్ద ఎత్తున ఉండబోతుందన్నారు. మంత్రి తు మ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో ప్రజలకు ప్రాధాన్యత ఉన్న పథకాలను గు ర్తించి వాటిని ముందుకు తీసుకెళ్లడానికి బ్యాంకర్లు సహకరించాలన్నారు. రుణాలు ఇచ్చే విషయంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు బ్యాంకులు మొదటి ప్రా ధాన్యత ఇవ్వాలన్నారు. దేశ సంపద రైతులని, దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధానం వ్యవసాయమన్నారు. దేశంలో వ్యవసాయం సంక్షోభంలోకి పోతే ఆహారం కొరత ఏర్పడే ముప్పు ఉందన్నారు. అందుకే రైతులను ప్రోత్సహించాలన్నారు. రాష్ట్రంలో విచిన్నమైన వ్యవస్థలను సరి చేసి ప్రజల ఆర్థిక అవసరాలను తీర్చాలని లక్ష్యంతో అంకితభావంతో పని చేస్తున్న ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించి, ఆ లక్ష్యాలను చేరుకునేలా బ్యాంకర్ల పనితీరు ఉండాలని సూచించారు. రాష్ట్రంలో డిమాండ్ కు తగ్గట్టుగా పాల ఉత్పత్తి లేదని, పాడి పరిశ్రమ నెలకొల్పడానికి ముందుకు వచ్చే రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ నిబద్ధతగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో కలుషితం కావొద్దని హితవు పలికారు. ఆనంతరం పట్టుగూళ్ల పెంపకం రైతులకు రూ.1, 83, 41,000 ప్రోత్సాహక ఇన్సెంటివ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్బిఐ సీజీఎం రాజేష్కుమార్, ఎస్ఎల్బిసి కన్వీనర్ మిత్ర, నాబార్డ్ జీఎం పిపి ఉషా, అధికారులు శారధ, జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలను బలోపేతం చేస్తాం

మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ బ్యూరో : స్థానిక సంస్థలను బలోపేతం చేసి, వారి ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఎంపిటిసి వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం చేశారని, ఎంపిటిసిల ప్రధాన డిమాండ్ అయిన ఆత్మగౌరవం, నిధులు, విధులు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని పోవడం జరిగిందని ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. రాష్ట్ర ఎంపిటిసి సంఘం ఫోరం అధ్యక్షులు గడిల కుమార్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా మూడు నెలల్లోనే ఐదింటినీ అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని, మాకు ఉన్నటువంటి సమస్యలకు కూడా పరిష్కారం దొరుకుతుందనే ఉద్దేశ్యంతో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుతో సమావేశమై మా సమస్యలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగింది. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి మా నినాదమైనటువంటి ఆత్మగౌరవం, నిధులు, విధులు విషయంలో మేలు చేస్తారనే భరోసాతో సరైన న్యాయం జరుగుతుందని ఉద్దేశంతో మేము ఎంఎల్‌సి ఎన్నికల నుంచి తప్పుకోవడం జరిగిందని, జీవన్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు వాళ్లు తెలిపారు. సాయంత్రం ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాత మా సమస్యలపై ఇంకా క్లారిటి వస్తుందని ముఖ్యమంత్రి మా సమస్యలు తీరుస్తానని ఆశాభావం మాకు ఉందని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఏమైనా కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని పేదల సంక్షేమం కోసం పని చేస్తున్న పార్టీ అని, ఆ పార్టీకి అండగా నిలవాలని, మేము కలిసి కాంగ్రెస్ పార్టీ తో నడవడానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికలలో జీవన్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు వా ళ్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు , దేవరకద్ర ఎంఎల్‌ఏ జి. మధుసూదన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంఎల్‌ఏ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, డిసిసి సోషల్ మీడియా ఇంచార్జీ సిజె బెనహర్ , దేవి రవీందర్ , ప్రతాప్ , ఉమ్మడి జిల్లా ఎంపిటిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కారల్‌మార్క్స్ వర్ధంతి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని సిపిఐ లక్ష్మణాచారి భవనంలో కారల్‌మార్క్స్ 141 వర్ధంతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ ఎం.బాల్‌నర్సింహ్మా మాట్లాడుతూ కారల్‌మార్క్స్ గతంలో ఉన్నటువంటి పెట్టుబడిదారి ఆర్థిక సిద్ధాంతానికి ఎదురులేదని ఈ ఒక్క సిద్ధాంతం ప్రపంచంలో ప్రజలకోసం పనిచేసే సిద్ధాంతమని చెప్పడం జరిగింది. మార్క్స్ ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో అనేక తత్వవేత్తలు రాసినటువంటి ఆర్థిక గ్రంథాలను అధ్యయనంచేసి తాను ఆర్థికగ్రంథంద్వారా దాస్ క్యాపిటల్ అనే అటువంటి గ్రంథాన్ని రచించి దానిద్వారా మిగులు సిద్ధాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. ప్రపంచంలో ఆర్థికసిద్ధాంతాన్ని ముందుతరానికి చాలా విలువైన దాస్ క్యాపిటల్ సిద్ధాంతాన్ని రచించి మనకు పెట్టుబడిదారి వ్యవస్థను రూపుమాపేందుకు కంకణం కట్టుకొని ఎన్నో త్యాగాలు చేసిన కారల్‌మార్క్స్ సిద్ధాంతాలను ఇప్పటికి ఎప్పటికి చెక్కుచెదరకుండా ఉన్న ఒకే ఒక్క కారల్‌మార్క్స్‌కి అంకితమన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు హెచ్ ఆనంద్‌జి, ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు మధుగౌడ్, సిపిఐటౌన్ కార్యదర్శి గోపిచారి, సిపిఐటౌన్ సహాయ కార్యదర్శి రామస్వామి, కొత్రశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆసుపత్రి సామర్థ్యానికి అనుగుణంగా కార్మికులసంఖ్య పెంచాలి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ టెండర్ అగ్రిమెంట్‌ను సవరించి మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆరు వందల పడకల సామర్థ్యానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచి కార్మికులపై అదనపు పనిభారాన్ని తగ్గించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు . గురువారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో అదనపు కార్మికుల సంఖ్య పెంచాలని , కార్మికుల జీతం, పిఎఫ్ , ఈఎస్ఐ లలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలని, కార్మికులపై వేదింపులు అక్రమ తొలగింపులు ఆపాలని, పెండింగు వేతనాలు తక్షణమే చెల్లించాలని తదితర డిమాండ్‌లతో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కార్మికులు ఆసుపత్రి ఎదుట నిరసన చేపట్టి అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. జీవన్‌కి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పి.సురేశ్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి దినదిన అభివృద్ధి చెందుతున్నదని కానీ సిబ్బంది కొరతతో తీవ్రమైన అదనపు పనిభారం కార్మికులపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రికి 600 పడకలకు ప్రభుత్వం నుండి అనుమతి వచ్చిన పారిశుద్ధ్య భద్రత పేషంట్ కేర్ నిర్వహణకు సంబంధించి 2022 జూన్ నెలలో అప్పటి ప్రభుత్వం కేవలం 450 పడకలకు మాత్రమే ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ టెండర్లకు అనుమతి ఇచ్చి తక్కువ స్థాయిలో పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ సూపర్‌వైజర్ కార్మికుల సంఖ్యను భర్తీకి సాయి సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీకి అనుమతులు కట్టబెట్టిన వీటిని కూడా పూర్తిస్థాయిలో కార్మికులు సంఖ్యలను భర్తీ చేయకుండా అరకొరా కార్మికులతో అదనపు పనిచేయిస్తూ వెట్టి చాకిరికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యూనియన్ బ్రాంచ్ నేతలు జే.నరసింహ, మొగులయ్య, బాలకోటి, దేవానంద్, రంగన్న, లోకేశ్, బాల్‌రాజు, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమం కోసమే జర్నలిస్టు యూనియన్ ఆఫ్ తెలంగాణ స్టేట్

'జస్ట్' ఉమ్మడి జిల్లా కన్వీనర్ బసవరాజు

అధ్యక్షులుగా వి.లక్ష్మ ణ్ నాయక్, గౌరవ అధ్యక్షులుగా శే ఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మల్దే శ్రీశైలం

ప్రజాపక్షం/బాలానగర్ : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమంలో తెలంగాణ జర్నలిస్టుల పాత్ర యేనలేనిదని, జర్నలిస్టుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని వారి సంక్షేమం కోసం జర్నలిస్టు యూనియన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ (జస్ట్) సంఘం నూతనంగా పురుడు పోసుకున్నదని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జస్ట్ కన్వీనర్ బసవరాజు పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు బాలానగర్ మండల కేంద్రంలోని పెద్దయ్యపల్లి చౌరస్తా వద్ద మండల నూతన కమిటీని బసవరాజు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల నూతన అధ్యక్షులుగా విస్లావత్ లక్ష్మ ణ్ నాయక్, గౌరవ అధ్యక్షులుగా పి.శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మల్దే శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా వికె నవీన్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా బసవరాజు, కోశాధికారిగా శ్రీశైలం యాదవ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా కన్వీనర్ బసవరాజు, కమిటీ స్టేట్ సభ్యులు వెంకటేశ్‌లు మాట్లాడుతూ ఇదివరకు ఎన్నో సంఘాలు జర్నలిస్టులు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఆచరణలో సామాన్య జర్నలిస్టుల సంక్షేమని పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాని నూతనంగా ఏర్పడిన జస్ట్ యూనియన్ మాత్రం జర్నలిస్టులు సమస్యల సాధన కోసం వారి సంక్షేమ అభివృద్ధి కోసం నిర్మాణాత్మక పాత్ర పోషించడం జరుగుతుందని వెల్లడించారు. బాలానగర్ మండల నూతన కమిటీకి అధ్యక్షులు ఎన్నికైన లక్ష్మ ణ్ నాయక్ ఆధ్వర్యంలో గతంలో టిడబ్ల్యుజెవన్ ఫోర్ త్రీ ఆధ్వర్యంలో చెట్లు నాటడం, ఇతర పలు సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను కాలువలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో రావుల

ప్రజాపక్షం / వనపర్తి టౌన్ : మాజీ ఎంపి రావు ల చంద్రశేఖర్ రెడ్డి గురువారం వనపర్తి జిల్లా కేం ద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 47వ బ్ర హోత్సవాల పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త అయ్యలూరి రఘునాథ శ ర్మ, ఆలయ పూజారులు , ఆలయ మర్యాదలతో రావుల చంద్రశేఖర్‌రెడ్డికి స్వాగతం పలికా రు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు ని ర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మ న్ గట్టు యాదవ్ , వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ , నందిమల్ల ఆశోక్ , అలేఖ్య , తిరుమల్ , యాద య్య, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్ పట్టివేత

ప్రజాపక్షం/కల్వకుర్తి : పట్టణపరిధిలోని గ్రీన్‌పార్క్‌వెంచర్ సమీపంలో గురువారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

టిబి రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

ప్రజాపక్షం / పెబ్బేరు : పెబ్బేరు మండల పరిధిలోని తిప్పాయపల్లి గ్రామంలో టిబి ముక్తా గ్రామ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా తిప్పాయిపల్లి గ్రామాన్ని టీబీ రహిత గ్రామంగా గుర్తించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నడా. సంగీత హెచ్ఒడి మెడికల్ కాలేజీ వనపర్తి, డా. అనిల్ కుమార్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మెడికల్ కాలేజీ వనపర్తి, డాక్టర్ వంశీకృష్ణ డా. రాముడు, బాసిద్ ఖాన్ , రత్నయ్య, పంచాయతీ సెక్రటరీ గోపాల్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ తిరుపతయ్య, ఏఎన్ఎం సరోజ, ఆశ వర్కర్ శ్రీదేవి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బిసిలకు ఎంపిలుగా పోటీ చేసే అర్హత లేదా?

బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్ సాగర్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : త్వరలో జరగబోవు పార్లమెంటు ఎన్నికల్లో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు అగ్రవర్ణాలకే సీట్లను కేటాయించి బిసిల అగ్రహానికి గురయ్యారని ఈ ఎన్నికల్లో ఆయా పార్టీలకు తగిన బుద్ధి చెప్తామని ఉమ్మడి జిల్లా బిసి సమాజ్ కన్వీనర్ ఎం.శ్రీనివాస్ సాగర్ హెచ్చరించారు. బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలో 65 శాతం ఉన్న బిసిలను ఏమాత్రం పట్టించుకోకుండా వాళ్ల అభిప్రాయం పరిగణలోకి తీసుకోకుండా మూడు ప్రధాన రాజకీయ పార్టీలు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి పార్లమెంటు అభ్యర్థులుగా సీట్లను ప్రకటించడానికి బిసి సమాజం మొత్తం ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షులు లక్ష్మి కాంత్, సారంగి, తదితరులు ఉన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి. బాల్‌రెడ్డి

ప్రజాపక్షం / వీపనగండ్ల : కేంద్ర ప్రభుత్వం రైతన్ననికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని , రైతు సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు డి. బాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం వీపనగండ్ల గ్రామ కమిఇటీ ఆధ్వర్యంలో ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి మద్దతుగా మండల కేంద్రంలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బాల్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం రైతు ఉద్యమం జరిగిన సందర్భంగా రైతు ప్రతినిధులతో కేంద్ర బిజెపి ప్రభుత్వం చర్చలు జరిపి రైతన్నకి రాతపూర్వకంగా హామీలు ఇవ్వడం జరిగిందని, నేటి వరకు అవి అమలు కాదవడం లేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కనీస మద్దతు ధరల చట్టం అమలు చేసి రుణ మాఫీ చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలన్నారు. రైతులకు పదివేల పించన్ ఇవ్వాలని , ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ కరణ ఆపాలని, కనీస వేతనం కార్మికులకు రూ. 26వేలు ఇవ్వాలని, 2013 భూ సేకరణ చట్టాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇది అమలు చేయకపోతే రేపు జరిగే ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతు కమిటీ అధ్యక్షులు వెంకటయ్య, కోశాధికారి వెంకటస్వామి, రైతు నాయకులు ఈశ్వర్ , సిహెచ్ వెంకటయ్య, బాలపేరు, వీరబాబు, గోపీ, కృష్ణయ్య, వెంకటస్వామి, బత్తుల రాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తా

ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ బ్యూరో: నాపై నమ్మకంతో మహబూబ్‌నగర్ ఎంపి టికెట్ ఇచ్చిన కేంద్రంలోని బిజెపి అధిష్టానానికి మాజీ మంత్రి పాలమూరు పార్లమెంట్ బిజెపి అభ్యర్థి డి.కె. అరుణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోయిన ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓటమి పాలు అయ్యాయని, ఈ సారి తప్పకుండా గెలుస్తానన్న నమ్మకం ఉందని, ఆనాడు బిఆర్‌ఎస్ ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికి ప్రజల్లో నాకు ఆదరణ ఉందన్నారు. గత ఎన్నికల్లో బిఆర్‌ఎస్ 7 అసెంబ్లీ స్థానాల్లో అధికారంలో ఉన్నప్పటికి ఆనాడు 3 లక్షలకు పైగా మెజార్టీతో రెండో స్థానంలో నిలిచానన్నారు. దేశంలో గల్లీ నుంచి ఢిల్లీ వరకు మరోసారి ప్రధాని మోడీ మీనియా మొదలైందన్నారు. తెలంగాణ అభివృద్ధి జరగాలంటే 12 స్థానాలు, పాలమూరు అభివృద్ధి జరగాలంటే నాగర్‌కర్నూల్ , మహబూబ్‌నగర్ సీట్లు గెలవాల్సిందే నన్నారు. మహబూబ్‌నగర్ సీటును గెలిపిద్దామని, ప్రధాని మోడీకి కానుకగా ఇద్దామన్నారు. పాలమూరు జిల్లా అభివృద్ధిలో నావంతు కృషి ఎంతుందని, ప్రజలందరికి తెలుసు అన్నారు. వారే నన్ను గెలిపిస్తారన్న నమ్మకం ఉందన్నారు. ఈ ప్రాంత బిడ్డగా నన్ను నమ్మి గెలిపించాలని , అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానన్నారు. ఆరు గ్యారంటీలల్లో ఏ ఒక్కటి అమలు కాలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ఉన్నాయని, కాంగ్రెస్ హామీల అమలు పేరుతో యాడ్స్ , మీడియాలో ప్రమోషన్ చేసుకుంటోందని, ఇచ్చిన హామీలు అమలు చేసి చూపాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉందన్నారు. దేశంలో కాంగ్రెస్ వచ్చేది లేదని, దీనావస్థలో ఉందన్నారు. అధికారంలోకి రాగానే 17 సీట్లు గెలిస్తే హామీలు అమలు చేస్తామని, అప్పులున్నాయని, అమలు చేయలేకపోతున్నామని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జి. పద్మాజారెడ్డి, పడాకుల బాలరాజు, జిల్లా అధ్యక్షులు పి. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణవర్ధన్‌రెడ్డి, పి. సత్యం, క్రిష్టియనాయక్ , పార్లమెంట్ కన్వీనర్ పవన్‌కుమార్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే కాంటెస్ట్ అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కరువు జిల్లాగా సూర్యాపేట

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్

ప్రజాపక్షం/నూతనకల్ : సూర్యాపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బిక్కుమళ్ళ గ్రామంలో ఎండిన పంట పొలాలను స్థానిక రైతు సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 23 మండలాల్లో ఎక్కడ చూసిన బోరు బావులు, చెరువులు, కుంటలు అడుగంటిపోయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పొట్ట దశకు వచ్చిన వందలాది ఎకరాల వరి పంట ఎండిపోయి రైతులు నష్టపోతున్నారన్నారు. రైతులు చేసిన శ్రమతో పాటు ఎకరాకు పెట్టిన రూ.20వేల పెట్టుబడి నష్టపోవాల్సిన పరిస్థితులు ఏర్పడాయన్నారు. కరువుతో కూలీలకు పని దొరకని పరిస్థితి అని, ఉపాధిహామీ పథకం ద్వారా 200 రోజుల పని దినాలు కల్పించి రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీనియోజకవర్గం ఇన్‌చార్జీ యల్లంల యాదగిరి, రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మూరగుండ్ల లక్ష్మయ్య, మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్, నాయకులు పాల్వాయి పున్నయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు..

ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్

ప్రజాపక్షం/వరంగల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోని ముందుకు సాగాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ అన్నారు. వరంగల్‌లోని గొర్రెకుంట గ్రామంలోని జిల్లా పరిషత్ సెంకడరీ పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకోని చదివినప్పుడే ఉన్నత స్థానాల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో సిఆర్‌పి రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతిమై, ఉపాధ్యాయులు రఘువీర్, షాహీన్, సుల్తానా, చంద్రశేఖర్, శ్రీనివాస్, అనిత, ప్రభాకర్, దమరి, రఘువీర్, ప్రణిత కుమారి, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

కోర్టు కేసులో ఉన్న భూమిలో రోడ్డు వేసినవారిపై చర్యలు

కలెక్టర్‌కు మాజీ ఎంఎల్‌ఎ రాజారెడ్డి వినతి

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి : శిఖం భూమి, హైకోర్టులో కేసు నడుస్తున్న ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ నిధులతో రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, జనగామ మాజీ ఎంఎల్‌ఎ సిహెచ్ రాజారెడ్డి కోరారు. గురువారం జనగామ కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌ను కలిసి నెల్లుట్ల శిఖం భూమి వివరాలను వివరించారు. లింగాలఘనపురం మండలం నెల్లుట్ల గ్రామంలో భూస్వామి లక్ష్మనేసింగ్ తప్పుడు డిక్లరేషన్ ద్వారా 12 నెలలు నీటిలో మునుగుతుందని కాజేశాడన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన రాహుల్ బొజ్జా సదరు భూమి ప్రభుత్వానికి చెందినదని హైకోర్టులో కేసువేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం కేసు హైకోర్టులో నడుస్తుండగా రోడ్డు వేయడానికి కాంట్రాక్టర్లు, భూస్వాములు ప్రయత్నం చేయగా జనగామ జిల్లా గత కలెక్టర్ సిహెచ్ శివలింగయ్యకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు, భూస్వామితో కుమ్మక్కై రూ.40లక్షల ప్రభుత్వ నిధులతో రోడ్డు వేశారని, శిఖం భూమి అని తెలిసి కూడా ప్రభుత్వ నిధులతో ఎలా రోడ్డు ఎలా వేస్తారన్నారు. పంచాయితీరాజ్ అధికారులు గ్రామ పంచాయితీ అధికారులు కలిసి రోడ్డు వేశారంటే ఎంత అవినీతి జరిగిందో అర్థం చేసుకోవచ్చునన్నారు. అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం సోచనీయమన్నారు. ఈ భూముల్లో ఎలాంటి పర్మీషన్లు ఇవ్వకూడదని, ఉన్న వాటిని తొలగించాలని జిల్లా పంచాయతీ అధికారి, నెల్లుట్ల గ్రామ కార్యదర్శికి, డివిజన్ అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ భూముల వ్యవహారంలో అవినీతి జరిగిందని, ఫిర్యాదులు చేస్తున్నా, శిఖం భూమిపై కోర్టులో కేసు ఉన్నా ప్రభుత్వ నిధులతో రోడ్డు వేశారంటే అధికారులు ఎంతటికి తెగబడ్డారో అర్థం అవుతుందన్నారు. శిఖం భూమిలో రోడ్డు వేసిన అధికారులపై చర్య తీసుకోవడంతో పాటు ప్రభుత్వ నిధులు రికవరీ చేయాలని జిల్లా కలెక్టర్‌ను రాజారెడ్డి కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, సిపిఎం మాజీ కౌన్సిలర్ ఎండి దస్తగిరి, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగళంపల్లి జనార్ధన్, పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య, చిల్లోజు మల్లేశం, గుర్రం మదు, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఎఎన్‌ఎంలకు ఉద్యోగ భద్రత

ఎఐటియుసి రాష్ట్ర నరసింహా డిమాండ్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : ప్రభుత్వ ఆరోగ్య రంగంలో వెట్టి చాకిరికి గురవుతున్నసెకండ్ ఎఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మనెంట్ చేయాలని ఎఐటియుసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో సెకండ్ ఎఎన్‌ఎంల యూనియన్ జిల్లా స్థాయి ఆత్మీయ సమ్మేళనం జయమ్మ అధ్యక్షతన జరిగింది. సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా హాజరైన నరసింహా మాట్లాడు తూ రాష్ట్రంలో సెకండ్ ఎఎన్‌ఎంల సేవలు యావత్ తెలంగాణ ఆరోగ్య రంగానికే వన్నె తెచ్చే విధంగా ఉన్నాయన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఎఐటియుసి అనుబంధ సెకండ్ ఎఎన్‌ఎం యూనియన్ జిల్లా నూతన కమిటీని సమావేశంలో ఎన్నుకున్నారు. సలహాదారులుగా పి.జయమ్మ, గౌరవ అధ్యక్షుడిగా పి.సురేశ్, అధ్యక్షురాలిగా ఎస్.మంజుల, ఉపాధ్యక్షులుగా అలివేల, అంజమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఆర్.గిరిజారెడ్డి, సహాయ కార్యదర్శులుగా హేమలత, ఎం.రాణి, కోశాధికారి ఎల్లమ్మలతో పాటు 9 మంది కార్యవర్గ సభ్యులుగా 16 మంది కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పి.సురేశ్, వివిధ పిహెచ్‌సిల సెకండ్ ఎఎన్‌ఎంలు దేశ్లీ, చంద్రకళ, సుజాత, కృష్ణవేణి, అరుణేశ్వరి, పద్మ, రేణుక, లక్ష్మి, గౌరి, హేమలత, కవిత తదితరులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు మార్క్సిజమే మార్గం

సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి ప్రసాద్

ప్రజాపక్షం/ఖమ్మం : మానవాళి మనుగడకు మార్క్సిజమే మార్గమని, ప్రపంచగతిని మార్క్స్ ఆలోచనలు మార్చివేశాయని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. శ్రమదోపిడీ పోవాలంటే నవీన సమాజ నిర్మాణం జరగాలన్న మార్క్స్ ఆలోచనల వైపు ప్రపంచం మరలక తప్పదన్నారు. మార్క్స్ 141వ వర్ధంతి సందర్భంగా గురువారం సిపిఐ కార్యాలయంలో మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ, ఆర్థిక సామాజిక పరిణామాలను 150 ఏళ్లకు పూర్వమే ఊహించి వాటి పరిష్కారానికి మార్క్స్ అక్షర రూపమిచ్చారన్నారు. ప్రపంచంలో దోపిడీకి గురవుతున్న వర్గం, దోపిడీ వర్గాలకు మధ్య నిరంతర ఘర్షణ చోటు చేసుకుంటుందని ఆ ఘర్షణ నుంచే ప్రజా ఉద్యమాలు ఉద్భవిస్తాయని మార్క్స్ తెలిపారన్నారు. తన స్నేహితుడు ఎంగెల్స్‌తో కలిసి మార్క్స్ రచించిన కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక ప్రపంచంలోనే అనేక ప్రజా పోరాటాలకు మార్గదర్శిగా నిలవడంతో పాటు సమాజ పరిణామ క్రమానికి తెలిపిందన్నారు. 21వ శతాబ్దంలో శాస్త్రీయ పరిజ్ఞానం అంతగా పెరిగి తర్వాత ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పుడు మార్క్స్ రచించిన దాస్ క్యాపిటల్ మాత్రమే పరిష్కారం చూపిందన్నారు. వామపక్ష వ్యతిరేక భావజాలం కలిగిన మేధావి వర్గం దాస్ క్యాపిటల్ చదివి పరిష్కారాలు చూపారన్నారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలకు మార్క్స్ ప్రతిపాదిత సిద్దాంతాలే ప్రత్యామ్నాయాలు చూపగలవని ప్రసాద్ తెలిపారు. ఆయన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకు పోవడమే కమ్యూనిస్టుల కర్తవ్యం అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, శింగు నర్సింహారావు, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, మిడికంటి చిన్నవెంకటరెడ్డి, జిల్లా నాయకులు దొండపాటి రమేష్, పుచ్చకాయల సుధాకర్, తాటి నిర్మల, పగిళ్ల ఏసు, పావులూరి మల్లికార్జున్, యానాలి సాంబశివరెడ్డి, గాదె లక్ష్మినారాయణ, నూనె శశిధర్, యోబు, ఎస్‌కె సైదా, బి. రామకోటి, బి. శ్రావణ్, మేకల రవి, అచ్చన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిజం సిద్ధాంతాన్ని రూపొందించిన మహనీయుడు కారల్ మార్క్స్

వరంగల్ ప్రతినిధి : కమ్యూనిజం సిద్ధాంతాన్ని రూపొందించిన మహనీయుడు కారల్ మార్క్స్ అని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. గురువారం వరంగల్‌లోని శివనగర్ సిపిఐ జిల్లా కార్యాలయంలో కారల్‌మార్క్స్ వర్ధంతి నిర్వహించారు. మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మేకల రవి మాట్లాడుతూ ప్రపంచ కార్మికులారా పోరాడండి... పోరాడితే పోయేదేమి లేదు బానిస సంకేళ్లు తప్ప అనే నినాదంతో శ్రామికుల శ్రమకు తగిన ఫలితం ఇవ్వాలని ప్రపంచ కార్మికులను ఏకం చేసిన సిద్దాంతకర్త మార్క్స్ అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి ఎస్‌కే బాష్మియా, సంగీలేందర్, శరత్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మార్క్సిజం పేదప్రజలకు ఆక్సిజన్

పెద్దపల్లి ప్రతినిధి : మార్క్సిజం పేదప్రజలకు ఆక్సిజన్ అని సిపిఐ నగర కార్యదర్శి కే.కనకరాజ్ అన్నారు. గురువారం భాస్కరరావు భవన్లో కారల్ మార్క్స్ వర్ధంతిని నిర్వహించారు. మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రపంచ కార్మికులారా ఏకం కండి అనే సమర నినాదాన్ని అందించిన మహామేధావి కారల్ మార్క్స్ అన్నారు. మతం మత్తువంటిదని మతోన్మాదుల చేతిలో చిక్కకుండా ప్రజలను చైతన్య వంతులను చేయాలని కారల్ మార్క్స్ ఆనాడే చెప్పారని వారన్నారు. మార్క్స్ ఆశయాలు సాధించేందుకు రాబోయే కాలంలో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు మడికొండ ఓదెమ్మ, తొడుపునూరి రమేష్ కుమార్, బి.కనకయ్య, మార్కపురి సూర్య, శనిగరపు చంద్రశేఖర్, ఏర్రల రాజయ్య, రెనికుంట్ల ప్రీతం, కల్వల జగన్, చిలముల రాజయ్య, రేణుక, నస్పురి గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ కార్మికులను ఏకం చేసిన మహోన్నతుడు

హన్మకొండ ప్రతినిధి : శ్రామికుల శ్రమకు తగిన ఫలితం ఇవ్వాలని, ప్రపంచ కార్మికులను ఏకం చేసిన మహోన్నతుడు కారల్ మార్క్స్ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం హన్మకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో కారల్‌మార్క్స్ వర్ధంతిని నిర్వహించారు. మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో తక్కళ్లపల్లి మాట్లాడుతూ పెట్టుబడిదారుల గుట్టు రట్టు చేసి మిగులు విలువను విశ్వవ్యాప్తం చేసిన మహోన్నతుడు కారల్ మార్క్స్ అన్నారు. కార్యక్రమంలో సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా నాయకులు సిరబోయిన కర్ణాకర్, గక్కు రాజుగౌడ్, కొట్టెపాక రవి, బాషబోయిన సంతోష్, ఏశబోయిన శ్రీనివాస్, కండె నర్సయ్య, అంబి సాంబయ్య, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్నీ ఆదర్శంగా తీర్చిదిద్దుతా

కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/సుజాతనగర్ : మౌలిక వసతులు కల్పించి, ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని, అందుకు అధికారులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకారం అందించాలని కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశిరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు గురువారం కూనంనేని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి, సంబంధిత శాఖల మంత్రులకు, అధికారులకు నివేదిక అందించామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, తహసీల్దార్ జి.శిరీష, ఎంపిడివో వెంకటలక్ష్మి, సొసైటి చైర్మన్ మండే హనుమంతరావు, డిఈ సత్యనారాయణ, నందయ్య, ఏడిఏ యాసిన్, ఆర్‌ఐ టి.బాబు, సర్పంచ్ బండి రమేష్, ఏఈ మల్లికార్జున్, ఎంపీఓ ఖాన్, పంచాయతీరాజ్ ఏఈ శివలాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నిలోఫర్, ఎలక్ట్రికల్ ఏఈ కిషన్ ఏవో నర్మదా ఎంపీటీసీ భూక్యా పద్మావతి, సిపిఐ మండల కార్యదర్శి భూక్య దస్రు, సంయుక్త కార్యదర్శి కొమారి హనుమంతరావు, సహాయ కార్యదర్శి వేల్పుల భాస్కర్, పొదల శ్రీను, సిపిఐ జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లురావు, తాళ్లూరి పాపారావు, ధర్మారావు, టౌన్ ఏఐటిసి మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, దుర్గాప్రసాద్, సెక్రటరీ చెరుకూరి రామారావు, కాట్రవుల రాములు, మదన్ సింగ్, కృష్ణ, కొమారి కృష్ణ, భాగం కృష్ణ, భూక్యా శ్రీను, భూక్య కృష్ణ, భూక్యా రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వ్యాపారికి న్యాయం

లక్ష్మీ దేవిపల్లి : సకల సదుపాయాలతో వ్యాపారయోగ్యంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టాలని ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు సంబంధిత అధికారులకు సూచించారు. లక్ష్మీ దేవిపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో 21 షాపుల నిర్మాణానికి గురువారం కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధీర్ఘ కాలంగా వ్యాపారం చేసుకుంటున్న వ్యాపారులకు న్యాయం జరిగేలా షాపుల కేటాయింపు జరుగుతుందని, ఈ విషయంలో వ్యాపారులు ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, గనిగల్ల వీరస్వామి, గెడ్డాడు నగేష్, ఎంపిటిసి నునావత్ గోవింద్, స్థానికులు తూము చౌదరి, పూనెం శ్రీనివాస్, పెద్ద బాబు, గుత్తుల శ్రీనివాస్, మిర్యాల రాము, హేమంత్, తాటి బాలకృష్ణ, తేజావత్ బద్రు, హమాలీ కార్మికులు, వ్యాపారులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : కమ్యూనిస్టుల పోరాటాలతోనే సమస్య ల పరిష్కారం అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం హన్మకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో దామెర, ఆత్మకూరు మండలాల నుంచి పలు పార్టీల కార్యకర్తలు సిపిఐలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన అనంతరం సిపిఐ జిల్లా సమితి సభ్యులు కొట్టెపాక రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ అధికారం కోసమే పనిచేస్తున్న పార్టీలకు ఎన్నికలపుడే ప్రజల సమస్యలు గుర్తుకువస్తారన్నారు. కాని ఎర్రజెండా పార్టీలు నిరంతరం ప్రజల మధ్యనే ఉంటాయన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం వేలాది మందిని సమీకరించి భూపోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండాతోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన అమ్మ సాంబయ్య, గంధం గట్టన్న, పోలేపాక కుమార్, దాడి రవన్న, శోభక్క, జయక్క, కాడబోయిన శ్రీనివాస్, దయ్యాల రమేష్, నాగవల్లి రామన్న, దురేటి సురేష్ తదితరులు సిపిఐలో చేరారు. కార్యక్రమంలో సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, జిల్లా నాయకులు గక్కు రజు గౌడ్, కొట్టెపాక రవి,ఏశబోయిన శ్రీనివాస్, కండె నర్సయ్య, దామెర మండల కార్యదర్శి అంబి సాంబయ్య, దండు భాస్కర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

నర్సాపూర్ ఎంఎల్‌ఎ సునిత లక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/కౌడిపల్లి : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని నర్సాపూర్ ఎంఎల్‌ఎ వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన కౌడిపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ సునీత లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు చిలుముల సుహాసినిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ సునీత లక్ష్మారెడ్డి విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ చదువులతోనే ఉన్నతమైన స్థానాలు పొందవచ్చు అన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకోని చదివినప్పుడే ఉన్నత స్థానాల్లో రాణిస్తారన్నారు. విద్యార్థులు శ్రద్ధతో చదివి తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలని సూచించారు. విద్యార్థులకు మానవ విలువలతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు మంచిగా చదివి పాఠశాలకు, తమ తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. తల్లిదండ్రుల కలలను సహకారం చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల చదువుల విషయంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు మంచిగా రాయాలని ఆల్ ది బెస్ట్ చెప్పారు. అంతకుముందు విద్యార్థులు వారి అనుభవాలను వివరించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపిటిసి కాలేరు మంజుల శివాంజనేయులు, పాఠశాల మాజీ ఎస్‌ఎంసి చైర్మన్ జగన్, వైస్‌చైర్మన్ మర్రి వీణ శ్రీనివాస్, ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంపిఓ కలిముల్లా, మండల ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు సారా రామగౌడ్, నాయకులు నవీన్‌కుమార్, సందీప్, అధ్యాపక బృందం శేషగిరిరావు, పద్మజ, భవిత లింగప్ప,షేక్ బబ్బు, నాగజ్యోతి, రమేష్, శ్వేత రేణుక, కనక రాజు, శంకర్, రీత అర్చన, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సుఖ్‌బీర్ సింగ్, జ్ఞానేష్ కుమార్

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. కాగా, 1963లో జన్మించిన సంధు 1998 కార్యదర్శిగా పనిచేశారు. అంతకు ముందు సంధు ఉన్నత విద్యాశాఖ, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శిగా, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ) చైర్మన్‌గా కూడా సేవలు అందించారు. అమృత్‌సర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి ఎంబిబిఎస్ పూర్తి చేసిన సంధు అమృత్‌సర్ లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీ నుంచి హిస్టరీలో మాస్టర్స్ డిగ్రీ పొందారు. పంజాబ్‌లోని లుధియానా మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా చేసిన సేవలకు గుర్తింపుగా సంధుకు రాష్ట్రపతి మెడల్ లభించింది. భారత జన గణన సమయంలో చేసిన సేవలకు గుర్తింపుగా 2001లో ఆయన రాష్ట్రపతి మెడల్ అందుకున్నారు. మరో ఇసి జ్ఞానేష్ కుమార్ 1988 బ్యాచ్ కేరళ కేడర్ ఐఎఎస్ అధికారి. అమిత్ షా నేతృత్వంలోని సహకార మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా పనిచేశారు. అంతకుముందు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా వ్యవహరించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వీరిద్దరి ఎంపికతో ఇసిఐ ఊపిరి పీల్చుకుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : K Sreenivas Reddy,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com